సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 351

గురువారం 12-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

నకిలీ వార్తలపై వైఖరేంటి?

సోషల్ మీడియాలో నకిలీ వార్తలపై వైఖరి చెప్పాలని కేంద్రానికి నోటీసులు -5లో

నేడు తొలి వన్డే

ధర్మశాలలో తలపడనున్న భారత్, దక్షిణాఫ్రికా -స్పోర్ట్స్‌లో

● కొత్త పాత్ర

బీజేపీలోకి సింధియా

మధ్యప్రదేశ్ రాజకీయాలకు సంబంధించి బుధవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గ్వాలియర్ రాజవంశ వారసుడు జ్యోతిరాదిత్య సింధియా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

- 5లో

● వెబ్‌సైట్‌లో

టెన్త్ హాల్ టికెట్లు

ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లను తమ వెబ్‌సైట్‌లో (bse.telangana.gov.in) అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ నెల 12 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

- 4లో

● బీజేపీ బండికి..

సంజయుడే సారథి

తెలంగాణ రాష్ట్ర బీజేపీకి బండి సంజయ్ సారథి అయ్యారు. హిందుత్వ ఎజెండాను అమలు చేయడంలో, టీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కోవడంలో ముందుండటంతో జాతీయ నాయకత్వం సంజయ్ వైపు మొగ్గు చూపింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియామకపత్రం జారీ చేశారు.

- 2లో

● ఎస్‌బీఐ గుడ్ న్యూస్

'కనీస నిల్వ' ఎత్తివేత

ఎస్‌బీఐ ఖాతాదారులు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంచాలన్న నిబంధనను ఎత్తివేస్తున్నట్టు బ్యాంకు ప్రకటించింది. అదే విధంగా ఎస్ఎంఎస్ చార్జీలు ఎత్తేసినట్లు తెలిపింది. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణాలపై వడ్డీరేట్లను తగ్గించింది. దీంతో గృహ, వాహన రుణాలు చౌక కానున్నాయి.

- బిజినెస్‌లో

'అనంతగిరి'కి గోదారమ్మ

బుధవారం మిడ్‌మానేరు నుంచి ప్యాకేజీ-10 పంప్‌హౌస్ ద్వారా ఎత్తిపోసిన నీరు అనంతగిరి రిజర్వాయర్‌కు తరలివెళ్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల

కాళేశ్వరం నాలుగో దశకు శ్రీకారం

మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్‌కు ట్రయల్ రన్ సక్సెస్

మొదటగా రెండు పంపులకు, నేడు, రేపు మరో 2 పంపులకు ట్రయల్

ఈ వారంలోనే రంగనాయక్ సాగర్‌కు తరలింపు

25 నాటికి కొండపోచమ్మకు గోదావరి జలాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఇప్పటికే మొదటి, రెండో దశ ఎత్తిపోతల ద్వారా మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి మిడ్‌మానేరు (రాజరాజేశ్వరి) రిజర్వాయర్‌కు చేరుకున్న గోదావరి జలాల ప్రయాణం కొండలు, కోనలు, వాగులు, వంకలు, కాల్వలు, సొరంగ మార్గాలు దాటుకుంటూ కాళేశ్వర గంగమ్మ (గోదావరి), అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ చేరింది. బుధవారం మిడ్‌మానేరు దిగువన పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా నీటిని అనంతగిరి తరలించే ట్రయల్ రన్ ప్రక్రియ విజయవంతమైంది. 164.15 కి.మీ. ఎగువకు గోదావరి నీళ్లు ప్రయాణించాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు 10వ ప్యాకేజీ పూర్తయినట్లయ్యింది. ఈఎన్‌సీ హరిరామ్, నీటిపారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, ఎస్ఈ ఆనంద్ పర్యవేక్షణలో 106 మెగావాట్ల (1.40 లక్షల హెచ్‌పీ) సామర్థ్యంగల మోటారు ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని మధ్యాహ్నం 1.30 గంటలకు ఎత్తిపోసింది. ఇక్కడ నుంచి నీటిని రంగనాయక్‌సాగర్ మీదుగా ఈ నెల 25 నాటికి గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్‌కు చేరనున్నాయి.

90 మీటర్లు ఎగిసిపడిన జలాలు..

మధ్యమానేరు జలాశయం నుంచి 3.50 కి.మీ. కాలువ ద్వారా నీరు ఒబులాపూర్ చేరింది. అక్కడి నుంచి 7.65 మీటర్ల సొరంగ మార్గం ద్వారా తిప్పాపూర్ సర్జిపూల్ (మహాబావి)లోకి చేరాయి. అక్కడ ఏర్పాటు చేసిన 106 మెగావాట్ల సామర్థ్యంగల మోటార్ ద్వారా 90 మీటర్ల ఎత్తునకు నీటిని ఎత్తిపోశారు. దీంతో అనంతగిరికి నీరు చేరింది.

సీఎం ఆదేశాలతో ఆగమేఘాలపై

కాళేశ్వరం ప్రాజెక్టులో మొదటి దశలో మేడిగడ్డ, అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీ, పంప్‌హౌస్‌ల నుంచి నీరు ఇప్పటికే ఎల్లంపల్లి చేరగా రెండో దశలో

మిగతా 3వ పేజీలో ▶

రాష్ట్రానికి క్షేమం కాదు

బడ్జెట్‌పై చర్చలో భట్టి

- అప్పులు, మద్యంలో తప్ప బడ్జెట్‌లో అభివృద్ధి లేదు
- రూ. 1.82 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలతో విభేదిస్తున్నా
- రూ. 33 వేల కోట్ల ద్రవ్యలోటు, రూ. 30 వేల కోట్ల పన్నేతర ఆదాయం ప్రశ్నార్థకమే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2020-21 బడ్జెట్ ఏమాత్రం క్షేమకరం కాదని, బడ్జెట్‌లో సామాజిక స్పృహ లోపించిందని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అభూత కల్పనలతో సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా రూ. 1.82 లక్షల కోట్ల బడ్జెట్‌ను పెట్టి ప్రభుత్వం సభను, ప్రజలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. కేవలం అప్పులు, మద్యం విషయంలోనే బడ్జెట్‌లో అభివృద్ధి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఇది రాష్ట్ర ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. బడ్జెట్‌పై బుధవారం అసెంబ్లీలో జరిగిన సాధారణ చర్చలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం చూపిన ద్రవ్యలోటు రూ. 33 వేల కోట్లను పూడ్చుకొని మరో రూ. 30 వేల కోట్ల పన్నేతర ఆదాయాన్ని రాబడితే కానీ బడ్జెట్ వాస్తవ

మిగతా 2వ పేజీలో ▶

కోవిడ్ అలర్ట్

దక్షిణాదిలో వ్యాపిస్తున్న మహమ్మారి

12 రాష్ట్రాల్లో కేసులు నమోదు..

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో టెన్షన్ టెన్షన్
- బస్సు, రైల్వే మార్గాల్లోనూ వ్యాప్తి చెందే అవకాశం
- కట్టడి చేయడంపై వైద్య, ఆరోగ్యశాఖలో అస్పష్టత
- మంత్రికి, అధికారులకు మధ్య గ్యాప్!

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ చాపకింద నీరులా వ్యాపిస్తుంది. మొదట కేరళలో రెండు కేసులు.. తర్వాత తెలంగాణ, ఢిల్లీలో ఒక్కో కేసు నమోదైతేనే దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అలాంటిది ఇప్పుడు ఏకంగా 12 రాష్ట్రాల్లోకి కోవిడ్ పాకింది. మొత్తం 60 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది. దక్షిణాదిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల కోవిడ్ వ్యాప్తి ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నా, పరిస్థితి మాత్రం భయాందోళనగానే ఉంది. దక్షిణాదిలో మొన్నటివరకు కేరళ, తెలంగాణలోనే కేసులు నమోదు కాగా, ఇప్పుడు తమిళనాడు, కర్ణాటకలోనూ వెలుగు చూడటం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. తమిళనాడులో ఒకటి, కర్ణాటకలో ఒకేసారి నాలుగు పాజిటివ్ కేసులు నమోదు కావడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. సమీప రాష్ట్రాల్లో కేసుల నమోదు మనపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణలో పాజిటివ్ కేసు ఉన్న వ్యక్తికి పూర్తిగా నయం కావడం, అతడితో సంబంధం ఉన్న 88 మందికి కూడా నెగటివ్ రావడం ఊరట కలిగించే అంశమే. అయితే పక్క రాష్ట్రాల్లో విజృంభణ మన అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కేరళలో ఏకంగా 17 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో మనకు

మిగతా 2వ పేజీలో ▶

అ అవగాహనా? ఆ ఆందోళనా?

- ఫ్యామిలీలో

ఇద్దరు ఐటీ ఉద్యోగులకు కరోనా

బ్రిటన్ మంత్రికీ వైరస్

కోవిడ్ విస్తరించిన దేశాలు **107**

5 లో

ఓరుగల్లుకు మోనో లేదా మెట్రో!

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశం

- కుడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదముద్ర..
- మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం
- కార్పొరేషన్ పరిధిలో వెయ్యి పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు
- దసరాలోపు 3,900 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులతో సమీక్షలో నిర్ణయం
- పాల్గొన్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్..

సాక్షి, హైదరాబాద్: వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు ఆదేశించారు. వరంగల్‌లో 15 కిలోమీటర్ల మోనో రైలు మార్గంతో పాటు హైదరాబాద్ తరహాలో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. మామునూర్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. వరంగల్ నగరాభివృద్ధిపై బుధవారం ఆయన శాసనసభ కమిటీ హాల్‌లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌తో కలసి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాస్టర్ ప్లాన్‌కు ఈ సమావేశంలో కేటీఆర్ ఆమోదించారు. 2020-41 వరకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్‌తో నగర రూపురేఖలు మారిపోతాయని, గొప్ప నగరాల జాబితాలో వరంగల్ చేరుతుందని ఈ సందర్భంగా కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

జూన్ 2న ప్రారంభించాలి..: ఇక నగరానికి మంజూరైన 68 కిలోమీటర్ల రింగ్ రోడ్డులో 29 కిలోమీటర్ల మేర పనులు మే నెల చివరి నాటికి పూర్తి చేసి, తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ప్రారంభించాలని కేటీఆర్

మిగతా 2వ పేజీలో ▶

కుంచెకత్

ఎంతయినా చెప్పు కామ్రేడ్! ఈ విషయంలో మనకున్న ఓపిక ఏ పార్టీకీ లేదు!

ఇక గురుకుల జూనియర్ కాలేజీలు

- పదో తరగతి పూర్తయిన స్కూళ్లలో కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ గురుకుల పాఠశాలలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్తగా ప్రారంభించిన గురుకుల పాఠశాలలు ఇప్పటివరకు పదో తరగతికే పరిమితం కాగా.. వాటిల్లో కొత్తగా జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ఆయా సొసైటీలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించగా సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో విడతల వారీగా మంజూరైన గురుకుల పాఠశాలలను ప్రాధాన్యత ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తారు. ఈ మేరకు సంక్షేమ గురుకుల సొసైటీలు కసరత్తు చేస్తున్నాయి.

ఒక్కో తరగతి పెరుగుతూ..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల సొసైటీల పరిధిలో 959 విద్యా సంస్థలున్నాయి. ఇందులో 54 గురుకుల డిగ్రీ కాలేజీలు కాగా.. మిగతావి పాఠశాలలు,

మిగతా 2వ పేజీలో ▶

'సమ్మె' శాలరీ వచ్చేసింది

- ఆర్టీసీ సమ్మె కాలానికి నిధులు చెల్లిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- 235 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. గతేడాది జరిగిన ఆర్టీసీ సమ్మె కాలానికి సంబంధించి వేతనానికి నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీకి రూ.235 కోట్ల మొత్తాన్ని ఆర్థిక శాఖ బుధవారం విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ 5 నుంచి నవంబర్ 25 వరకు ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. తొలుత సమ్మెను ప్రభుత్వం పట్టించు కోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేప ట్టింది. అదే సమయంలో కొందరు ఉద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, దాదాపు 30 మంది గుండెపోటుతో చనిపోయారు. చివరకు కార్మిక సంఘాలు సమ్మెను విరమించాయి. అప్పటివరకు సమ్మె విషయంలో కఠినంగా వ్యవహరించిన ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అదే సమయంలో సమ్మె కాలానికి వేతనం కూడా ఇవ్వనున్నట్టు, ఉద్యోగులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఆమేరకు ప్రభుత్వం సమ్మె కాలానికి వేతనాల కోసం తాజాగా రూ.235 కోట్లు విడుదల చేసింది.

ఓరుగల్లుకు మోనో లేదా మెట్రో!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా వెంటనే నగరంలో 1,000 పబ్లిక్ టాయిలెట్లను దసరాలోపు నిర్మించాలని ఆదేశించారు. నగరంలో 250 పబ్లిక్ టాయిలెట్లు మాత్రమే ఉన్నాయని, ప్రభుత్వ స్థలాల్లో, కార్యాలయాల్లో వెయ్యి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పందుల నివారణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించి, పందుల పెంపకందార్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులు పందుల పెంపకందార్లను ఒప్పించాలన్నారు.

దసరా నాటికి ఇళ్లు

సీఎం కేసీఆర్ వరంగల్ పర్యటనలో ఇచ్చిన హామీల అమలు వేగంగా పూర్తి చేయాలని కేటీఆర్ ఆదేశించారు. నగరానికి మంజూరు చేసిన 3,900 డబుల్ బెడ్రూం ఇళ్లను దసరా నాటికి యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. పూర్తైన 900 ఇళ్లను త్వరలో ప్రారంభించాలన్నారు. మిగిలిన 3,000 ఇళ్లలో 2,200 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, కేవలం 800 ఇళ్లు స్థానిక సమస్యలతో ప్రారంభం కాలేదని స్థానిక ఎమ్మెల్యేలు కేటీఆర్ దృష్టికి తెచ్చారు. ఈ ఇళ్లను ప్రారంభించలేని పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని కేటీఆర్ ఆదేశించారు. పట్టణ ప్రగతిలో భాగంగా పారిశుధ్య ప్రణాళిక, హరిత ప్రణాళిక, ఎనర్జీ ఆడిట్ పూర్తి చేయాలన్నారు.

16న మరోసారి భేటీ..

వరంగల్ మరింతగా అభివృద్ధి కానున్న నేపథ్యంలో నాలుగు వైపులా డంపింగ్ యార్డులు గుర్తించాలని సూచించారు. ప్రస్తుత డంపింగ్ యార్డులో బయో మైనింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్పొరేషన్‌లో కలసిన శివారు ప్రాంతాలకు మూడో వంతు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని తెలిపారు. ఈ నెల 16న మరోసారి సమావేశమై ముఖ్యమైన అంశాల మీద చర్చిస్తామని.. అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు. సమావేశంలో చీఫ్ విప్ వినయ్ భాస్కర్, కడియం శ్రీహరి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు టి. రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మేయర్ గుండా ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఇక గురుకుల జూనియర్ కాలేజీలు

▶ మొదటి పేజీ తరువాయి

జూనియర్ కాలేజీలే. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 54 గురుకుల డిగ్రీ కాలేజీలతో పాటు 585 గురుకుల పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. 2015-16 విద్యా సంవత్సరం నుంచి విడతల వారీగా గురుకుల పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ దశలో గురుకుల పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ.. వీటిలో 5 ,6, 7 తరగతులకు మాత్రమే ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలా తొలి ఏడాది మూడు తరగతులతో ప్రారంభమైన గురుకుల పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ఒక తరగతి పెరుగుతూ వస్తోంది.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన గురుకుల పాఠశాలలు

సొసైటీ	పాఠశాలలు
ఎస్సీ	104
ఎస్టీ	51
బీసీ	238
మైనారిటీ	192

71 మైనార్టీ జూనియర్ కాలేజీలు

వచ్చే విద్యా సంవత్సరంలో మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో కొత్తగా 71 గురుకుల పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ఈ పాఠశాలల్లో ప్రస్తుతం పదో తరగతి బ్యాచ్ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతోంది. అదేవిధంగా 2021-22 విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 119, మైనార్టీ గురుకుల సొసైటీ పరిధిలో 80, గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో 50 జూనియర్ కాలేజీలు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటుగా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో మరో వంద జూనియర్ కాలేజీల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

నాలుగు కోర్సులతో ఇంటర్

గురుకుల జూనియర్ కాలేజీల్లో నాలుగు కోర్సులకు ప్రభుత్వం అనుమతిస్తోంది. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులుంటాయి. ఒక్కో కోర్సులో 60 సీట్లుంటాయి. గురుకుల జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థులకు పోటీ పరీక్షలకూ సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇస్తారు. ఎంసెట్, నీట్, క్లాట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు ఫస్టియర్ నుంచే అదనపు తరగతులు నిర్వహిస్తారు.

కోవిడ్ అలర్ట్

▶ మొదటి పేజీ తరువాయి

నిరంతరం రాకపోకలుంటాయి. అక్కడి పాజిటివ్ కేసులు విస్తరించకుండా మనమూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బస్సులు, రైళ్లలో ప్రయాణం..

ప్రజల్లో కోవిడ్‌పై అవగాహన, భయం ఏర్పడింది. అయితే వ్యాప్తి చెందకుండా చేయగలిగేది జాగ్రత్తలే. దేశంలో ప్రస్తుతం విమానాశ్రయాల్లోనే థర్మల్ స్క్రీనింగ్ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల ద్వారా బుధవారం నాటికి దేశవ్యాప్తంగా 10.57 లక్షల మందికి థర్మల్ స్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అందులో హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 50,679 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో అనుమానితులను గాంధీ సహా ఇతర ప్రభుత్వ నిర్ధారిత ఆస్పత్రుల్లో ఐసోలేషన్ చేసి, పరీక్షలు నిర్వహించారు. అయితే ఇప్పుడు కర్ణాటక, తమిళనాడు నుంచి మన రాష్ట్రానికి అనేకమంది రైళ్లు, బస్సుల ద్వారా వస్తుంటారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ఎలాంటి థర్మల్ స్క్రీనింగ్ సెంటర్లు లేవు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులను, చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చేవారు రైళ్లను ఆశ్రయిస్తుంటారు. ఇలా వచ్చే వారిపై నిఘా లేనేలేదు.

బస్సుల సంగతేంటి?

బస్సులు, రైళ్లలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారిపై నిఘా, పర్యవేక్షణ లేదు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను ప్రశ్నించగా, అలాంటి ఏర్పాట్లు లేవని, ప్రజలు అవగాహనతో మసలుకోవాలని పేర్కొనడం గమనార్హం. మన రాష్ట్రంలో నమోదైన కోవిడ్ పాజిటివ్ బాధితుడు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులోనే వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇంత జరిగినా బస్టాండ్లపై నిఘా పెట్టడంపై నిర్లక్ష్యం చూపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ ఎందుకు శ్రద్ధ పెట్టట్లేదన్న చర్చ జరుగుతోంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కోవిడ్ వైరస్ కట్టడిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమన్వయ లోపం..

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, కొందరు అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. కమాండ్ కంట్రోల్ రూంను కోఠిలో ఏర్పాటు చేసినా, కొందరు అధికారులు అక్కడకు రావట్లేదన్న చర్చ జరుగుతోంది. కమాండ్ కంట్రోల్ రూం అక్కడ 24 గంటలూ పనిచేస్తోందని చెబుతున్నా ఆచరణలో అలా కన్పించట్లేదు. కమిటీలు వేసినా, రోజువారీ సమీక్షలో వైఫల్యం అవుతున్నారన్న చర్చ జరుగుతోంది. మంత్రి ఈటల నిర్వహించే సమీక్షలకు కొందరు సీనియర్ అధికారులు డుమ్మా కొట్టడంపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. దీనిపై మంత్రి ఈటల కూడా కాస్త అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ఇది వాస్తవిక బడ్జెట్

- అయితే కొన్ని సందేహాలు ఉన్నాయి.. వాటిని ప్రభుత్వం తీర్చాలి
- అదనపు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో స్పష్టం చేయాలి
- పాతబస్తీ అభివృద్ధికి రూ.2 వేల కోట్లు ఇవ్వాలి
- కేంద్ర సహకారం లేకే రాష్ట్రంపై అప్పుల భారం
- బడ్జెట్‌పై చర్చను ప్రారంభించిన ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: దేశం ఆర్థిక తిరోగమనం వైపు పయనిస్తోన్న దశలో సొంత ఆదాయ వనరులపై ఆధారపడి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందని, ఇది వాస్తవిక బడ్జెట్ అని ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి తగినంత సహకారం అందడం లేదని, అందుకే రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిపోతోందని ఆయన విమర్శించారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 8న ఆర్థిక మంత్రి హరీశ్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చను బుధవారం అక్బరుద్దీన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలు ఆశించినంతగా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిరాశ కలిగించే బడ్జెట్ కేంద్ర బడ్జెట్ అని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు స్పెషల్ గ్రాంటు ఇవ్వాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేసినా కేంద్రం ఇవ్వలేదని, కాళేశ్వరం నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని, జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. కేంద్ర పన్నుల వాటా, గ్రాంటులు కలిపి రాష్ట్రానికి పెరిగింది రూ.513 కోట్లేనన్నారు. సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ చార్జీలు పెంచక తప్పలేదని, ఇప్పుడు కరెంటు చార్జీలు పెరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. గృహ వినియోగదారులపై చార్జీల పెంపు ప్రభావం ఉంటుందా లేదా అన్న దానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. మోటారు వాహనాల రంగం సంక్షోభంలో ఉన్న దశలో మోటారు వాహనాల పన్ను పెంచుకుంటామని ఎలా ప్రతిపాదించారో అర్థం కావట్లేదన్నారు. భూముల విక్రయాల ద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు సఫలం కాలేదన్నారు. గత ఐదేళ్లలో దీనిపై రూ.3,987 కోట్లు మాత్రమే వచ్చాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

వడ్డీలు రెండున్నర రెట్లు పెరిగాయి..

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ.2.29 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి అనుగుణంగానే ఉన్నప్పటికీ వడ్డీ చెల్లింపులు రెండున్నర రెట్లు పెరిగాయని అక్బరుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో రూ.2 వేల కోట్లు పాతబస్తీ అభివృద్ధి కోసం కేటాయించాలని కోరారు. ఏటా ఇచ్చే రూ.10 వేల కోట్లను ఎలా ఖర్చు చేయాలనే దానిపై నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులతో మున్సిపల్ మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని కోరారు. గతంలో వైఎస్సార్ అధికారంలో ఉన్నప్పుడు పాతబస్తీకి ప్రత్యేకంగా రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించారని, ఆ తర్వాత పట్టించుకున్న వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఉర్దూ లేకుండా పోతోందని, ఖాళీలు భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. ఐటీని ఓల్డ్ సిటీ వైపు విస్తరించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లను మైనారిటీలకు కూడా కేటాయించాలని కోరారు. రేషన్ కార్డులు ఇవ్వాలని, పీఆర్‌సీ అమలు చేయాలని, వక్ఫ్ బోర్డు బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు.

'కేసీఆర్ రైతుబంధు'గా పేరు పెట్టాలి

- కేసీఆర్ తెచ్చిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శం
- విమర్శలు చేసేవారు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలి
- అసెంబ్లీలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, పంట సీజన్ రాగానే రైతుల అకౌంట్లలో పెట్టుబడి సాయం పడుతోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. దీంతో రైతులు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లడం మానేశారని, వ్యవసాయాన్ని వదిలేసిన వారు కూడా ఇప్పుడు వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో ఆలోచించి ఇలాంటి గొప్ప పథకాన్ని తీసుకొచ్చారని, ఈ పథకం స్ఫూర్తితోనే కేంద్రం కూడా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తెచ్చిందన్నారు. ఇలా దేశానికి స్ఫూర్తిదాయకమైన ఈ పథకానికి 'కేసీఆర్ రైతుబంధు'గా నామకరణం చేయాలని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్‌పీ చివరి ఆయకట్టు కావడంతో తమ నియోజకవర్గమైన భూపాలపల్లికి 31 ఏళ్ల కిందట కాలువలు తవ్వినా ఒక్క రోజు కూడా నీళ్లు రాలేదన్నారు. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుతో కాకతీయ కాలువలో 150 రోజుల నుంచి నీళ్లు పారుతున్నాయన్నారు. విమర్శలు చేసే వారంతా ఈ ప్రాజెక్టును చూస్తే వారి అభిప్రాయం మారిపోతుందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ ఎమ్మెల్యేలు ఓసారి ప్రాజెక్టును చూసి రావాలని సూచించారు. ధాన్యం ఇతర పంటలను ఎక్స్‌పోర్టు చేసేందుకు రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్నికలు ముగిశాక కూడా కొత్త పథకాలు

బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారని, పట్టణాభివృద్ధికి చర్యలు వేగవంతం చేశారన్నారు. వరంగల్ లాంటి పట్టణాల్లో ఐటీ విస్తరణకు మంత్రి కేటీఆర్ విశేష కృషి చేస్తున్నారు. ఏ ప్రభుత్వాలైనా ఎన్నికల ముందు పథకాలు తీసుకురావడం సాధారణమని, కేసీఆర్ మాత్రం ఎన్నికలు పూర్తయ్యాక కూడా కొత్తపథకాలు తెస్తున్నారన్నారు. సరిపడా విద్యుత్, నీరు అందుబాటులో ఉండటం వల్ల భూములు అమ్మకుండా వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ఎస్సీ, ఎస్టీలకు 3 ఎకరాల భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా భూమి లభించట్లేదన్నారు.

బీజేపీ బండికి సంజయుడే సారథి

తీవ్ర పోటీ ఉన్నా సంజయ్‌వైపే అధిష్టానం, ఆర్ఎస్ఎస్ మొగ్గు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీకి బండి సంజయ్ సారథి అయ్యారు. హిందుత్వ ఎజెండాను అమలు చేయడంలో, టీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కోవడంలో ముందుండటంతో జాతీయ నాయకత్వం సంజయ్ వైపు మొగ్గు చూపింది. ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధం, పార్టీ ఆదేశాలను తు.చ. తప్పకుండా పని చేసే నేతగా, పక్కా హిందూత్వవాదిగా పేరుండటంతో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కరీంనగర్ ఎంపీ సంజయ్‌ను బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, హెడ్ క్వార్టర్స్ ఇన్‌చార్జి అరుణ్‌సింగ్ నియామక పత్రం జారీ చేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన సంజయ్‌కి యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది. 2019లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో గెలవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

తీవ్ర పోటీ ఉన్నా...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారనేది కొంతకాలంగా హాట్ టాపిక్‌గా మారింది. రెండోసారి అధ్యక్ష పదవి కోసం కె.లక్ష్మణ్ తీవ్రంగా ప్రయత్నించారు. ఇటు మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కూడా పోటీ పడ్డారు. పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేశారు. 2023లో రాష్ట్రంలో అధికారంలోకి తేవాలన్న లక్ష్యంతో ఉన్న జాతీయ పార్టీ.. రాష్ట్రంలో హిందుత్వ ఎజెండా అమలు, పార్టీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలోపేతం చేసేందుకు సంజయ్‌కే ఈ పదవి ఇస్తారన్న ఊహగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే స్థానిక నాయకత్వంతో చర్చించిన పార్టీ అధినాయకత్వం సంజయ్‌కే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. చివరివరకు లక్ష్మణ్ పేరు పరిశీలనలో ఉన్నా జాతీయ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పూర్తిస్థాయిలో సంజయ్‌వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది.

సంస్థాగతంగా బలోపేతం: లక్ష్మణ్

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్ నియమితులు కావడం పట్ల కె.లక్ష్మణ్ అభినందనలు తెలిపారు. బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ తెలంగాణలో సంస్థాగతంగా బలోపేతమవుతుందని పేర్కొనారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి 2023లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు సంజయ్ కృషి చేస్తారని ఆకాంక్షించారు.

బయోడేటా..

- పేరు: బండి సంజయ్ కుమార్
- పుట్టిన తేదీ: 1971, జూలై 11
- పుట్టిన స్థలం: కరీంనగర్
- తల్లిదండ్రులు: శకుంతల, నర్సయ్య
- భార్య: అపర్ణ (ఎస్‌బీఐ ఉద్యోగిని)
- పిల్లలు: భగీరథ్, సుముఖ్
- విద్యార్హతలు: ఎంఏ

బండి సంజయ్ భయపడడు..

- హిందూ ధర్మం కోసం పని చేస్తా
- టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం
- 'సాక్షి'ఇంటర్వ్యూలో బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: బండి సంజయ్ దేనికీ భయపడే వ్యక్తి కాడని, హిందూ ధర్మం కోసం పనిచేస్తూనే ఉంటానని రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు. టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడటమే తమ ప్రస్తుత కర్తవ్యమని, పేదల అభ్యున్నతికి పాటుపడి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు..

సాక్షి: సీనియర్లు ఉన్నా మీకు అధ్యక్ష పదవి వచ్చింది. తెలంగాణలో బీజేపీ బండిని ఏ మేర లాగుతారు?

సంజయ్: సీనియర్లందరి సాయంతో, వారి మార్గదర్శనంలో తెలంగాణలో కమల వికాసం కోసం పనిచేస్తాం.

సాక్షి: బండి సంజయ్ మతానికి సంబంధించి దూకుడుగా మాట్లాడతారని, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణమయ్యారని పేరుంది. ఇప్పుడు మీ వైఖరి ఎలా ఉండబోతోంది? ఎలాంటి థ్రెట్స్ ఉండే అవకాశం ఉంది?

సంజయ్: దేనికీ భయపడే వ్యక్తి బండి సంజయ్ కాదు. నేను హిందువును. హిందూ ధర్మం కోసం పనిచేస్తా. దాంట్లో ఇబ్బందేమీ లేదు. ఇంకో మతాన్ని నేను ఎప్పుడూ వ్యతిరేకించలేదు. మైనారిటీ ఓటు బ్యాంకు కోసం, హిందూ ధర్మాన్ని అవహేళన చేసేలా ఎంఐఎం పనిచేస్తే కూడా టీఆర్ఎస్ దానికి మద్దతు పలుకుతోంది. హిందూగాళ్లూ బొందూగాళ్లూ అని ముఖ్యమంత్రే అంటున్నడు. అలాంటి విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుంటం. బీజేపీ 80 శాతం ఉన్న హిందువుల కోసం పోరాడితే మత తత్వ పార్టీగా చిత్రించేందుకు టీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్, కమ్యునిస్టు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. టీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లు.. ఒక వర్గానికే కొమ్ము కాస్తూ సెక్యులర్ వాదులుగా సమాజంలో చెలామణీ అవుతున్నారు.

సాక్షి: మీ ముందున్న తక్షణ కర్తవ్యమేంటి? ఎలాంటి సవాళ్లు మీ ముందున్నాయి?

సంజయ్: టీఆర్ఎస్ బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను వంచిస్తోంది. కేంద్ర సంక్షేమ పథకాలను పేర్లు, ఫొటోలు మార్చి మోసం చేస్తోందో, కేంద్ర నిధులను ఎలా దారి మళ్లిస్తోందో ప్రజలకు వివరిస్తాం. టీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడటమే మా కర్తవ్యం. తెలంగాణలో కచ్చితంగా కాషాయ జెండా రెపరెపలాడేలా చేస్తాం.

సాక్షి: బీజేపీలో గ్రూపు విభేదాలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి?

సంజయ్: గ్రూపులు ఉండటం అవాస్తవం. బీజేపీ ఒక వ్యక్తి నిర్ణయం మీద నడవదు. అందరం కలసికట్టుగా నిర్ణయం తీసుకునే పార్టీ. అనేక కమిటీల ద్వారా మా కార్యాచరణ ముందుకు సాగుతుంది. శక్తిమంతమైన కార్యకర్తలు ఉన్నారు. తెగించి కొట్లాడే కార్యకర్తలు ఉన్నారు.

సాక్షి: ఉత్తర తెలంగాణలోనే బీజేపీ కన్పిస్తోందని, రాష్ట్రం మొత్తం ప్రాబల్యం తక్కువగా ఉందని విమర్శలపై ఏమంటారు?

సంజయ్: అలా ఏం లేదు. మొన్న నాలుగు పార్లమెంటు స్థానాలు గెలిచాం. మున్సిపల్ ఎన్నికల్లో మా ఓటు బ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేశాం. బీజేపీ కార్యకర్త లేని బూత్ తెలంగాణలో లేదు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని ప్రజలు గుర్తిస్తున్నారు. వారి విశ్వాసం వమ్ము చేయకుండా అదే తరహాలో ఉద్యమాలు ఉధృతం చేస్తాం. బీజేపీలోని సీనియర్ నేతలు, అనుభవజ్ఞుల సలహాలతో పార్టీని బలోపేతం చేస్తాం.

జేఎన్‌టీయూ-హైటెక్‌సిటీ..

- ట్రామ్ లేదా బీఆర్‌టీఎస్ ఏర్పాటు
- దీనిపై త్వరలోనే స్పష్టతనిస్తాం: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీ వరకు ఎలివేటెడ్ పద్ధతిలో బీఆర్‌టీఎస్ కారిడార్ గాని ట్రామ్ ట్రాన్స్‌పోర్టు విధానాన్ని కాని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దీనిపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆయన శాసనసభకు తెలిపారు. జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో మెట్రో కారిడార్ నిర్మించాలని, తీవ్ర రద్దీ పెరిగిన సుచిత్ర కూడలి నుంచి కూడా ఈ తరహా ఏర్పాటు అవసరమని, కానీ అక్కడ మెట్రో నిర్మాణానికి వీలుగా స్థలం లేనందున కనీసం ఎంఎంటీఎస్‌నైనా ఏర్పాటు చేయాలని టీఆర్ఎస్ సభ్యుడు వివేకానంద కోరారు. జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీ వైపు రద్దీ తీవ్రంగా ఉన్నందున అక్కడ ప్రత్యేక వ్యవస్థ అవసరమని, అయితే ట్రామ్ మార్గాన్ని గాని ఎలివేటెడ్ కారిడార్ ద్వారా బీఆర్‌టీఎస్ విధానాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు మంత్రి పేర్కొన్నారు. మెట్రో రైళ్లలో పాస్‌ను ప్రవేశపెట్టే అంశం కూడా పరిశీలనలో ఉందని, ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా రాత్రివేళ వాటి సమయాన్ని పొడిగించే యోచనలో ఉన్నామన్నారు. ప్రస్తుతం 20 వేల ద్విచక్రవాహనాలు, 400 కార్లు నిలిపేందుకు వీలుగా వివిధ ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లలో పార్కింగ్ సౌకర్యం కల్పించామని, త్వరలో 20 ప్రాంతాల్లో మల్టీలెవల్ పార్కింగ్ టవర్లు నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం రూ.14,500 కోట్లు కాగా, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌గా 10 శాతం మొత్తాన్ని కేంద్రప్రభుత్వం భరించిందని, అందులోనూ ఇంకా రూ.2 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఎంజీబీఎస్ నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న ఫలక్‌నుమా వరకు వీలైనంత త్వరలో మెట్రో రైలు కారిడార్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.



మైనారిటీ గురుకులాలకు జూనియర్ కాలేజీ హోదా: కొప్పుల

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 71 మైనారిటీ గురుకుల విద్యాలయాలను జూనియర్ కళాశాలలుగా స్థాయి పెంచనున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం షకీల్ అహ్మద్, విద్యాసాగరరావు, స్టీఫెన్‌సన్, గాదరి కిషోర్‌కుమార్, హరిప్రియ, సురేందర్, బాల్క సుమన్ తదితరులు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన పలు ప్రశ్నలకు సమాధానంగా వివరాలు వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేని తరహాలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖ గురుకులాలను అద్భుతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీటిల్లో ఒక్కో విద్యార్థిపై సగటున రూ

కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎవరైనా కాంగ్రెస్ పార్టీ నీడన నాయకుడు కావాలే తప్ప, నాయకుని చేతిలో కాంగ్రెస్ పార్టీ ఉండాల్సిన అవసరం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో హీరోలే లేరని, రేవంత్‌రెడ్డి ఒక్కరే హీరో అంటూ ఆయన అనుచరులు చేస్తున్న ప్రచారాన్ని ఖండించాలన్నారు. వెంటనే పార్టీ కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి దీనిని ఖండించాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బుధవారం జగ్గారెడ్డి కోరారు. సొంత నియోజకవర్గంలో కార్యక్రమాలకు సంబంధించి నాయకులు, ఎమ్మెల్యే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రం విషయంలో ప్రజలకు సంబంధించిన అంశాలు ఏమైనా ఉంటే కోర్ కమిటీలో చర్చించాకే పార్టీ అధ్యక్షుడు ప్రకటన జారీ చేస్తారని, ఆయన ఆదేశాల మేరకు ఉద్యమాలు చేసే సంప్రదాయం ఉందన్నారు. దానిని రేవంత్ బ్రేక్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామన్నారు. రేవంత్ గతంలో ఉన్నట్లుగానే పార్టీ క్రమశిక్షణను కొనసాగించాలన్నారు. కాంగ్రెస్‌లో ఎవరూ హీరోలు కాదని, కాంగ్రెస్ పార్టీ, సోనియా, రాహుల్‌లే హీరోలన్నారు. కుంతియా దగ్గరున్న కొందరు ప్రోటోకాల్ ఇన్‌చార్జ్‌లను తక్షణమే మార్చాలన్నారు.

కోవిడ్ విస్తరించకుండా హెపా ఫిల్టర్లు

గాంధీ, ఉస్మానియా, ఛాతీ, ఫీవర్ ఆస్పత్రుల్లో ఏర్పాటు

- రాష్ట్రంలో మరో మూడు చోట్ల కోవిడ్ పరీక్ష కేంద్రాలు
- కోవిడ్ బాధితుడికి 2 సార్లు నెగెటివ్..
- త్వరలో డిశ్చార్జి చేసి ఇంటికి పంపుతాం
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ విస్తరించకుండా హెపా ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గాంధీ, ఉస్మానియా, ఫీవర్, ఛాతీ ఆస్పత్రుల్లో ఒక్కో ఫిల్టర్ ఏర్పాటుచేయనున్నారు. వైరస్ సోకిన వ్యక్తి ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందాక, ఆయా గదుల్లో వైరస్, బ్యాక్టీరియా ఉంటుంది. కిటికీలు తెరిస్తే ఆ వైరస్ బయటకు విస్తరించే అవకాశముంది. ఈ నేపథ్యంలో కోవిడ్ సోకిన వ్యక్తి గదుల్లోని వైరస్‌ను, బ్యాక్టీరియాను ఈ హెపా ఫిల్టర్లు చంపేసి, స్వచ్ఛమైన గాలిని బయటికి పంపిస్తాయి. ఈ ఫిల్టర్లను ఏర్పాటు చేశాక ఆయా ఆస్పత్రుల చుట్టుపక్కల ఉన్న వారు భయాందోళనలకు గురికావాల్సిన పనిలేదు. ఒక్కో ఫిల్టర్‌ను రూ.1.5 కోట్లతో కొనుగోలు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. కోవిడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో బుధవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇప్పటికే గాంధీ, ఉస్మానియాలో కోవిడ్ నిర్ధారణకు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ, హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఫీవర్ ఆస్పత్రుల్లోనూ కోవిడ్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతించిందని వెల్లడించారు. మరో నాలుగైదు రోజుల్లో ఈ ల్యాబ్‌ల్లోనూ పరీక్షలు మొదలవుతాయని తెలిపారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో గురువారం నుంచి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు మొదలుపెడతామన్నారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని 5 ఆస్పత్రులతో పాటు పాత జిల్లా కేంద్రాల్లోని జిల్లా ఆస్పత్రుల్లో కోవిడ్ సహా ఇతరత్రా వైరస్‌ల నియంత్రణకు ఐసోలేషన్, ఐసీయూ కేంద్రాలను శాశ్వత పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

108కూ కాల్స్ చేయొచ్చు..

ప్రస్తుతం 104 కాల్ సెంటర్‌తో పాటు 108 కాల్ సెంటర్‌కు కూడా ఫోన్ చేసి కోవిడ్ లక్షణాలున్నవారు సాయం కోరొచ్చని మంత్రి తెలిపారు. విమానాశ్రయంలో ప్రతి ఒక్కరినీ స్క్రీనింగ్ చేస్తున్నామని చెప్పారు. లక్షణాలుంటే అక్కడి నుంచి నేరుగా ఆస్పత్రులకు తరలిస్తామని వివరించారు. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. కోవిడ్ వైరస్ ఎదుర్కొనేందుకు చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను సీఎం నియమించారన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీదేవి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. టెండర్లకు వెళ్లకుండా అవసరమైన పరికరాలన్నింటినీ కొనుగోలు చేసే బాధ్యత ఆమె చూస్తారన్నారు. మరో ఐఏఎస్ అధికారి మాణిక్‌రాజ్ విమానాశ్రయం నుంచి రోజూ వచ్చే దాదాపు 5 వేల మంది ప్రయాణికులను ట్రాక్ చేసి 104, 108 కాల్ సెంటర్ల ద్వారా గుర్తించి 14 రోజుల పాటు వారందరూ ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ ఇన్‌చార్జిగా సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల భాగస్వామ్యంతోనే ఇలాంటి వైరస్ వ్యాప్తిని అరికట్టగలమన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితా రాణా, ఆయుష్ డైరెక్టర్ అలుగు వర్షిణి, ప్రత్యేకాధికారి శ్రీదేవి, ప్రజారోగ్య డైరెక్టర్ శ్రీనివాసరావు, ఐపీఎం డైరెక్టర్ శంకర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి పుట్ట రాజు తదితరులు హాజరయ్యారు.

రెండు సార్లు నెగెటివ్..

దుబాయ్ నుంచి ఇటీవల వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కోవిడ్ సోకడంతో ఇప్పటివరకు గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేశామని, అతడికి ఇప్పటివరకు మరో 2 సార్లు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ వచ్చిందని ఈటల తెలిపారు. దీంతో అతన్ని త్వరలోనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపిస్తామన్నారు. సోషల్ మీడియాలో బాధ్యత లేని కొందరు చేస్తున్న ప్రచారం తప్పని తేలిపోయిందన్నారు. వైరస్ సోకిన వ్యక్తులకు లక్షణాలను బట్టి చికిత్స అందించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్ఐఏ కస్టడీకి మద్దిలేటి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటిని బుధవారం చర్లపల్లి జైలు నుంచి ఎన్ఐఏ తన కస్టడీలోకి తీసుకుంది. మావోయిస్టు అనుబంధ సంస్థగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టీవీవీపై పోలీసులు గతంలోనే దృష్టి సారించారు. ఈ కేసు తర్వాత గత డిసెంబర్‌లో ఎన్ఐఏకు బదిలీ కాగా.. మద్దిలేటిని ప్రశ్నించేందుకు కస్టడీ కోరుతూ ఎన్ఐఏ పిటిషన్ వేసింది. దీంతో ఎన్ఐఏ ఐదు రోజుల పాటు మద్దిలేటిని విచారించనుంది. అలాగే వరంగల్ జైల్లో ఉన్న విప్లవ రచయితల సంఘం (విరసం) కార్యదర్శి ప్రొఫెసర్ కాశీంను చర్లపల్లి జైలుకు తరలించారు.

'అనంతగిరి'కి గోదారమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు తరలించారు. గతేడాది నవంబర్ నుంచి మిడ్‌మానేరులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ నాలుగో దశ ఎత్తిపోతల ప్రక్రియ ప్రారంభం కాలేదు. మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్‌కు తరలించాలంటే అనంతగిరి గ్రామాన్ని ఖాళీ చేయాల్సి ఉన్నా అక్కడ కోర్టు కేసుల కారణంగా అది సాధ్యపడలేదు. అయితే ఇటీవల నిర్వాసితుల తరలింపు ప్రక్రియను వెంటనే చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో ఆగమేఘాలపై ఎస్సీ కాలనీని ఖాళీ చేయించారు. అయినప్పటికీ మరో పదిగృహాలు ఇంకా ఖాళీ చేయాల్సి ఉంది. ఆ గృహాలకు ఇబ్బంది లేకుండా 3.5 టీఎంసీల నిల్వ సామర్థ్యంగల అనంతగిరిలోకి ప్యాకేజీ-10లోని 4 మోటార్ల ద్వారా 0.8 టీఎంసీల నీటిని తరలించాలని ముఖ్యమంత్రి మంగళవారం రాత్రి ప్రాజెక్టు ఈఎన్‌సీ హరిరామ్‌ను ఆదేశించారు. దీంతో హుటాహుటిన బుధవారం ఉదయం 106 మెగావాట్ల సామర్థ్యంగల ఒక మోటార్ ద్వారా తొలి ఎత్తిపోతలు చేశారు. ఇది విజయవంతం కావడంతో ఆ మోటార్‌ను 10 గంటలపాటు నిరంతరాయంగా నడిపించి రాత్రికి రెండో మోటార్ ఆన్ చేశారు. గురు, శుక్రవారాల్లో మరో రెండు మోటార్లను సైతం నడిపించి మొత్తంగా 0.8 టీఎంసీ నీటిని అనంతగిరికి తరలిస్తారు. అనంతరం అనం తగిరి నుంచి ప్యాకేజీ-11 లోని 134.4 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటార్ల ద్వారా నీటిని రంగనాయక్ సాగర్‌కు తర లిస్తారు. ఈ పంపులన్నీ ఇప్పటికే సిద్ధమయ్యాయి. రంగ నాయక్ సాగర్‌కు ఈ వారంలోనే నీటిని తరలించే ప్రక్రియ మొదలవుతుందని, మరో నాలుగైదు రోజుల్లో 3 టీఎంసీల ఈ రిజర్వాయర్‌ను నింపుతామని ఈఎన్‌సీ హరిరామ్ తెలిపారు.

25 నాటికి కొండపోచమ్మకు..

రంగనాయక్ సాగర్ నుంచి నీటిని గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించేలా ప్యాకేజీ-12లో 16.18 కి.మీ. టన్నెల్ పనులు పూర్తికాగా 8 పంపుల్లో అన్నీ సిద్ధమయ్యాయి. ఇదే ప్యాకేజీలో ఉన్న కొమరవెల్లి మల్లన్నసాగర్ పనులు మొదలయ్యాయి. ఇక్కడ భూసేకరణ సమస్యగా ఉండటంతో రిజర్వాయర్ పనులు పూర్తికాకున్నా 18 కి.మీ. మేర ఫీడర్ చానల్ ద్వారా 15 టీఎంసీల సామర్థ్యంతో చేపడుతున్న కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25 నాటికి కొండపోచమ్మకు గోదావరి జలాలు చేరతాయని, కనీసంగా 240 కిలోమీటర్ల గోదావరి తరలిరానుందని ఈఎన్‌సీ హరిరామ్ వెల్లడించారు.

సీఎం పర్యవేక్షణలోనే..

సీఎం నిరంతర పర్యవేక్షణ, ప్రోత్సాహంతోనే నాలుగో దశ పూర్తయింది. ఆసియాలోనే అతి పెద్దదైన 92 మీటర్ల లోతైన సర్జ్‌పూల్ నుంచి నీటిని 101.20 మీటర్లు ఎత్తి అనంతగిరికి తరలించే ట్రయల్ రన్ బుధవారం పూర్తయింది. సీఎం సూచనల మేరకు ఈ నెలాఖరుకు కొండపోచమ్మ సాగర్‌కు కాళేశ్వరం జలాలు చేరతాయి. -హరిరామ్, ఈఎన్‌సీ

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
నిజామాబాద్ డివిజన్, నిజామాబాద్
N.I.T. No.24/EE/DB/HD/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 05.03.2020
పని పేరు: 2019-20 ఆర్థిక సంవత్సరానికి అంటే 01-06-2019 నుండి 31-05-2020 వరకు నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ వద్ద చిన్న ఎలక్ట్రికల్ మరియు నీటి సరఫరా మరియు శానిటరీ మరమ్మతులతోపాటు రెసిడెన్షియల్ క్వార్టర్స్ మరియు న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో మరియు చుట్టుప్రక్కల స్వీపింగ్ మరియు టాయిలెట్స్ శుభ్రపరచుట కోసం హౌస్‌కీపింగ్ (3వ పిలుపు). సుమారు అంచనా విలువ : రూ. 9.30 లక్షలు. మొత్తం పనుల సంఖ్య ఒకటే (1) మాత్రమే. 1) బిడ్ డాక్యులు ముగింపు తేది : 13.03.2020న మ.3:30 గంటలకు. 2) సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) డివిజన్, నిజామాబాద్. ఫోన్ నం. 08462-220853. 3) తదుపరి వివరాలను www.tender.telangana.gov.inలోని ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో చూడవచ్చును.
DIPR Ro.No.2635-DP/CL/Advt/1/2019-20, Dt:11-03-2020 సం/-ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) డివిజన్, నిజామాబాద్.

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ: రాజన్న సిరిసిల్లా జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఇన్వి టెండరు నోటీసు
ఆర్.సి.నం.సి1/460/2019 తేది: 11.03.2020
శ్రీరామనవమి 2020 సందర్భముగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము నందు పనుల గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.in కు లాగాన్ అవ్వండి. కరంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి.
సం/- ఎం.ఎం.డి క్రిష్ణవేణి, బి.ఎ., ఎల్.ఎల్.బి.
రీజినల్ జాయింట్ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి (F.A.C.)
DIPR Ro.No.884-PP/CL/ADVT/1/2019-20, Dt:11.03.2020

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ -రాజన్న సిరిసిల్ల జిల్లా
మార్కెటింగ్
ఆర్.సి.నం. ఎ5/262/2020 తేది: 09.03.2020
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
మార్కెటింగ్ శాఖ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానము, వేములవాడ 2020-2021 సంవత్సరమునకు అవసరమైన 1. మల్టీకలర్ అర్చన టికెట్ల ప్రింటింగ్ సామాగ్రి 2. స్టేషనరీ సామాగ్రి సప్లయి చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండర్ వివరములు https://tender.telangana.gov.inలాగిన్ చేయండి. సెల్ : 9849882202, 9030733778.
DIPR RO.No.882-PP/CL/Advt/1/2019-20, Dt: 11/03/2020 సం/- కార్యనిర్వహణాధికారి (F.A.C.)

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, ఖమ్మం. ఫోన్: 7093604038
ఈ క్రింది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చెక్‌డ్యాం నిర్మాణం పనుల యొక్క బిడ్లను ఆహ్వానించడమైనది.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నం.మరియు తేది	డివిజన్ పేరు	మొత్తం అంచనా విలువ	టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం
NIT No.:50/2019-20 నుండి 57/2019-20 తేది:06-03-2020	కొత్తగూడెం డివిజన్ పరిధిలోని (08) చెక్‌డ్యాంల నిర్మాణం	రూ. 2151.80 లక్షలు	17-03-2020, సా. 4.00 గంటల వరకు

గమనిక: మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.inలో చూడవచ్చును. పర్యవేక్షక ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ఖమ్మం.
DIPR RO.No.2628-DP/CL/Advt/1/2019-20, Dt: 11/03/2020 సం/-సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, ఖమ్మం

IISER TIRUPATI
INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507
Admission to Integrated Ph.D & Ph.D Programs: August 2020
IISER Tirupati (www.iisertirupati.ac.in) invites online applications for admission to the Integrated Ph.D. and Ph.D. programs for August 2020 Session.
For details of educational qualifications, eligibility criteria, selection procedure, online application and last date of submission discipline wise please visit: http://www.iisertirupati.ac.in/admissions/
Advt.No.11/2020(F)/IISER-T/Admissions/11-03-2020 Sd/- Director

డిస్కంలకు 5,500 కోట్ల రుణం

ట్రాన్స్‌కో విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలం

సాక్షి, హైదరాబాద్: బాండ్లు లేదా రుణాల రూపంలో రూ.5,500 కోట్ల నిధులను సమీకరించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు డిస్కంలు భారీ ఎత్తున విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. ఎన్టీపీసీ, సింగరేణి విద్యుత్ ప్లాంట్లతో పాటు ఇతర ప్రైవేటు విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు రూ.వేల కోట్లలో పెరిగిపోయాయి. దీంతో రాష్ట్రానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరిస్తూ విద్యుదుత్పత్తి కంపెనీలు తెలంగాణ ట్రాన్స్‌కోకు గత కొంత కాలంగా లేఖలు రాస్తున్నాయి. ఈ క్రమంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న డిస్కంలను గట్టెక్కించడానికి రూ.7 వేల కోట్ల నిధులను రుణాలు లేదా బాండ్లు జారీ చేయడం ద్వారా సమీకరించేందుకు అనుమతి కోరుతూ తెలంగాణ ట్రాన్స్‌కో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో రూ.5,500 కోట్ల రుణాల సమీకరణ లేదా బాండ్ల జారీకి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ సంతకం చేసిన వెంటనే ఉత్తర్వులు జారీ కానున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బుధవారం పబ్లిక్ సేఫ్టీ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఐజీ స్వాతి లక్రా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తదితరులు

సామాజిక మార్పు మా లక్ష్యం

- ఏడాదిలో లక్ష మంది విద్యార్థులకు శిక్షణ
- పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌ల ప్రారంభోత్సవంలో డీజీపీ మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'నేటి విద్యార్థులే భావి పౌరులు.. ముఖ్యంగా డిగ్రీ, పీజీ పూర్తయ్యాక వారే సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారు. విద్యార్థుల్లో స్త్రీ, శిశు, ట్రాఫిక్, సామాజిక భద్రత విషయాలపై చైతన్యం తేవడం ద్వారా భద్రమైన సమాజం నిర్మించాలన్నది మా లక్ష్యం' అని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన పబ్లిక్ సేఫ్టీ క్లబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సమాజంలో భద్రత, రక్షణ ప్రమాణాలను భావి తరాలకు అలవాటు చేయాలన్న సంకల్పంతో స్కూళ్లు, డిగ్రీ, పీజీ కాలేజీల్లాంటి దాదాపు 2,500 విద్యా సంస్థల్లో మహిళా, చిన్నారి, రోడ్ సేఫ్టీ లాంటి అంశాలపై అవగాహన కల్పించే బృహత్తర కార్యక్రమానికి విమెన్ సేఫ్టీ వింగ్ శ్రీకారం చుట్టిందని ప్రశంసించారు. సామాజిక మార్పు తేవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముమ్మాటికీ విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య శాఖలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ క్లబ్బుల ద్వారా ఏడాదిలోగా లక్ష మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మహిళల భద్రతకు తామెంతో ప్రాధాన్యమిస్తున్నామని, దీనిలో భాగంగానే నగరంలో 5 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. షీ టీమ్‌లు రహస్యంగా పోకిరీల పని పడుతున్నాయని తెలిపారు. నేరం చేస్తే నిందితులు తప్పించుకోలేరని హెచ్చరించారు. గతంతో పోలిస్తే కన్విక్షన్ రేటు 300-400 శాతం పెరిగిందని, ఇటీవల మూడు కేసుల్లో నిందితులకు ఉరి శిక్షలు విధించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

షీ టీమ్స్ ప్రేరణతోనే..

ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తమ శాఖ సహకరిస్తుందని స్పష్టం చేశారు. అన్ని విద్యాసంస్థల్లో విధిగా పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లు అమలయ్యేలా అధికారిక ఆదేశాలు పంపుతామన్నారు. రాష్ట్రంలో షీ టీమ్స్, భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇచ్చిన ప్రేరణతోనే పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లకు శ్రీకారం చుట్టామని ఐజీ స్వాతి లక్రా పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రంలో మరో పది భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహిళలపై వేధింపుల నిరోధానికి పురుషులు చేతులు కలపాలని డీఐజీ సుమతి పిలుపునిచ్చారు. అనంతరం పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లకు సంబంధించిన పలు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లను డీజీపీ ఆవిష్కరించారు.

భద్రాచలం-సత్తుపల్లి లైన్ పనుల్లో ముందడుగు

- రైల్వేకు సింగరేణి సంస్థ రూ.200 కోట్ల చెల్లింపు
- డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసేలా రైల్వేతో ఒప్పందం

చెక్ అందజేస్తున్న సీఎండీ శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం రోడ్డు-సత్తుపల్లి మధ్య నిర్మిస్తున్న నూతన రైల్వే లైన్ పనుల్లో కీలక ముందడుగు పడింది. బొగ్గు సరఫరాకు మాత్రమే ఉపయోగపడే ఈ లైన్ నిర్మాణానికయ్యే వ్యయాన్ని సింగరేణి సంస్థ, భూ సేకరణకు అయ్యే వ్యయాన్ని రైల్వే సంయుక్తంగా భరించనున్నాయి. నిధుల విషయంలో జాప్యం వల్ల పనుల్లో ఆలస్యమై నిర్మాణ వ్యయం రూ.220 కోట్ల మేర పెంచాల్సి వచ్చింది. భవిష్యత్‌లో ఈ సమస్య తలెత్తకుండా నిధులు అందుబాటులో ఉంచి డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా దక్షిణ మధ్య రైల్వే-సింగరేణి సంస్థలు బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా రెండో విడత నిధుల విడుదలకు సంబంధించి సింగరేణి సంస్థ రూ.200 కోట్ల విలువ చేసే చెక్కును దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యాకు అందించింది. సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో చెక్కును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ శ్రీధర్ గజానన్‌కు అందజేశారు. సత్తుపల్లి చుట్టుపక్కల ఉన్న బొగ్గు నిక్షేపాలను వెలికి తీసి సింగరేణి సంస్థ సరఫరా చేయనుంది. బొగ్గును తరలించేందుకు ప్రత్యేకంగా భద్రాచలం రోడ్డు వరకు 55 కిలోమీటర్ల మేర రైలు మార్గం నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు 2010-11లో పచ్చజెండా ఊపగా 2017లో డీపీఆర్ సిద్ధం చేశారు. నాటి అంచనా విలువ రూ.704 కోట్లు కాగా అప్పట్లో సింగరేణి సంస్థ రూ.156.38 కోట్లను దక్షిణ మధ్య రైల్వేకు అప్పగించింది. పనుల్లో జాప్యం వల్ల అంచనా వ్యయాన్ని రూ.927.94 కోట్లకు పెంచారు. ఫలితంగా రైల్వే వాటా రూ.309.39 కోట్లు, సింగరేణి వాటా రూ.618.55 కోట్లుగా మారింది. ఇందులో ప్రస్తుతం రూ.200 కోట్లు అందించగా మిగతా మొత్తం తదుపరి వాయిదా నాటికి అందించనున్నట్టు సింగరేణి పేర్కొంది. ఈ మార్గంలో 10 ప్రధాన వంతెనలు ఉంటాయి. అందులో ఏడు నిర్మాణంలో ఉన్నాయి. చిన్న వంతెనలు 40, ఆర్‌ఓబీలు 8, ఏఆర్‌యూబీలు 34, మూడు స్టేషన్లు ఉంటాయి. ఈ మార్గం వల్ల సత్తుపల్లి నుంచి భద్రాచలం వరకు అదనంగా 8 నుంచి 9 టన్నుల బొగ్గు సరఫరా అవుతుంది. ఫలితంగా రైల్వేకు ఏటా రూ.160 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. రోడ్డు మార్గాన్ని వాడాల్సిన అవసరం తప్పనుండటంతో వాతావరణ కాలుష్యం కూడా తగ్గనుంది. రెండు సంస్థల మధ్య ఆ మేరకు అవగాహన కుదిరితే భవిష్యత్‌లో ప్రయాణికుల రైళ్లను కూడా నడిపే అవకాశం ఉంది.

వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను తమ వెబ్‌సైట్‌లో (bse.telangana.gov.in) అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ నెల 12 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాలలకు హాల్‌టికెట్లను పంపించామని తెలిపారు. హాల్‌టికెట్లను హెడ్‌మాస్టర్లు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను కూడా పరీక్ష సమయంలో అనుమతించాలని, దానిపై ఎవరి సంతకం అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 5.34 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు 9 గంటలకల్లా పరీక్ష హాల్‌లో ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి నిమిషం నిబంధన ఏమీ లేదని తెలిపారు. ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని సూచించారు. గతంలో పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొనసాగిస్తామని వెల్లడించారు.

రాష్ట్రానికి మరో 71 మంది విద్యుత్ ఉద్యోగులు

జస్టిస్ ధర్మాధికారి కమిటీ అనుబంధ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఏపీ నుంచి తెలంగాణకు మరో 71 మంది విద్యుత్ ఉద్యోగులను కేటాయిస్తూ జస్టిస్ ధర్మాధికారి ఏకసభ్య కమిటీ బుధవారం అనుబంధ నివేదికను విడుదల చేసింది. ఏపీ స్థానికత కలిగి ఉన్నారని పేర్కొంటూ ఐదేళ్ల కింద తెలంగాణ విద్యుత్ సంస్థలు 1,157 మంది విద్యుత్ ఉద్యోగులను ఏపీకి రిలీవ్ చేయడంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం ముదిరింది. ఈ వివాద పరిష్కారం కోసం సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ధర్మాధికారి కమిటీ రిలీవైన 1,157 మంది ఉద్యోగుల్లో తెలంగాణకు 502, ఏపీకు 655 మంది ఉద్యోగులను కేటాయిస్తూ గతేడాది డిసెంబర్ 26న తుది నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ కేటాయింపులను సవాలు చేస్తూ ఏపీ విద్యుత్ సంస్థలు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సుప్రీం ఆదేశాల మేరకు మళ్లీ ధర్మాధికారి కమిటీ రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ఉద్యోగుల అభిప్రాయాలను సేకరించి తుది నివేదికకు అనుబంధంగా మరో నివేదికను బుధవారం ప్రకటించింది. జీవిత భాగస్వామి, అనారోగ్యం, శారీరక వైకల్యం తదితర కారణాలతో ఏపీ నుంచి తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 71 మందిని తెలంగాణకు కేటాయిస్తున్నట్లు నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం ఈ నెల 30లోగా ఉద్యోగుల తుది కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేయాలని ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే సుప్రీం తీర్పు ఉల్లంఘించినట్లేనని స్పష్టం చేసింది.

మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మార గంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మార గంగారెడ్డి,వైస్ చైర్మన్‌గా బొర్రా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఉదయం 9 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. చైర్మన్ అభ్యర్థిగా మార గంగారెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. వైస్ చైర్మన్ అభ్యర్థిగా బొర్రా రాజశేఖర్ నామినేషన్ వేశారు. 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ సమయం ముగిసింది. రెండు పదవులకు రెండే నామినేషన్లు దాఖలు కావడం, వేసిన నామినేషన్లు కూడా సరిగా ఉండటంతో ఎన్నికల అధికారి అరుణ చైర్మన్, వైస్ చైర్మన్లను మధ్యాహ్నం 2.30 గంటలకు అధికారికంగా ప్రకటించారు. చైర్మన్‌గా గంగారెడ్డి, వైస్ చైర్మన్ రాజశేఖర్లు ఎన్నికైనట్లు ధ్రువపత్రాలు అందజేశారు.

రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్: జన్వాడలో డ్రోన్ కెమెరాలను అనుమతి లేకుండా వినియోగించిన కేసులో చర్లపల్లి జైలులో ఉన్న ఎంపీ రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శ్రీదేవి తిరస్కరించారు. రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను బుధవారం విచారించిన న్యాయమూర్తి పోలీసు తరఫు న్యాయవాది రఘు వాదనలతో ఏకీభవిస్తూ ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినట్లు తెలిసింది.

అటవీ క్రీడల్లో తెలంగాణకు 16 పతకాలు

సాక్షి, హైదరాబాద్: భువనేశ్వర్‌లో ముగిసిన 25వ జాతీయ స్థాయి అటవీ క్రీడల్లో రాష్ట్ర అటవీశాఖ క్రీడాకారులు మొత్తం 16 పతకాలు గెలుచుకున్నారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పాల్గొన్న ఈ క్రీడల్లో తెలంగాణ మొత్తం మీద 15వ స్థానంలో నిలిచింది. పతకాలు గెలుచుకున్న అటవీ అధికారులు, సిబ్బందిని అరణ్య భవన్‌లో పీసీసీఎఫ్ ఆర్.శోభ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు. రాష్ట్రం తరపున మొత్తం 285 మంది క్రీడాకారులు, 95 ఈవెంట్లలో పాల్గొన్నారు. ఒక స్వర్ణం, 9 రజతాలు, 6 కాంస్య పథకాలకు తోడు మరో ఆరు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచారు.

ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా బుద్ధా చంద్రశేఖర్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ పరిధిలోని ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)లో నేషనల్ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా బుద్ధా చంద్రశేఖర్ నియమితులయ్యారు. అమెరికా, యూకే వంటి దేశాల్లో విద్య, ఈ-గవర్నెన్స్, నైపుణ్య శిక్షణ, హెల్త్ కేర్, ఐటీ, ట్రేడింగ్, ఫైనాన్స్ వంటి రంగాల్లో పనిచేసిన చంద్రశేఖర్ గత కొన్నాళ్లుగా బీజేపీలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పార్టీ తరఫున పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలో అధికార ప్రతినిధిగా వ్యవహరించారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్
టెండరు ప్రకటన నం. SE/GWMC/CTN/05 Recall/e-procurement/2019-20, తేది: 04.03.2020
N.W:మున్సిపల్ జనరల్ ఫండ్ క్రింద GWMC లిమిట్స్‌లో వివిధ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ సరఫరా మరియు స్థాపన.
అంచనా మొత్తం: రూ.56.32 లక్షలు
బిడ్డ స్వీకరణకు ప్రారంభ మరియు ఆఖరు తేది: 07.03.2020 & 17.03.2020
గమనిక: తదుపరి వివరాలను @ www.tender.telangana.gov.in లో "e" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో చూడవచ్చును.
సం/- కమిషనర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No. 875-PP/CL/Advt/1/2019-20, Dt.11.03.2020

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
e-NIT No.25/SE(R&B) KNR/01 to 02, 03/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 04.03.2020
పనుల సంఖ్య (3), పనుల పేరు: జగిత్యాల జిల్లాలోని మేటిపల్లి నుండి ధర్మరాజు పల్లి రోడ్ 18/2 నుండి 18/4 వరకు కాలానుగత రెన్యువల్స్, వీరాపూర్ రోడ్ వద్ద గోల్స్ స్మిత్ కమ్యూనిటీ హాల్ కోసం షెడ్ నిర్మాణం, గోల్స్ స్మిత్ కమ్యూనిటీ కోసం టాయిలెట్ నిర్మాణం మరియు అన్ని ఇతర సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.1.18 కోట్లు, బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం: 11.03.2020న సా.4.00 గం., బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 18.03.2020న మ.3.30 గం. కమర్షియల్ స్టేజ్: 18.03.2020 సా.4.00 గం. తదుపరి వివరాలను ఇ- ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అంటే www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR Ro.No.2631-DP/CL/Advt/1/2019-20, Dt: 11.03.2020 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (R&B) సర్కిల్, కరీంనగర్

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (ఎల్ఎ) శాఖ
ఫారం - సి
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు గలదు)
(నిబంధన 6/12 చూడండి)
నెం.ఆర్‌ఎ/జి1/ఎల్ఎ2/0002/2020-జి-సెక్షన్ తేది:05-03-2020
గెజిట్ నెం. 12/2020 తేది: 10-03-2020
తెలంగాణ ప్రభుత్వము/ కలెక్టర్ వారు మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ రెవిన్యూ డివిజన్, అడ్డగుట్ట మండలం, వల్లూర్ గ్రామంలో మొత్తం 77-13 ఎకరాల విస్తీర్ణం గల భూమి ప్రజా ప్రయోజనం కోసం పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద ఉద్దండాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద స్టేజ్-IV లిఫ్టుకు సంబంధించిన సర్జ్ పూల్ - పంప్ హౌస్ కాంప్లెక్స్ మరియు టెయిల్ రేస్స్ నిర్మాణం కోసం కావలసి ఉండగ భూమిస్తున్నారు.
అందుచేత పైన తెలిపిన ప్రాజెక్టు నిర్మాణమునకు మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డగుట్ట మండలం, వల్లూర్ గ్రామంలో ఈ దిగువ వివరించిన సుమారు 77-13 ఎకరాలు ప్రాయోజిక కొలతలు కలిగిన భూమి భూసేకరణ కోసం ప్రతిపాదించబడినందున ఇందుమూలంగా తెలియజేయడమైనది.
గ్రామం: వల్లూర్ మండలం: అడ్డగుట్ట జిల్లా: మహబూబ్‌నగర్

క్ర. సం.	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం (మెట్ట/తరి)	విస్తీర్ణం (ఎకరాలు)	ఆసక్తి గల వ్యక్తి పేరు, చిరునామా	నష్టపోయిన విస్తీర్ణం				వెట్టు నిర్మాణములు			
						ఎ	ద	గుం	వ	రకం	సంఖ్య	రకం	సంఖ్య
1	93/15ఎ	పట్టా	మెట్ట	0-39	రాములు తండ్రి కమ్మన్న					-	-	-	-
2	93/15ఎ	పట్టా	మెట్ట	0-39	లోక్యా తండ్రి కమ్మన్న					-	-	-	-
3	93/15ఎ	పట్టా	మెట్ట	0-39	పుల్యా తండ్రి కమ్మన్న					-	-	-	-
4	93/15ఎ	పట్టా	మెట్ట	0-11	భోజ్యా తండ్రి కమ్మన్న					-	-	-	-
5	15/ఎ2	పట్టా	మెట్ట	4-39	బక్రు తండ్రి నాన్య	94	93	93	94	-	-	-	-
6	93/15ఆ	పట్టా	మెట్ట	0-32	రాములు తండ్రి కమ్మన్న					-	-	-	-
7	93/15ఆ	పట్టా	మెట్ట	0-32	వి. పుల్యా తండ్రి కమ్మన్న					-	-	-	-
8	93/జి	పట్టా	మెట్ట	5-00	హెచ్. కిషోర్ రామారావు					-	-	-	-
9	93	పట్టా	మెట్ట	3-00	కె. తోగి భర్త రామచందర్					-	-	-	-
10	114	పట్టా	మాగాణి	0-04	కేశావత్ హన్యా ధర్‌సింగ్					-	-	-	-
11	114	పట్టా	మాగాణి	0-04	కేశావత్ రామచందర్ తండ్రి ధర్‌సింగ్					-	-	-	-
12	114	పట్టా	మాగాణి	0-05	దిర్యా తండ్రి లక్యా	93	115	115	113	-	-	-	-
13	114	పట్టా	మాగాణి	0-07	కేశావత్ రాజు తండ్రి రామచందర్					-	-	-	-
14	114	పట్టా	మాగాణి	0-05	కేశావత్ మల్లేష్ తండ్రి లక్యా					-	-	-	-
15	114	పట్టా	మాగాణి	0-06	కేశావత్ రవి తండ్రి రామచందర్					-	-	-	-
16	114	పట్టా	మాగాణి	0-05	కేశావత్ సాయి భర్త కోస్యా					-	-	-	-
17	114	పట్టా	మాగాణి	0-13	కేశావత్ అంగ్య తండ్రి ధాంజ్య					-	-	-	-
18	114	పట్టా	మాగాణి	0-13	కేశావత్ రూప్ సింగ్ తండ్రి ధాంజ్య					-	-	-	-
19	114	పట్టా	మాగాణి	0-07	కేశావత్ లాల్ సింగ్ తండ్రి రామచందర్					-	-	-	-
20	114	పట్టా	మాగాణి	0-15	కేశావత్ నరేందర్ తండ్రి ధాంజ్య					-	-	-	-
21	114	పట్టా	మాగాణి	0-12	కేశావత్ తుల సిరాం తండ్రి బక్రు					-	-	-	-
22	114	పట్టా	మెట్ట	1-12	ఇళ్ల స్థలాలు					-	-	-	-
23	115	పట్టా	మాగాణి	0-24	కేశావత్ రాములు తండ్రి రూప్లా					-	-	-

కాషాయ 'కుటుంబం'లోకి సింధియా

పుష్పగుచ్ఛమిచ్చి బీజేపీలోకి జ్యోతిరాదిత్యను ఆహ్వానిస్తున్న బీజేపీ చీఫ్ నడ్డా

- బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఆ పార్టీలో చేరిన జ్యోతిరాదిత్య
- మధ్యప్రదేశ్ నుంచి ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ
- కొత్త ఆలోచనలను, నూతన నాయకత్వాలను కాంగ్రెస్ అంగీకరించడంలేదన్న సింధియా
- శిబిరాల్లోకి మధ్యప్రదేశ్ కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ/భోపాల్

మధ్యప్రదేశ్ రాజకీయాలకు సంబంధించి బుధవారం కీలక మలుపులు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆ పార్టీ సీనియర్ నేత, గ్వాలియర్ రాజవంశ వారసుడు జ్యోతిరాదిత్య సింధియా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఢిల్లీలో బీజేపీలో చేరారు. వెంటనే ఆయనను మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. దాంతో, ఆయన మరోమారు కేంద్ర మంత్రి పదవి చేపట్టే దిశగా తొలి అడుగు పడినట్లైంది. సింధియా అనుయాయులైన 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలతో పతనం అంచుల్లో ఊగిసలాడుతున్న మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం.. రాజీనామాలు చేయగా మిగిలిన తమ ఎమ్మెల్యేలను రాజస్తాన్‌లోని జైపూర్‌కు తరలించింది. బీజేపీ ముందుజాగ్రత్త చర్యగా తమ ఎమ్మెల్యేలను గురుగ్రామ్‌లోని ఒక హోటల్‌లో ఉంచింది. తమ రాజీనామాలను ఒక బీజేపీ సీనియర్ నేత ద్వారా మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌కు పంపించిన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరు శిబిరంలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ సభ్యులు ఉన్న రాజస్తాన్(జైపూర్)లో కాంగ్రెస్.. బీజేపీ ఎమ్మెల్యేలున్న హరియాణా(గురుగ్రామ్)లో, కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలున్న కర్నాటక(బెంగళూరు)లో బీజేపీ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 230 కాగా, ప్రస్తుతం 228 మంది సభ్యులున్నారు. వారిలో కాంగ్రెస్ రెబెల్స్ అయిన 22 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదం పొందితే, ఆ సంఖ్య 206కి చేరుతుంది. అప్పుడు మ్యాజిక్ ఫిగర్ 104 అవుతుంది. ఆ పరిస్థితుల్లో.. 107 మంది ఎమ్మెల్యేలున్న బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటు సాధ్యం కానుంది. ఇప్పటివరకు కమల్‌నాథ్ ప్రభుత్వానికి మద్దతిచ్చిన నలుగురు స్వతంత్రులు, ఇద్దరు బీఎస్పీ, ఒక ఎస్పీ ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిచ్చే వీలుంది.

భోపాల్ నుంచి జైపూర్‌కు ప్రత్యేక విమానంలో బయల్దేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ప్రభుత్వాన్ని కాపాడుకుంటాం

అయితే, విశ్వాస పరీక్షలో విజయం సాధిస్తామని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. 'మాతో 95 మంది పార్టీ ఎమ్మెల్యేలున్నారు. స్వతంత్రులు, బీఎస్పీ, ఎస్పీ సభ్యులు మాకే మద్దతిస్తారు' అని రాష్ట్ర మంత్రి ప్రియవ్రత్ సింగ్ తెలిపారు. '22 మంది రెబెల్ ఎమ్మెల్యేల్లో 13 మంది కాంగ్రెస్‌ను వీడిపోమని చెప్పారు. జ్యోతిరాదిత్యకు రాజ్యసభ సీటు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చేందుకే ఈ పని చేశాం అని వారు చెప్పారు. సింధియా పార్టీని వదిలి వెళ్తారని మేం ఊహించలేదు' అని పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ అన్నారు. 'మేం సింధియాను రాజ్యసభకు పంపించగలం కానీ.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మాత్రమే ఆయనను కేంద్రమంత్రిని చేయగలరు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2018 ఎన్నికల్లో విజయం అనంతరం జ్యోతిరాదిత్యకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఆఫర్ చేశామని, అయితే, ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించి, తన మద్దతుదారుకు ఆ పదవి ఇవ్వాలని కోరారని దిగ్విజయ్ వెల్లడించారు. ఈ సంక్షోభం వెనుక బీజేపీ ఉందని, ఈ ఆపరేషన్‌కు ఆ పార్టీనే నిధులను సమకూరుస్తోందని ఆరోపించారు. ''2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి అనంతరం మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కూలుస్తానని మోదీ, షాలకు సింధియా ప్రతిపాదన పంపారు. కానీ బీజేపీ రాష్ట్ర నాయకులు దాన్ని అడ్డుకున్నారు. ఆ పనికి సింధియా ఎందుకు? మేమే ఆ పని చేయగలం అని షాకు చెప్పారు. కానీ, వారి ప్రయత్నాన్ని మేం సాగనివ్వలేదు. దాంతో, ఇప్పుడు షా స్థానిక నాయకులను పిలిచి, మీరంతా పనికిరానివారు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే పనిని ఇప్పుడు సింధియాకు అప్పగిస్తున్నా అని వారికి చెప్పారు'' అని దిగ్విజయ్ మధ్యప్రదేశ్ సంక్షోభాన్ని వివరించారు.

ప్రజా ప్రభుత్వాలను కూల్చే కుట్ర

మధ్యప్రదేశ్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. 'ప్రజా ప్రభుత్వాలను కూల్చే పనిలో బిజీగా ఉన్న మీకు చమురు ధరలు 35% తగ్గిన విషయం బహుశా దృష్టికి రాలేదనుకుంటా. ఆ తగ్గుదల ప్రయోజనాలను ప్రజలకు కల్పించండి' అని ట్వీట్ చేశారు.

రాజమాత గుర్తొచ్చారు

సింధియా బీజేపీలో చేరిన సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సింధియా నానమ్మ, గ్వాలియర్ రాజమాత, బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరైన విజయరాజె సింధియాను గుర్తు చేసుకున్నారు. ఆమె మనవడు బీజేపీలోకి రావడం తనకు అత్యంత సంతోషకరమైన విషయమన్నారు.

మహారాజ్, శివరాజ్ ఇప్పుడు ఒకే పార్టీలో

జ్యోతిరాదిత్య బీజేపీలో చేరడాన్ని మధ్యప్రదేశ్ మాజీ సీఎం, బీజేపీ నేత శివరాజ్ సింగ్ స్వాగతించారు. 2018 ఎన్నికల సమయంలో బీజేపీ నినాదమైన 'మాఫ్ కరో మహారాజ్.. హమారా నేతాతో శివరాజ్ (క్షమించండి మహారాజ్.. మా నాయకుడు శివరాజ్)'ను విలేకరులు గుర్తు చేయగా.. ఇప్పుడు, మహారాజ్, శివరాజ్ ఒకే పార్టీలో ఉన్నారని చమత్కరించారు. జ్యోతిరాదిత్య స్థానికుల్లో మహారాజ్‌గా చిరపరిచితుడు.

9 మంది అభ్యర్థులు

మార్చి 26న జరిగే రాజ్యసభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్ నుంచి తమ అభ్యర్థిగా జ్యోతిరాదిత్యను బీజేపీ ప్రకటించింది. సింధియాతోపాటు గుజరాత్ నుంచి ఇద్దరిని, అస్సాం, బిహార్, మహారాష్ట్ర, రాజస్తాన్, జార్ఖండ్, మణిపూర్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున.. మొత్తం 9 మంది అభ్యర్థులతో ఒక జాబితాను బీజేపీ బుధవారం విడుదల చేసింది. మిత్రపక్షాలు ఆర్పీఐ, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్‌లకు ఒక్కో సీటును కేటాయించింది. ఆర్పీఐ తరపున కేంద్ర మంత్రి రామ్‌దాస్ అఠవాలే మళ్లీ రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశముంది.

వాస్తవాలను అంగీకరించే పరిస్థితిలో లేదు

బీజేపీలో చేరిన సందర్భంగా జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌పై లోతైన విమర్శలు చేశారు. కాంగ్రెస్ ఒకప్పటి పార్టీ కాదని, ఇప్పుడు ఆ పార్టీ వాస్తవాలను అంగీకరించే పరిస్థితిలో లేదని విమర్శించారు. కొత్త ఆలోచనలను, నూతన నాయకత్వాలను ఆమోదించలేకపోతోందన్నారు. మోదీపై సింధియా ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ సమర్థుడైన నేత అని, దేశ సేవ కోసం సంపూర్ణంగా అంకితమైన వ్యక్తి అని పొగిడారు. ఆయన చేతుల్లో దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్నారు. దేశ ప్రతిష్ఠను మోదీ విశ్వవ్యాప్తం చేశారన్నారు. 2018లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్నో కలలు కన్నానని, ఈ 18 నెలల్లో అవన్నీ కల్లలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని, రైతులు, యువత నిస్పృహలో ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉంటే ప్రజలకు సేవ చేయాలన్న తన ఆకాంక్ష నెరవేరదని అర్థమైందన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై మాత్రం ఆయన ఏ వ్యాఖ్యలు చేయలేదు.

ఇంటికి ఎప్పుడైనా రావొచ్చు: రాహుల్

తనకు అత్యంత సన్నిహితుడైన సింధియా పార్టీని విడిచి పెట్టడంతో రాహుల్‌గాంధీ కాస్త కలత చెందినట్టు కనిపిస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం జ్యోతిరాదిత్య సింధియా, కమల్‌నాథ్‌లతో కలిసి ఉన్న ఫోటోకి లియో టాల్‌స్టాయ్ ప్రఖ్యాత కొటేషన్ పోరాటయోధులు అంటే ఎవరో కాదు సహనం, సమయం అంటూ తాను చేసిన ట్వీట్‌ని మళ్లీ రాహుల్ రీ ట్వీట్ చేశారు. ఆయన ఎందుకు దీనిని రీట్వీట్ చేశారో ఎవరికీ అర్థం కాలేదు కానీ ''నా ఇంటికి ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా హాయిగా వచ్చే నాయకుడెవరైనా ఉన్నారంటే జ్యోతిరాదిత్య సింధియాయే, ఆయన నాకు కాలేజీ రోజుల నుంచి బెస్ట్ ఫ్రెండ్''అన్న రాహుల్ వ్యాఖ్యలతో వారిద్దరి మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో తెలుస్తోంది.

క్లుప్తంగా...

డీకేకి కర్ణాటక కాంగ్రెస్ పగ్గాలు

సాక్షి, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ చీఫ్‌గా మాజీ మంత్రి, పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరొందిన డీకే శివకుమార్ నియమితులయ్యారు. పార్టీలో పట్టున్న నేతగా, వ్యూహకర్తగా డీకేకు పేరుంది. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా సలీమ్ అహ్మద్, ఈశ్వర్ ఖండ్రే, సతీష్ జారిక్‌హొళి నియమించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. మధ్యప్రదేశ్ పరిణామాల నేపథ్యంలో శివకుమార్‌ను కర్ణాటక చీఫ్‌గా నియమించారు. గత డిసెంబర్‌లో కర్ణాటకలో జరిగిన 15 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోవడంతో అప్పటి కేపీసీసీ అధ్యక్షుడు గుండూరావు రాజీనామా చేశారు. డీపీసీసీ చీఫ్‌గా అనిల్ చౌధరి నియమితులయ్యారు.

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా మురుగన్

సాక్షి, చెన్నై: జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉపాధ్యక్షుడు ఎల్ మురుగన్‌కు తమిళనాడు బీజేపీ పగ్గాల్ని అప్పగించారు. కొన్నేళ్లుగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా వ్యవహరించిన తమిళిసై సౌందరరాజన్ తెలంగాణకు గవర్నర్ కావడంతో పార్టీ చీఫ్ పదవి ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీకి అధ్యక్షుడిగా మురుగన్‌ను నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా బుధవారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉపాధ్యక్షుడిగా మురుగన్ వ్యవహరిస్తున్నారు.

ఆ దోషుల ఇంటర్వ్యూకు అనుమతినివ్వండి

న్యూఢిల్లీ: నిర్భయ కేసులో త్వరలో ఉరికంబం ఎక్కబోతున్న నలుగురు దోషులను ఇంటర్వ్యూ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఓ మీడియా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు స్పందించింది. మీడియా సంస్థ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని తీహార్ జైలు అధికారులకు తెలిపింది. దీనికి సంబంధించి గురువారంలోగా తమ స్పందన తెలియజేయాలని తీహార్ జైలు అధికారులను ఆదేశించింది.

అవి మహిళల హక్కులకు భంగం కలిగించేవే!

న్యూఢిల్లీ: పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురవడం మహిళల ప్రాథమిక హక్కులకు, సమానత్వానికి అమర్యాదకరమని, బతికేందుకు, నచ్చిన వృత్తిని నిర్వహించేందుకు మహిళలకు ఉన్న హక్కులకూ భంగకరమని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. ఉన్నతాధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారన్న కారణంగా ఒక మహిళా బ్యాంకు ఉద్యోగిని బదిలీ చేయడాన్ని కొట్టేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. పనిచేసే చోట లైంగిక వేధింపులను నివారించేందుకే 2013లో చట్టం ఏర్పాటైందని, దాంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి ఒక వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసిందని కోర్టు పేర్కొంది.

దోషులను వదలం!

- ఢిల్లీ అల్లర్లపై హోంమంత్రి అమిత్‌షా స్పష్టీకరణ
- ఢిల్లీ హింసాకాండ ప్రణాళికాబద్ధ కుట్ర అని అభివర్ణన
- లోక్‌సభలో ఢిల్లీ హింసాకాండపై చర్చ

లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్ల దోషులెవరినీ వదలబోమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అల్లర్లకు పాల్పడేవారికి ఒక గుణపాఠంలా తమ చర్యలుంటాయన్నారు. కులం, మతం, రాజకీయ పార్టీలతో అనుబంధం.. వీటినేమాత్రం పట్టించుకోమని, అల్లర్లలో పాలు పంచుకున్న ప్రతీ ఒక్కరికి సరైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఢిల్లీ అల్లర్లపై లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చకు షా సమాధానమిచ్చారు. ఆ అల్లర్లు ముందుగానే ప్లాన్ చేసుకున్న కుట్ర అని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తోందన్నారు. ఈ ఢిల్లీ హింసాకాండకు సంబంధించి పోలీసులు 2,647 మందిని అదుపులోకి తీసుకున్నారని, దాదాపు 700 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారని, ఈ హింసకు ఉపయోగించిన 152 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని, ఆయుధాల చట్టం కింద 49 కేసులు నమోదు చేశారని అమిత్ షా వివరించారు. ఫేస్ ఐడెంటిఫికేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సీసీ టీవీ ఫుటేజ్‌ను నిపుణులు విశ్లేషిస్తున్నారన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ మతం ఆధారంగానో, దుస్తుల ఆధారంగానో వివక్ష చూపదని విపక్షంపై విసుర్లు విసిరారు. హోళీ సమయంలో మత కలహాలు జరగకుండా చూసేందుకే.. ఆ పండుగ తరువాత ఢిల్లీ అల్లర్లపై చర్చ చేపట్టాలని ప్రభుత్వం భావించిందన్నారు. 'ఢిల్లీ హింసాకాండలో మొత్తం 52 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. విపక్షం తరహాలో నేను వారిలో హిందువులెందరు? ముస్లింలు ఎందరు? అనే వివరాలను ఇవ్వదలచుకోలేదు. 526 మంది గాయపడ్డారు. 371 మంది భారతీయుల దుకాణాలు, 142 మంది ఇండియన్ల ఇళ్లు ధ్వంసమయ్యాయి' అని వివరించారు. కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ పేరును ప్రస్తావించకుండా.. 'ఫిబ్రవరి 24న ఒక విపక్ష నేత ఇది అటో ఇటో తేల్చుకునే యుద్ధం అని రెచ్చగొట్టేలా ప్రసంగించారు. ఇది విద్వేష ప్రసంగం కాదా?' అని షా ప్రశ్నించారు. సీఏఏ వ్యతిరేక నిరసనల్లో ఎంఐఎం నేత వారిస్ పఠాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ప్రస్తావించారు. సీఏఏను సమర్థిస్తూ.. మతం ప్రాతిపదికన 25కి పైగా చట్టాలను రూపొందించారని, సీఏఏ ఏ మతంపైనా వివక్ష చూపదని పునరుద్ఘాటించారు. అమిత్ మాట్లాడుతుండగానే.. నిరసనగా కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు, చర్చలో పాల్గొన్న పలువురు విపక్ష సభ్యులు.. ఢిల్లీ అల్లర్లకు నైతిక బాధ్యత వహించి, మంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చర్చను కాంగ్రెస్ సభ్యుడు ఆధిర్ రంజన్ చౌధురి ప్రారంభించారు. ఢిల్లీలో హింసాకాండ ప్రజ్వరిల్లుతున్న సమయంలో ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విందు ఇవ్వడంలో బిజీగా ఉన్నారని, ఇది రోమ్ నగరం తగలబడుతుంటే.. నీరో ఫిడేల్ వాయిస్తున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. 'ఈ హింసాకాండలో హిందువులు గెలిచారని కొందరు, ముస్లింలు గెలిచారని కొందరు చెబుతున్నారు. నిజానికి మానవత్వం ఓడిపోయింది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ పోలీసుల తీరును విమర్శించినందువల్లనే ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ మురళీధర్‌ను బదిలీ చేశారని చౌధురి ఆరోపించారు. హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని టీఎంసీ ఎంపీ సౌగత రాయ్, ఆరెస్పీ ఎంపీ ఎన్‌కే ప్రేమచంద్రన్ కూడా డిమాండ్ చేశారు. ఈ హింసాకాండను కూడా కొందరు రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని బీజేపీ నేత మీనాక్షి లేఖి విమర్శించారు. ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్యను గుర్తు చేస్తూ.. ఆయన మృతదేహంపై 400 గాయాలు ఉన్నాయన్నారు. ఆప్ కౌన్సిలర్ ఇంట్లో భారీగా రాళ్లు, ఆయుధాలు లభించడాన్ని ఆమె ప్రస్తావించారు. చాలా ఇళ్లల్లో వడిసెల వంటి ఆయుధాలు లభించాయన్నారు. లేఖి ప్రసంగంలోని పలు ప్రస్తావనలను రికార్డుల నుంచి తొలగించాలని బీఎస్పీ ఎంపీ డానిశ్ డిమాండ్ చేశారు. దాంతో, చర్చలో మత ప్రస్తావన తీసుకురావద్దని స్పీకర్ ఓం బిర్లా ఆదేశిస్తూ.. మీనాక్షి లేఖి ప్రసంగంలోని పలు ప్రస్తావనలను రికార్డుల నుంచి తొలగించారు.

హిందూత్వ విద్వేష సునామీ: ఓవైసీ

ఢిల్లీ హింసాకాండకు పాల్పడినవారిని చట్టం ముందు నిలిపేందుకు నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ డిమాండ్ చేశారు. హిందూత్వ విద్వేషమనే సునామీ వచ్చిందన్నారు. దేశ ఆత్మని కాపాడాలని ఓవైసీ హిందువులను కోరారు. దాదాపు 1,100 మంది ముస్లింలను అక్రమంగా నిర్బంధించారన్నారు. ఓవైసీ చేసిన కొన్ని వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్రంగా నిరసన తెలిపారు. కేంద్రమంత్రులు రవిశంకర్ ప్రసాద్, కిషన్ రెడ్డి కూడా తీవ్ర నిరసన తెలిపారు. 'ఢిల్లీ అల్లర్లను మత కలహాలనడం హాస్యాస్పదం. ఇవి ముందే ప్లాన్ చేసుకున్న ఊచకోత' అని ఓవైసీ వ్యాఖ్యానించారు. 'ఫైజాన్ ముస్లిం అయినంత మాత్రాన ఆయన ప్రాణం విలువ అంకిత్ ప్రాణం విలువ కన్నా తక్కువ కాబోదు. మొత్తం హింసాకాండపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలి' అని ఆయన కోరారు. అల్లర్ల సమయంలో ముస్లింలకు సాయం చేసిన సిక్కులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో హిందువుల బస్తీలను ఎవరు ఖాళీ చేయిస్తున్నారు?

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో హిందువుల బస్తీలను ఎంఐఎం పార్టీ వారు ఖాళీ చేయిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ఓవైసీ ప్రసంగానికి కౌంటర్‌గా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత బస్తీలో అనేక చోట్ల దళితుల బస్తీలను ఎంఐఎం వారు ఖాళీ చేయించారని ఆరోపించారు. అంతేకాకుండా, వారిపై దాడులు కూడా చేయిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఇవన్నీ చేస్తూ ఇక్కడ పెద్ద పెద్ద ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

2024 తర్వాతా పుతినే అధ్యక్షుడు

సవరణలకు పార్లమెంట్ ఆమోదం

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా మరింత కాలం కొనసాగేందుకు వ్లాదిమిర్ పుతిన్ మార్గాన్ని సుగమం చేసుకున్నారు. పుతిన్ ప్రస్తుత అధ్యక్ష పదవీ కాలం 2024లో ముగియనుంది. ఆ తర్వాతా మరో 12ఏళ్లు తనే అధ్యక్షుడిగా కొనసాగించేందుకు వీలుగా చేసిన రాజ్యాంగ సవరణలను రష్యా పార్లమెంట్ బుధవారం ఆమోదించింది. దిగువ సభ 'ద స్టేట్ డ్యూమా' రాజ్యాంగంలో చేసిన పలు సవరణలకు ఓకే చెప్పింది. ఈ సవరణలకు 383 అనుకూల ఓట్లు లభించగా ఏ ఒక్క పార్లమెంటు సభ్యుడు వ్యతిరేకించకపోవడం గమనార్హం. కాకపోతే 43 మంది సభకు దూరంగా ఉన్నారు. అనంతరం కొన్ని గంటల వ్యవధిలోనే ఈ సవరణలు అన్నింటికీ ఎగువ సభ ఫెడరేషన్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఏప్రిల్ 22న దేశవ్యాప్తంగా ఈ సవరణలపై ఓటింగ్ జరగనుంది. అంతకంటే ముందు రష్యా రాజ్యాంగ న్యాయస్థానం ఈ సవరణలను సమీక్షించనుంది. మాజీ కేజీబీ అధికారి అయిన వ్లాదిమిర్ పుతిన్ 20 ఏళ్లుగా రష్యా రాజకీయాల్లో ఆధిపత్యం కొనసాగిస్తుండటం తెల్సిందే.

నకిలీ వార్తల ఏరివేతపై మీ వైఖరేంటి?

కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తలు, ద్వేషపూరిత ప్రసంగాలను తొలగించే అంశంపై తన వైఖరిని తెలియజేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు కేంద్రానికి ఒక నోటీసు జారీ చేసింది. బుధవారం కేంద్ర హోం, ఆర్థిక, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆర్ఎస్ఎస్ మాజీ సిద్ధాంతకర్త కె.ఎన్.గోవిందాచార్య దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ ఏప్రిల్ 14న జరగనుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనల ప్రకారం.. ట్విట్టర్, ఫేస్‌బుక్, గూగుల్‌లు భారత్‌లో తమ అధికార ప్రతినిధుల వివరాలను బహిర్గతపరిచేలా ఆయా సంస్థలను ఆదేశించాలని పిటిషనర్ తరపు న్యాయవాది విరాజ్ గుప్తా డిమాండ్ చేశారు. ద్వేషపూరిత ప్రసంగాలకు స్వర్గధామాలైపోయినా సామాజిక మాధ్యమాల్లో చట్టాలను అమలు చేసే వ్యవస్థ పోతోందని, అందుకు జవాబుదారీ అయిన అధికారులు ఎవరనేది తెలియకపోవడమూ ఇందుకు కారణమని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలర్లకు, ఆస్తుల విధ్వంసానికి సామాజిక మాధ్యమాలు ఒక పనిముట్టుగా మారకూడదని, భావప్రకటన స్వేచ్ఛలో భాగమని చెప్పుకోవడమూ సరికాదని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. భావ ప్రకటన స్వేచ్ఛ అన్న భావనను ఈ సామాజిక మాధ్యమాలు దుర్వినియోగం చేస్తున్నాయని, భారతీయ చట్టాలను పాటించడం లేదని ఆరోపించారు. తగిన చర్యలేవీ లేని కారణంగానే రెచ్చగొట్టే ప్రసంగాలూ ఎక్కువ అవుతున్నాయని పిటిషనర్ ఆరోపించారు.

ఇద్దరు ఐటీ ఉద్యోగులకు కరోనా

- ఏప్రిల్ 15వరకు వీసాలు రద్దు: భారత్
- ఇరాన్‌లో ఒక్కరోజే 63 మంది మృతి

షిర్డీలోని సాయి బాబా ఆలయ ప్రాంగణంలో భక్తులకు థర్మల్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

న్యూఢిల్లీ/సాక్షి, బెంగళూరు: భారత్‌లో కరోనా వైరస్ భయాందోళనలు సృష్టిస్తోంది. ఇద్దరు ఐటీ ఉద్యోగులకు కరోనా సోకడం కలకలం రేపుతోంది. డెల్, మైండ్ ట్రీ ఐటీ కంపెనీలకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు కరోనా సోకినట్టు బుధవారం ఆ కంపెనీలు వెల్లడించాయి. అమెరికా టెక్సాస్ నుంచి వచ్చిన ఒకరికి కరోనా వైరస్ సోకింది. మైండ్ ట్రీ కంపెనీకి చెందిన ఉద్యోగి ఆఫీసు పని మీద ఇతర దేశానికి వెళ్లి వచ్చారు. ఈ ఉద్యోగులిద్దరూ భారత్‌కు వచ్చాక వారు కలిసిన సంబంధీకులను నిర్బంధంలో ఉంచి వైద్య పరీక్షలు చేస్తున్నారు.

అది కరోనా మరణం కాదు: కర్ణాటక మంత్రి

మన దేశంలో కరోనా వైరస్ సోకినట్టుగా అనుమానిస్తున్న ఒక వృద్ధుడు మరణించారు. ఇటీవల సౌదీ యాత్రకి వెళ్లొచ్చిన 76 ఏళ్ల కర్ణాటక వాసి మహమ్మద్ హుస్సేన్ సిద్ధిఖీ జ్వరం, దగ్గు, జలుబు ఉండటంతో ఐదోతేదీన కలబురిగి జిల్లా మెడికల్ కాలేజీకి, తర్వాత 9న హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. వైరస్ లక్షణాలు తగ్గకపోవడంతో అంబులెన్స్‌లో కలబురిగికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. అతనికి కోవిడ్ సోకిందన్న అనుమానంతో గతంలోనే రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం బెంగుళూరు ల్యాబ్‌కి పంపారు. హుస్సేన్‌కి కోవిడ్ సోకి ఉంటుందనే అనుమానాలున్నాయని కలబురిగి జిల్లా ఆరోగ్య శాఖ వెల్లడించింది. సిద్ధిఖీ వృద్ధాప్యంతోనే తుదిశ్వాస విడిచారని, వైరస్ సోకిందని ఆందోళన చెందవద్దని మంత్రి చెప్పారు. దౌత్య, అధికారిక, ఐరాస, ఉద్యోగ, ప్రాజెక్టు వీసాలు తప్ప మిగిలిన వీసాలన్నీ ఏప్రిల్ 15 వరకూ రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

ప్రపంచదేశాల్లో కరోనా కేసులు: ఇంచుమించుగా లక్షా 18 వేలు

మృతులు	4,250కి పైగా
వ్యాధి విస్తరించిన దేశాలు	107

బ్రిటన్ మంత్రికి కరోనా

బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ, ఆరోగ్య శాఖ ఉపమంత్రి నాడీన్ డోరిస్‌కు కోవిడ్ సోకింది. ఈమె గతవారం బ్రిటన్ ప్రధాని, ఇతర ఎంపీలు హాజరైన విందులో పాల్గొన్నారు. దాంతో ఎవరెవరికి వైరస్ సోకిందేమోనన్న ఆందోళన నెలకొంది. అమెరికాలో ఇప్పటివరకు 31 మంది మరణిస్తే, 38 రాష్ట్రాలకు ఈ వ్యాధ

సాక్షి
గురువారం, మార్చి, 12

పతనం తెచ్చిన సదవకాశం

ప్రపంచమంతటా విస్తరిస్తున్న కరోనా వైరస్‌తో ఆర్థిక వ్యవస్థలన్నీ కుదేలవుతున్న తరుణంలో పులి మీద పుట్రలా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో స్టాక్ మార్కెట్లన్నీ కకావికలయ్యాయి. మహా మహా చమురు కంపెనీల షేర్ల ధరలు 15 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. రూపాయి విలువ 17 నెలల కనిష్ట స్థానానికి క్షీణించింది. చమురు ఉత్పత్తిలో రెండు, మూడు స్థానాల్లోవున్న సౌదీ అరేబియా, రష్యాల వైరం పతాక స్థాయికి చేరుకోవడం, కరోనా విస్తృతి ప్రభావంతో చమురు వినియోగం తగ్గడం వంటి కారణాల పర్యవసానంగా ఈ పరిస్థితి ఏర్పడింది. 1991 గల్ఫ్ యుద్ధం తర్వాత ఈ స్థాయిలో ఒకేసారి చమురు ధరలు పతనం కావడం ఇదే మొదటి సారి. స్టాక్ మార్కెట్ల స్పందన మాటెలావున్నా, ప్రపంచ దేశాల కరెన్సీలు పల్టీలు కొట్టినా ఈ చమురు ధరల పతనం మనతో సహా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతోకొంత మేలుతో పాటు సమస్యల్ని కూడా తెస్తుంది. మేలు చేకూర్చే అవకాశాల్ని వినియోగించుకోవడం, సమస్యల్ని అధిగమించడం ఇప్పుడు పెద్ద సవాలు. అయితే చమురు ధరలు ఇదే స్థాయిలో ఎన్నాళ్లుంటాయన్నది ప్రశ్నార్థకమే. అంతర్జాతీయ మార్కెట్ ధరలకనుగుణంగా పెట్రో ధరలు తగ్గిస్తే సామాన్యులపై పడిన భారం కాస్తంత ఉపశమిస్తుంది. విదేశీ మారకద్రవ్య నిల్వల లోటు భర్తీకి అవకాశం ఏర్పడుతుంది. ద్రవ్య లోటును తగ్గించుకోవచ్చు.

ఆరేళ్లక్రితం షేల్ ఆయిల్‌తో చమురు రంగంలోకి దిగిన అమెరికా స్వల్పకాలంలోనే అగ్రజుడిగా ఎదిగి ప్రపంచ చమురు మార్కెట్‌నే శాసించే స్థాయికి చేరుకుంది. తమ భూభాగంలో భూమికి ఆరువేల అడుగుల లోతున నాపరాయి రాతిపొరల్లో చమురు నిల్వలు అపారంగా విస్తరించివున్నాయని, దీన్నంతటినీ రాగల 50 ఏళ్లపాటు అవిచ్ఛిన్నంగా వినియోగించుకుని ఇంధన రంగంలో ఏకచ్ఛత్రాధిపత్యం నెలకొల్పవచ్చునని అమెరికా వేసిన అంచనాలో లోపమేమీ లేదు. రోజుకు 0.4 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తితో ప్రారంభించి ఇప్పుడు 40 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసే దిగ్గజంగా మారింది. అప్పటివరకూ అది తన అవసరాల కోసం సౌదీ అరేబియా, రష్యాల వద్ద చమురు కొనేది. అంతక్రితం చమురు దిగుమతులపై ఆధారపడిన దేశం ఒక్కసారిగా ఎదగడమే కాదు... ఆ రంగంలో పాతుకుపోయి ఇష్టారాజ్యం కొనసాగిస్తున్న తమను సవాలు చేయడంపై ఆగ్రహించి ఒక్కటైన దేశాలు పరస్పర విభేదాల్లో కూరుకుపోవడం తాజా సమస్యకు మూలం. తమకు ప్రధాన ప్రత్యర్థిగా మారిన అమెరికాను అదుపు చేయడమెలా అన్న అంశంలో ఇప్పుడు రష్యా, సౌదీలు వాదులాడుకుంటున్నాయి. అమెరికా కట్టడికి 15 దేశాలు సభ్యులుగా వున్న చమురు ఎగుమతి దేశాల సంస్థ(ఒపెక్)తో చేతులు కలుపుతానని, ఆ సంస్థ నిర్ణయాలకు అనుగుణంగా వ్యవహరిస్తానని మూడేళ్లక్రితం రష్యా హామీ ఇచ్చింది. అలాగని ఒపెక్‌లో దానికి సభ్యత్వం లేదు. కానీ గత వారం వియన్నాలో జరిగిన ఒపెక్ దేశాల సమావేశంలో సభ్య దేశాలన్నీ రోజుకు పది లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి తగ్గించుకోవాలని సౌదీ అరేబియా చేసిన ప్రతిపాదన దానికి రుచించలేదు. చమురును దిగుమతి చేసుకునే చైనా, దక్షిణ కొరియాలు కరోనా బారిన పడి ఇంధన వినియోగంలో వెనకబడ్డాయి గనుక ఇది అవసరమన్నది సౌదీ అభిప్రాయం. ఆ చర్య అమెరికాకు లబ్ధి చేకూరుస్తుందన్న భావనతో రష్యా దీన్ని అంగీకరించలేదు. తాము ఉత్పత్తిలో కోత పెడితే అమెరికా చమురు సంస్థలకు పట్టపగ్గాలుండవని, అవి మార్కెట్లను మరింతగా ఆక్రమించుకుంటాయని రష్యా వాదన. దాంతో రష్యాకు గుణపాఠం చెప్పి, దానిపై ఒత్తిడి పెంచడం కోసం సౌదీ ఒక్కసారిగా చమురు ఎగుమతి ధరను తగ్గించింది. అదే సమయంలో ఉత్పత్తిని పెంచింది. సౌదీ, రష్యాలు రెండూ రాజీ కొచ్చి చర్చిస్తే తప్ప ఇప్పుడేర్పడిన సంక్షోభం ఉపశమించదని, బ్యారెల్ చమురు ధర 20 డాలర్లకు పతనమైతే అది అందరికీ చేటు కలిగిస్తుందని ఒపెక్ దేశాలు ఆందోళన పడుతున్నాయి. అవి ఏకాభిప్రాయానికి రావడం, యథాపూర్వ స్థితి ఏర్పడటం ఎన్నాళ్లకు సాధ్యమో ఎవరూ చెప్పలేకున్నారు.

చమురు ఉత్థానపతనాలు ప్రపంచ రాజకీయాలను శాసించడం ఎప్పుడూ ఉన్నదే. కానీ ఏ నిర్ణయం ఎటు దారితీస్తుందో, ఎవరికి దెబ్బ తగులుతుందో అంచనా వేయడం అంత సులభమేమీ కాదు. గతంలో అమెరికా షేల్ ఆయిల్ ఉత్పత్తిదారుల ఆర్థిక మూలాలు దెబ్బతీయడానికి చమురు ధరలను సౌదీ తగ్గించినప్పుడు అమెరికాకు కలిగిన నష్టం పెద్దగా లేదు సరిగదా సౌదీ ఆర్థిక వ్యవస్థే సమస్యల్లో చిక్కుకుంది. దాంతో అది తన వైఖరిని మార్చుకుంది. చమురు దిగుమతిపైనే ప్రధానంగా ఆధారపడే మనలాంటి దేశాలకు తాజాగా పతనమైన చమురు ధరల వల్ల ప్రయోజనమే వుంటుంది. అదే సమయంలో సమస్యలూ వుంటాయి. ఇందులో అనుకూలాంశమేమంటే...విదేశీ మారకద్రవ్య నిల్వల లోటును గణనీయంగా తగ్గించుకోవడానికి, ద్రవ్యోలబ్ధాన్ని కట్టడి చేయడానికి ఇంతకు మించిన మంచి అవకాశం ఏ దేశానికీ రాదు. అందువల్ల ఆదా అయ్యే సొమ్ముతో అనేక కీలకమైన పథకాలకు ఆర్థిక సాయం అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. కానీ చమురు ధర ఎక్కువ కాలం బ్యారెల్‌కు 40 డాలర్ల లోపు స్థిరంగావుంటే అది ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని, మార్కెట్లకు అది శుభసూచకం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్థిక మాంద్యం ఏర్పడితే అది ఎఫ్‌డీఐలపై ప్రభావం చూపడమే కాదు... ఇక్కడినుంచి పెట్టుబడులు తరలిపోయే ప్రమాదం కూడా ఏర్పడుతుందంటున్నారు. ఏదేమైనా పడిపోయిన చమురు ధరల వల్ల కలిగే ప్రయోజనాన్ని పౌరులకు బదిలీ చేయడం అవసరం. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా పెట్రో ఉత్పత్తులపై పన్నులు పెంచి, నామమాత్రంగా ధర తగ్గించడం ప్రభుత్వాలకు అలవాటైంది. ఈసారి ఆ విధానాన్ని అమలు చేయరని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి బ.తదియ సా.4.54 వరకు, తదుపరి చవితి, నక్షత్రం చిత్త రా.9.10 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం ఉ.6.14 నుంచి 7.44 వరకు, తిరిగి రా.2.24 నుంచి 3.54 వరకు, దుర్ముహూర్తం ఉ.10.10 నుంచి 10.56 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు అమృతఘడియలు... ప.3.12 నుంచి 4.44 వరకు.

సూర్యోదయం : 6.15
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

సవాళ్లను దాటి.. జనహృదిని మీటి

ఒక మనిషిని అణగదొక్కడానికి ఎన్నో రకాల కుట్రలు. ఒక పార్టీ ఎదగకుండా ఎన్నో వైపుల నుంచి దాడులు. అయినా జగన్ నడిచాడు, జనాన్ని గెలిచాడు. పార్టీ బరిలో నిలిచింది, ప్రభంజనం సృష్టించింది. సవాళ్లనే సోపానాలుగా మలుచుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేళ్ల ప్రస్థానం ఇది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొమ్మిదేళ్ల ప్రయాణం ఇది.

పదవ వసంతంలోకి అడుగిడిన వైఎస్సార్‌సీపీ

సంక్షేమ పథకాల ప్రదాతగా తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన వైఎస్ రాజశేఖరరెడ్డి వారసత్వాన్ని కొనసాగించడానికి ముందడుగు వేసిన జగన్‌మోహన్ రెడ్డి, పూర్తి ప్రతికూల పరిస్థితుల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్‌ను తొమ్మిదేళ్లలో తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చి దిద్దారు. చరిత్రలో ఎందరో ముఖ్యమంత్రులు, వారి కుమారులు ఉన్నా వారెవరూ సోదిలో కూడా లేకుండా పోయారు. కానీ జగన్ చరిత్రను సృష్టించారు. దేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల్లో మరెక్కడా కూడా మరణించిన ఒక రాష్ట్రాధినేత, దేశాధినేత కుమారులు అణచివేతను ఎదుర్కొంటూ అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో కృతకృత్యులైన వారు లేరు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పదేళ్ల కృషి ఉంది. మార్చి 12, 2011న తన తండ్రి సమాధి వద్ద ఆయన పేరు ప్రతి బింబించేలా వైఎస్సార్ కాంగ్రెస్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్) పార్టీని జగన్ స్థాపించారు. 2009 లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభా స్థానం నుంచి ఎంపీగా ఎన్నికై రాజకీయ అరంగేట్రం చేసిన జగన్ సొంతంగా పార్టీని పెట్టడానికి గల నేపథ్యం ప్రజలందరికీ తెలుసు. తన రెక్కల కష్టంతో నిరంకుశ టీడీపీ 9 ఏళ్ల పాలనను మట్టి కరిపించి 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం కాగలిగారు. అందరూ మెచ్చే పథకాలను తన ఐదేళ్ల పాలనలో అమలు చేసి తిరిగి 2009లో రెండోసారి సీఎం అయ్యారు. కొద్ది నెలలైనా గడవక ముందే రచ్చబండ కార్యక్రమానికి వెళుతూ సెప్టెంబర్ 2, 2009 నాడు హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించి యావత్ తెలుగు ప్రజలను విషాదంలో ముంచెత్తారు.

ఇచ్చిన మాట కోసం

తండ్రి హఠాన్మరణపు షాక్‌లో ఉండగానే ఈ విషాదాన్ని తట్టుకోలేక వందలాది మంది మరణించడం జగన్‌నూ, ఆయన కుటుంబీకులనూ కలచి వేసింది. వారి కుటుంబాలను పరామర్శించడానికి వెళతానని నల్ల కాలువ వద్ద (వైఎస్ మరణించిన చోటు) జరిగిన సభలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఓదార్పు యాత్రను ప్రారంభించిన జగన్ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. యాత్రను ఆపేయాల్సిందిగా కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించింది. ఓదార్పు యాత్రకూ రాజకీయాలకూ సంబంధం లేదనీ, మృతి చెందిన కుటుంబాలకు ధైర్యం చెప్పడానికే వెళుతున్నానని జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలతో ఢిల్లీలో ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీని కలిసి వివరించినా లాభం లేకపోయింది. ఏదైతే అదవుతుందని ఓదార్పు యాత్రను తాను అనుకున్న విధంగా జగన్ కొనసాగించారు. దానికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక పోయిన కాంగ్రెస్‌లోని కొన్ని శక్తులు, టీడీపీతో కలిసి కుట్రలకు తెరతీశాయి. జాతీయ కాంగ్రెస్ నేతల వైఖరిని అర్థం చేసుకున్న జగన్ తన తల్లి విజయమ్మతో కలిసి కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ స్థానాలకు రాజీనామాలు చేయడంతో పాటుగా కాంగ్రెస్ పార్టీకి 29 నవంబర్ 2010న రాజీ నామా చేశారు.

పోరుబాటలో...

పార్టీని వీడాక ఓ వైపు ఓదార్పు యాత్రను సాగిస్తూనే, మరో వైపు ప్రజా సమస్యలపై పోరాటం చేశారు జగన్. వైఎస్ స్థానంలో వచ్చిన ప్రభుత్వాలు సంక్షేమ పథకాల అమలును నిర్లక్ష్యం చేయడాన్ని ప్రశ్నిస్తూ పలు దీక్షలు చేశారు. రైతులు, చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరుతూ విజయవాడ కృష్ణా నదీ తీరాన 21 డిసెంబర్ 2010న 'లక్ష్య దీక్ష'తో పోరుబాటను ప్రారంభించారు. పార్టీని వీడిన తరువాత జగతి పబ్లికేషన్స్‌కు ఆదాయపు పన్నుల శాఖ నోటీసులను జారీ చేయడంతో వేధింపుల పర్వం ప్రారంభం అయింది. లెక్క చేయని జగన్ 11 మార్చి 2011న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరును ప్రకటించారు. ఆ మరుసటి రోజునే ఇడుపులపాయలో పతాకాన్ని తండ్రి సమాధి వద్ద ఆవిష్కరించి పార్టీని స్థాపించారు. రైతులు, చేనేత, విద్యార్థి, యువజన, నిరుద్యోగ వర్గాల సమస్యలపైనా, రాష్ట్రానికి రావాల్సిన హక్కులపైనా నిత్య పోరాటాలు చేస్తూ పార్టీని పటిష్టం చేసుకుంటూ వచ్చారు.

16 నెలల అక్రమ నిర్బంధం

వైఎస్సార్‌సీపీ బలీయమైన శక్తిగా ఎదుగుతోందని గ్రహించిన కాంగ్రెస్ అధిష్టానవర్గం జగన్ అణచివేతకు పిడికిలి బిగించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్రావు కేసు వేయడం, టీడీపీ నేతలు కూడా కేసులో ప్రతివాదులుగా చేరడంతో హైకోర్టు జగన్‌పై సీబీఐ విచారణకు ఆదేశించింది. ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న జగన్‌ను దర్యాప్తు కోసమని పిలిచి మే 27, 2012న అరెస్టు చేసి 16 నెలల పాటు జైలులో పెట్టింది. జైలులో ఉంచడం వల్ల ఆయన పలుకుబడి మరింత పెరిగిందే తప్ప మసక బారలేదు. చంచల్‌గూడ జైలులో ఉన్నప్పటికీ పార్టీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ, సోదరి షర్మిల సహకారంతో పార్టీని పటిష్టం చేసే వ్యూహాలను రూపొందించారు. 24 సెప్టెంబర్ 2013న జైలునుంచి విడుదలైన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ ఆమరణ దీక్షకు పూనుకుని 2014 శాసనసభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు.

ప్రతిపక్ష నేతగా జగన్

2014 ఎన్నికల్లో ఏపీలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించగలదని చివరివరకూ అంచనాలు వెలువడినప్పటికీ అనూహ్యమైన రీతిలో కొద్ది తేడాతో పరాజయం పాలైంది. 67 శాసనసభా స్థానాలను గెల్చుకుని ఏకైక అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. అధికార పక్షమైన టీడీపీ అనైతికమైన రాజకీయ కుట్రలతో వైఎస్సార్‌సీపీని నలిపి వేయాలని చూసింది. 23 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని వారిని అనర్హతకు గురి కాకుండా స్పీకర్ వ్యవస్థను ఉపయోగించుకుంది. తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ 11 నవంబర్ 2017 నుంచీ శాసనసభను బహిష్కరించారు.

చారిత్రాత్మకం–ప్రజా సంకల్పం

6 నవంబర్ 2017న తన తండ్రి సమాధి వద్ద నుంచి ప్రారంభించి, 14 నెలలు 3,648 కిలోమీటర్ల మేరకు చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించింది. ఇచ్ఛాపురంలో 9 జనవరి 2019న ముగించిన ఈ యాత్రలో జగన్ లక్షలాది మంది కష్ట సుఖాలు తెలుసుకున్నారు. యాత్ర ముగిసీ ముగియగానే వేడెక్కిన 2019 ఎన్నికల వాతావరణంలో పార్టీని దీటుగా నడిపించారు. తిరుగేలేదని భావించిన బాబు నిరంకుశ ప్రభుత్వాన్ని మట్టి కరిపించారు. కనీ వినీ ఎరుగని రీతిలో 175 అసెంబ్లీ స్థానాలకుగాను 151, 25 లోక్‌సభ స్థానాలకుగాను 22 గెల్చుకుని అధికారాన్ని కైవసం చేసుకున్నారు.

తండ్రి కన్నా ముందడుగే...

పేదలను ఆదుకునే విషయంలో తండ్రి కన్నా రెండడుగులు ముందే ఉంటానని తొలి నుంచీ ప్రకటిస్తూ వచ్చిన జగన్, 2019 మే 30న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తొలి సంతకం ద్వారా అవ్వాతాతల పింఛన్లను రూ.2,250కి పెంచి, తండ్రి తొలి సంతకపు వారసత్వాన్ని కొనసాగించారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోయే భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని పేర్కొన్న జగన్ అక్షరాలా అందులోని హామీల అమలుకు తొలి రోజు నుంచే పూనుకున్నారు. బలహీన వర్గాలకు పదవుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించడమే కాక మంత్రి వర్గంలో సైతం సగానికి పైగా పదవులను ఇచ్చి నూతన సంప్రదాయాన్ని నెలకొల్పారు. అమ్మ ఒడి మొదలు నాడు నేడు, రైతు భరోసా... ఇలా లెక్కలేనన్ని సంక్షేమ పథకాలను విప్లవాత్మకమైన రీతిలో అమలు చేస్తున్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వెనుకడుగు వేయకుండా హామీలను అమలుచేసే యజ్ఞంలో మునిగిపోయారు. తన పదేళ్ల కృషితో, 9 ఏళ్ల వైఎస్సార్‌సీపీ రాజకీయ ప్రస్థానంలో జగన్ తన తండ్రిలాగే ప్రతి పేదవాడి గుండెల్లో కొలువు దీరాలని అప్రతిహతంగా ముందుకు సాగుతున్నారు.

ఆర్.ఎం. బాషా
సీనియర్ చీఫ్ రిపోర్టర్, సాక్షి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దాడులు

"హిందూ, ముస్లింలనే మాట నేను వాడను. ఒవైసీ మసీదులు ధ్వంసమయ్యాయని అంటున్నారు. దేవాలయాలు కూడా విధ్వంసానికి గురయ్యాయి. ఆయన జుబైర్ గురించి ప్రస్తావిస్తారు. కానీ, ఐజీ అధికారి అంకిత్ గురించి మాట్లాడరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. 'అందరూ ప్రశాంతంగా ఉండాలని తాను పిలుపునివ్వలేదని వారందరూ అంటారు గానీ అది నిజం కాదు. మహావృక్షం కుప్పకూలినప్పుడు పునాదులు ప్రకంపించడం సహజమేనని 3,000 మంది సిక్కులను ఊచకోత కోసినప్పుడు కాంగ్రెస్ పాలకులు వ్యాఖ్యానించారు. నేనలా అనలేదే?' అని అమిత్ షా వ్యాఖ్యానించారు"

– విజైతా సింగ్, జర్నలిస్ట్

కరోనా

"అప్రమత్తంగా, జాగ్రత్తగా, సంయమనంతో అమెరికా ప్రజలంతా వ్యవహరించి, కరోనా వైరస్ రాకుండా, విస్తరించకుండా అన్ని రకాల జాగ్రత్తలను పాటిస్తున్నారు. అదే సమయంలో మీ కమ్యూనిటీలోని చిన్న వ్యాపారులకు మద్దతివ్వడానికి కూడా ప్రయత్నించండి. విపత్కర పరిస్థితుల్లో మనందరం కలిస్తేనే ఒక జాతి"

– ఇవాంకా ట్రంప్, సీనియర్ సలహాదారు

ఇంగ్లీష్

"బీజేపీ అగ్రనేత అరుణ్ జైట్లీ మరణించినప్పటి నుంచి మంచి ఇంగ్లీష్‌లో లుటెన్స్ మీడియాతో సంప్రదించేవారు కరువయ్యారు. ఇప్పుడు మహారాజా సింధియా బీజేపీలో చేరడంతో తాము ముచ్చట్లు చెప్పుకోవడానికి చివరకు ఒకరు దొరికారని మీడియా వర్గాలు సంతోషపడుతున్నాయి. జే పాండా అంత సమర్థుడు కాదు"

– సుమిత్ కాశ్యప్, జర్నలిస్ట్

పవర్

"నా రాజకీయ ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి ఎప్పుడూ అధికారంలో లేం. ఒకప్పుడు అధికారం ఉండి, ఇప్పుడు లేకపోతే.. అధికార దాహం నన్ను బలవంతంగా చీకట్లోకి నెట్టేదా అని కొన్నిసార్లు నేను ఆశ్చర్యపోతూ ఉంటా. అప్పుడు నేను నా దేశాన్ని, నేను ఎక్కడినుంచి వచ్చానో అన్న విషయాన్ని గుర్తుచేసుకుంటా.. వెంటనే నా సందేహాలన్నీ తొలగిపోతాయి"

– మోహన్ కుమారమంగళం, కాంగ్రెస్ నేత

గుణపాఠం

"ఒక ఫేక్ స్టోరీని ట్వీట్ చేసినందుకు కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ ఎమ్మెల్యే అర్షద్ రిజ్వాన్ కర్ణాటక భారతీయ జనతా పార్టీ నేతపై కేసు పెట్టాడు. ఈ కేసు విషయంలో ఆ నేత నిన్న ఉదయం కోర్టుకు హాజరయ్యాడు. మూర్ఖత్వంలో పేరుగాంచిన బీజేపీ దీని నుంచి గుణపాఠం నేర్చుకుంటుందని ఆశిస్తున్నా"

– ప్రజ్వల్ కుట్టప్ప, కాంగ్రెస్ నేత

పగ్గాలు

"సామాజిక భద్రతను, లౌకికవాదాన్ని కాపాడటానికి, యువతను ప్రోత్సహించడానికి రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టాలి. మభ్యపెట్టే, అవకాశవాద పరివార్ పట్ల ఏమాత్రం ఇక సహనం చూపించాల్సిన అవసరం లేదు. పార్టీకి వెన్నుపోటు పొడిచేవారిని వెంటనే బయటకు పొమ్మనాలి. పార్టీకంటే ఎవరూ ముఖ్యం కాదు"

– హరూన్ యూసఫ్, కాంగ్రెస్ నేత

సింధియా నిష్క్రమణతో 'చేతి'కి చిక్కులు

సందర్భం

లక్ష్మణ్ వెంకట్ కూచి

కాంగ్రెస్ పార్టీ నిజమైన పతనం ఇప్పుడే ప్రారంభం అయివుండవచ్చు. కాంగ్రెస్ యువనేతల్లోని అత్యంత ప్రతిభాశాలులలో ఒకరైన జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్ రాజకుటుంబం వారసుడు, కాంగ్రెస్ మాజీనేత మాధవరావు సింధియా తనయుడు, గాంధీ కుటుంబ విధేయుడు) భారత రాజకీయాల్లో కురువృద్ధ పార్టీకి లాంఛనంగా వీడ్కోలు పలికారు. పైగా కాంగ్రెస్‌కు మరింత అవమానం కలిగిస్తూ దాని బద్ధ విరోధి అయిన భారతీయ జనతాపార్టీలో చేరిపోయారు.

కాంగ్రెస్ నాయకత్వానికి వ్యతిరేకంగా సింధియా చేసిన తిరుగుబాటు మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ పతనానికి దారితీయడమే కాదు.. పార్టీలో తాము ఒంటరులుగా మిగిలిపోయాం అని, అవమానాల పాలవుతున్నామని భావిస్తున్న ఇతరులకు కూడా కాస్త ధైర్యమిచ్చింది. దీనికి కాంగ్రెస్ పార్టీ తన్నుతాను తప్పుపట్టుకోవలసిందే కాని ఇతరులను నిందించలేదు.

లక్ష్మణరేఖను ఇలా దాటగలడా?

ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కలిసిన తర్వాత జ్యోతిరాదిత్య సింధియా తన రాజీనామాను ప్రకటించడానికి ముందు, చివర నిమిషం వరకు సింధియా లక్ష్మణరేఖను దాటగలడని నమ్మడానికే కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రెస్ కుటుంబానికి సింధియా విధేయత పట్ల ఎన్నడూ సందేహం కలగలేదు. పైగా ఆయన కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ సన్నిహిత సహచరుడు కూడా. అందుకే కాంగ్రెస్ పార్టీ సింధియాను రాజీనామా చేసిన తర్వాత లాంఛనప్రాయంగా బహిష్కరించింది తప్ప తనపై చర్య తీసుకోవడంలో విఫలమైంది.

కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాలంగా ఎదుర్కొంటూ వచ్చిన ఉత్థానపతనాల చరిత్రలో ఒక నాయకుడు పార్టీని వదిలి వెళ్లడం అనేది చాలా చిన్న విషయమే అవుతుంది. కానీ సింధియాను పార్టీ వదులుకోవలసి రావడం, పైగా తనను పోగొట్టుకున్న సమయం కలిగించే ప్రభావం చాలా విస్తృతమైనది. ఇప్పుడు పార్టీ ఎదుర్కొంటున్న దీనావస్థలో సింధియా నిష్క్రమణ దానికి మరిన్ని చిక్కులను కొనితేవచ్చు.

ఇక బీజేపీ విషయానికి వస్తే సింధియా చేరిక పార్టీకి లడ్డూ లాంటి అవకాశమనే చెప్పాలి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ సాగిస్తున్న భావజాల సమరంలో సింధియా చర్య కాషాయ పార్టీకి ఎంతో మేలు చేస్తుంది. కాంగ్రెస్ ఉచ్చులోంచి తప్పించుకోవాలని చూస్తున్న అనేకమంది ప్రతిభావంతులను సింధియా అయస్కాంతంలా బీజేపీలోకి ఆకర్షించగలరు. బీజేపీలో లాంఛనంగా చేరిన తర్వాత మీడియాతో క్లుప్తంగా మాట్లాడిన సింధియా, కాంగ్రెస్ తిరస్కృత జీవితం గడుపుతోందని క్షేత్ర వాస్తవికతను అది పట్టించుకోవడం లేదని విమర్శించారు.

భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయిన యువనేతలు

పార్టీకి, దేశానికి కూడా సేవ చేయాలనుకుని వచ్చిన ఎంతో మంది యువనాయకులను కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహం ఇవ్వడం లేదని ఆరోపించారు. సింధియా ప్రకటన తర్వాత అయినా కాంగ్రెస్ కాస్త మేలుకుని ఈ సందర్భంలో పార్టీ నుంచి ఇతరులు వెళ్లిపోకుండా అడ్డుకోవాల్సి ఉంది. కానీ పార్టీలో ఇక తమకు భవిష్యత్తు లేదని భావిస్తున్న వారే ఎక్కువగా ఉంటున్న తరుణంలో వెళ్లిపోదలుస్తున్న వారిని నిలుపుకోవడం కాంగ్రెస్ పార్టీకి కష్టసాధ్యమే కావచ్చు.

కాంగ్రెస్ అధిష్టానం క్షేత్ర వాస్తవికతకు దూరమైందని, గతంలోనే జీవిస్తూ పార్టీ శ్రేణుల కొత్త ఆలోచనలను, భావోద్వేగాలను, ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తోందని సింధియా ఆషామాషీగా చెప్పడం లేదు, పార్టీలోని కురువృద్ధులకు, యువతరానికి మధ్య సాగుతున్న కుమ్ములాట కాంగ్రెస్‌ని మరింత బలహీనపర్చవచ్చు కూడా. నిజానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని కూల్చి కాంగ్రెస్‌కు ఝలక్ ఇచ్చే ఇలాంటి అవకాశంకోసం పొంచి ఉంటున్న బీజేపీ చేతుల్లోకి సింధియాను కాంగ్రెస్ చేతురాలా అప్పగించేసింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్ తెలివైన వృద్ధ జంబూకమే కావచ్చు కానీ తన ప్రభుత్వాన్ని నిలుపుకోవడం కష్టసాధ్యమని గుర్తించక తప్పదు. ఎందుకంటే బీజేపీ మొదలెట్టిన ఆపరేషన్ కమల్ పరాకాష్టకు చేరింది మరి.

సీఎం పదవిని ఆశించి భంగపాటు

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 2018 నవంబర్‌లో ప్రభుత్వాలు ఏర్పడుతున్న సమయంలో సింధియా, సచిన్ పైలట్ ఈ రెండు రాష్ట్రాల్లో సీఎం పదవిని ఆశించారు. కానీ రాహుల్ వారిని వృద్ధులకు అవకాశం ఇద్దామని చెప్పి నిలువరించారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న యువనేతలు తమకు ఊపిరాడటం లేదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన నేతల బాగోగులను కాంగ్రెస్ నాయకత్వం పట్టించుకోకపోతే, వారి ఆకాంక్షలను నెరవేర్చుకోకపోతే పార్టీనుంచి చాలామంది వెళ్లిపోవచ్చు కూడా.

ఆంధ్రప్రదేశ్ ఉదంతాన్నే తీసుకుందాం. నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విషాద మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్ల నిరాదరణ చూపింది. ఆయన కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టింది. దాని ఫలితం మనందరం చూశాం. 1977లో 42 ఎంపీ సీట్లకు గాను 41 సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ, వైఎస్ హయాంలో 30 పైగా ఎంపీ సీట్ల దన్నుతో యూపీఏ1, యూపీ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 12-3-2020

అమ్మాయికి 29 ఏళ్లు వచ్చాయి. ఉద్యోగం చేస్తోంది. చాలా సంబంధాలు వస్తున్నాయి. కాని చేసుకోను అంటోంది? ఎందుకు అని అడిగితే మూడు కారణాలు చెబుతోంది. ఏమిటి ఆ కారణాలు? అసలు కారణం ఎక్కడ దాగుంది?

పెళ్లి చేసుకోని అమ్మాయి

ప్యాంట్ వేసుకుంటే ప్రవల్లిక చక్కగా కనిపిస్తుందని ఆమె ఆఫీస్‌లో ఫిమేల్ కలీగ్స్ అంటారు. ప్రవల్లిక కొంచెం పొడగరి. జుట్టు కూడా పొడవుగా ఉంటుంది. నడుస్తూ ఉంటే చూడబుద్ధేసేలా ఉంటుంది. ఆ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మూడు షిఫ్ట్‌లలో డ్యూటీ ఉంటుంది. ఏ షిఫ్ట్ డ్యూటీలో అయినా ప్రవల్లిక అలసట కనపడనివ్వక తాజాగా ఉంటుంది. అలాంటి ప్రవల్లికను పెళ్లి చేసుకోవాలని ఎవరికి ఉండదు? కాని ఆ అమ్మాయి మాత్రం పెళ్లికి దూరం.

పెళ్లా? నాకా? అని నవ్వేస్తుంది.

•••

ప్రవల్లిక వాళ్ల ఇల్లు గచ్చిబౌలిలో ఉంటుంది. ప్రవల్లిక తర్వాత ఇద్దరు ఆడపిల్లలు. ఒక అమ్మాయి పి.జి. చేస్తోంది. ఒక అమ్మాయి బి.టెక్ చేస్తోంది. ముగ్గురు ఆడపిల్లలు ఇంట్లో కళకళలాడుతూ ఉంటారు. తండ్రి లెక్చరర్. తల్లి గృహిణి. ముగ్గురి పెళ్లిళ్ల కోసం ప్రత్యేకంగా సేవింగ్స్ చేసి ఉన్నారు. కాని ప్రవల్లిక వైఖరి వాళ్లకు అర్థం కాకుండా ఉంది.

'పెళ్లి చేసుకోవే' అని తల్లి అడిగితే–

'అదేంటమ్మా.. అలా అంటావ్. ఇంటికి పెద్ద కూతురిని. నిన్నూ నాన్నను చూసుకోవాల్సిన దాన్ని. నాకు పెళ్లి వద్దు... ఏమీ వద్దు' అని అంటుంది.

మరోసారి నాన్న అడుగుతాడు– 'ఏమ్మా.. పెళ్లి చేసుకోవా? మా కొలిగ్ వాళ్ల అబ్బాయి ఉన్నాడు' అనంటే 'ఏం పెళ్లిలే నాన్నా... ఎన్ని చూడటం లేదు. ఏవీ సజావుగా సాగడం లేదు. అన్నీ ఏవో ఒక కంప్లయింట్లలో నడుస్తున్నాయి. ఆ కంప్లయింట్‌లలో నన్నూ పడమంటావా?' అంటుంది.

ఇంకోసారి ఇద్దరు చెల్లెళ్లు అడుగుతారు 'పెళ్లి చేసుకో అక్కా' అని.

అప్పుడేమో 'మగాళ్లు సరిగ్గా ఉంటే కదా చేసుకోవడానికి. వాళ్లు శరీరానికి ఇంపార్టెన్స్ ఇస్తారు తప్ప మనసుకు కాదు. స్త్రీ మనసుకు విలువ ఇచ్చే రోజులు వచ్చినప్పుడు చేసుకుంటాను' అంటుంది.

తల్లిదండ్రులకు ఇదంతా వొత్తిడిగా ఉంది. ఇంట్లో పెద్దమ్మాయికి పెళ్లయితేనే తర్వాతి ఇద్దరూ కదులుతారు. కాని ఈ అమ్మాయి ఇలా అంటోంది.

ఇప్పుడెలా?

•••

రోజులు గడిచే కొద్దీ ప్రవల్లికలో హుషారు పోతోంది. ఆ మెరుపు పోతోంది. నవ్వు పోతోంది. మూడీగా మారిపోతోంది. ఏమిటో.. ఏమయ్యిందో... ఇంట్లో వాళ్లకు అర్థం కావడం లేదు. పెళ్లి గురించి వొత్తిడి తెస్తున్నందుకు ఇలా చేస్తున్నదా? అని వారికి సందేహం వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ సంప్రదించుకుని ఆమెతో 'సరేలేమ్మా... నీకు పెళ్లి ఇష్టం లేకపోతే మానెయ్' అన్నారు.

'అంటే నేను పెళ్లే లేకుండా బతకమంటారా?' అని భోరున ఏడ్వడం మొదలుపెట్టింది.

> **మీ అమ్మాయి వేరే కులం అబ్బాయిని ప్రేమించింది. కాని మీరేమనుకుంటారోనని లోలోపల కుమిలిపోతోంది. చాలామంది అమ్మాయిలు తల్లిదండ్రులు ఎవరిని తెస్తే వారిని చేసుకోవచ్చు. కాని కొందరు అంత సులువుగా స్పందించరు. మీ అమ్మాయి అలాంటి అమ్మాయి.**

దాంతో ఇంకా తికమకపడిపోయారు తల్లిదండ్రులు.

ప్రవల్లిక ఏదో సమస్యతో బాధపడుతోంది. ఏంటా సమస్య అని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లారు.

•••

ముందు ప్రవల్లిక సైకియాట్రిస్ట్ దగ్గర ఏమీ ఓపెన్ కాలేదు. ఆ తర్వాత మెల్లగా తన గురించి చెప్పడం మొదలెట్టింది.

'సార్. మాకు అన్నం నీళ్లు లేకపోయినా పర్వాలేదు.. కులం ఉండాలి. మా నాన్న, అమ్మ ఎప్పుడూ కులం గురించే మాట్లాడుతుంటారు. చిన్నప్పటి నుంచి కులం గొప్పతనం చెబుతుంటారు. ఆ కులంలో పుట్టినప్పుడు ఆ కులాన్ని గౌరవించకుండా ఎలా ఉంటాం. అంతమాత్రాన ఇతర కులాలతో మనకు స్నేహం అక్కర్లేదా? అదొక్కటే కాదు.. ప్రేమలు, వేరెవరో ప్రేమించి చేసుకోవడం ఇవి చాలా తప్పు అని, ప్రమాదం అని పదే పదే చెబుతూ పెంచారు. మా బంధువుల్లో పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు చాలా చూశాను. అందరూ సఫర్ అవుతున్నారు. అలాగని ప్రేమ పెళ్లిళ్లు గొప్పవని కాదు. కాని కనీసం ఎంతో కొంత మన ఎంపిక ఉంటే బాగుంటుంది కదా. మా ఆఫీస్‌లో ఒకతను చాలా మంచివాడు. కష్టపడి పైకి వచ్చాడు. నేనంటే ఇష్టం ప్రదర్శిస్తుంటాడు. కాని ఆ సంగతి తెలియనట్టే నేనుంటాను. ఎందుకంటే అతడిది వేరే కులం. వేరే కులం కుర్రాడితో పెళ్లి మా ఇంట్లో సాధ్యం కాదు. కాని అతడు ప్రేమిస్తున్న సంగతి నాకు తెలుసు. ఆ మాట నాతో చెప్పనంత వరకూ నేను బాగానే ఉన్నాను. కాని మొన్న చెప్పి, పెళ్లి చేసుకుందాం అన్నాడు. అప్పటి నుంచి నాకు డిప్రెషన్ మొదలైంది. నేను నో చెప్తే అతడు వేరొకరిని పెళ్లి చేసుకుంటాడు. ఎస్ చెప్తే ఇంట్లో ఇబ్బందులొస్తాయి. అందుకే నాకు డిప్రెషన్ వచ్చేసింది' అంది ప్రవల్లిక.

సైకియాట్రిస్ట్‌కు సమస్య అర్థమైంది.

'నీకు అతన్ని పెళ్లి చేసుకోవాలని ఉందా?' అని అడిగాడు.

'ఉంది' అందా అమ్మాయి.

'చేసుకుంటావా?'

'కాని మా అమ్మా నాన్నలను వొదులుకోలేను'

'నేను వాళ్లతో మాట్లాడతాను' అన్నాడు సైకియాట్రిస్ట్.

•••

'మీ అమ్మాయి అంటే మీకు ఎక్కువ ఇష్టమా... మీ కులం అంటే మీకు ఎక్కువ ఇష్టమా?' అడిగాడు సైకియాట్రిస్ట్ ప్రవల్లిక తల్లిదండ్రులను.

వాళ్లిద్దరూ ముఖం ముఖం చూసుకున్నారు.

'మా అమ్మాయే ఇష్టం' అన్నారు.

'కాని మీ అమ్మాయికి మీకు మీ కులమే ఇష్టం అనే భావన ఉంది. చూడండి... ప్రతి కులానికి మన సొసైటీలో ఒక స్థానం ఉంది. సంస్కృతి ఉంది. ఎవరి కులాలను వారు గౌరవించుకుంటారు. కాని మన కులాన్ని, కుటుంబ సంప్రదాయాన్ని గౌరవించే ఎదుటి కులాలు కూడా ఉంటాయి. ఎదుటి కులాల మనుషులు మనతో, మనం ఎదుటి కులాల మనుషులతో పరస్పర అంగీకారంతో సంబంధాలు కలుపుకోకపోతే సమాజం నడుస్తుందా? మీ అమ్మాయి వేరే కులం అబ్బాయిని ప్రేమించింది. కాని మీరేమనుకుంటారోనని లోలోపల కుమిలిపోతోంది. చాలామంది అమ్మాయిలు తల్లిదండ్రులు ఎవరిని తెస్తే వారిని చేసుకోవచ్చు. కాని కొందరు అంత సులువుగా స్పందించరు. మీ అమ్మాయి అలాంటి అమ్మాయి. ఎంతో నచ్చితే తప్ప పెళ్లి దాకా రాదు. ఆ అబ్బాయి యోగ్యుడు. 29 ఏళ్ల అమ్మాయి అతనితో వెళ్లి పెళ్లి చేసుకోవచ్చు. కాని మిమ్మల్ని చాలా ప్రేమిస్తూ ఉండటం వల్లే మీ అంగీకారంతో చేసుకోవాలనుకుంటోంది' అని ఆగాడు సైకియాట్రిస్ట్.

ప్రవల్లిక తల్లిదండ్రులకు తమ తప్పు అర్థమైంది.

'సార్... ఏదో అందరిలాగా ఆలోచించాము గాని అమ్మాయి జీవితమే నాశనమవుతుందంటే కులాన్ని పట్టుకు ఊగులాడతామా? మా అమ్మాయి కోరిన అబ్బాయికే ఇచ్చి చేస్తాము సార్' అన్నారు.

ఆ తర్వాత ప్రవల్లిక పెళ్లయిపోయింది.

వారిది పెద్దలు కూడా ఆనందించే ప్రేమ వివాహం అయ్యింది.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణచక్రవర్తి, సైకియాట్రిస్ట్

వజ్రాల బండి

అంతా మహిళలేనండి

లోకో పైలట్ మున్నీ టిగ్గా, అసిస్టెంట్ లోకో పైలట్ రాజేశ్వరి బిస్వాల్

ఈ నెల 6న శుక్రవారం ఒడిశాలోని ఖుర్దారోడ్ స్టేషన్ నుంచి ఉదయం 10.30 గంటలకు బయల్దేరిన గూడ్సు రైలు బండి అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని పలాస స్టేషన్ చేరుకుంది. మర్నాడు మళ్లీ ఉదయం 5.45 గంటలకు పలాసలో బయల్దేరి అదే రోజు సాయంత్రం 7 గంటలకు ఖుర్దా రోడ్డు స్టేషన్‌కు చేరుకుంది. ఈస్టుకోస్టు రైల్వే వారి గూడ్సు రైలు బండి అది.

ఏమున్నాయ్ అంతగా ఆ రైలు బండిలో! వజ్రాలా.. ఇంత ఉపోద్ఘాతం ఇస్తున్నారు! వజ్రాలకన్నా విలువైనవే ఉన్నాయి. అయితే రైల్లో లేవు. రైలు నడుపుతున్న వాళ్లలో ఉన్నాయి. వాళ్లలో ఉన్నది వజ్ర సంకల్పం! 20 గంటల పాటు 400 కి.మీ.ల దూరం ఆ గూడ్సును నడిపినవారు ముగ్గురూ మహిళలే. గతంలో మహిళలు గూడ్సు బళ్లు నడపలేదని కాదు. పక్కన పురుషులు కూడా ఉండేవారు. మహిళలే తమకు తాముగా, పురుషులు పక్కన లేకుండా గూడ్సు బండిని నడపడం ఇదే మొదటిసారి. లోకో పైలెట్ మున్నీ టిగ్గా, అసిస్టెంట్ లోకో పైలట్ రాజేశ్వరీ బిస్వాల్, గార్డు రేవతి సింగ్.. మూసివేసిన కంటెయినర్‌ల లోడ్‌తో ఉన్న ఈ బండిని నడిపారు. వివిధ స్టేషన్‌లలో స్టేషన్ మాస్టర్‌లు ఇచ్చే సిగ్నల్స్‌కి అనుగుణంగా వేగాన్ని నియంత్రించుకుంటూ విజయవంతంగా ప్రయాణం సాగించారు. ''క్యారేజ్ బండ్లను నడపడం ఎవరికైనా కాస్త కష్టమైన పనే. అయితే మగాళ్లకు దీటుగా మేము మా శక్తిని నిరూపించుకున్నాం'' అన్నారు టిగ్గా (35). ఆమెది ఒడిశాలోని సుందర్‌ఘర్ జిల్లా. ఐటిఐలో మెకానికల్ గ్రేడ్‌ని పూర్తి చేశాక 2011లో అసిస్టెంట్ లోకో పైలట్‌గా చేరి, 2016లో లోకో పైలట్ అయ్యారు.

అసిస్టెంట్ లోకో పైలట్ రాజేశ్వరి (26) కూడా తాము సాధించిన ఈ విజయానికి ఎంతో సంతోషంగా ఉన్నారు. ''మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నడిపిన తొలి మహిళా రైలులో పైలట్‌కు సహాయకురాలిగా ఉన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది'' అని ఆమె సంబరపడుతున్నారు. సాటి మహిళలకు స్ఫూర్తినిచ్చే సవాళ్లను నేనెంతో ఆనందగా స్వీకరిస్తాను''అని కూడా అంటున్న రాజేశ్వరిది ఒడిశాలోని జంగత్సింగ్‌పూర్ జిల్లా.

ఖుర్దారోడ్ రైల్వే డివిజన్‌లో 20 మంది మహిళా లోకో పైలట్‌లు, 19 మంది అసిస్టెంట్ లోకో పైలట్లు (స్త్రీ, పురుషులు కలిపి) ఉన్నారు. ''మహిళలు తాము చేపట్టిన పని ఎంత కష్టమైనదైనా తేలిగ్గా చేసేస్తారు'' అని డివిజనల్ మేనేజర్ శశికాంత్ సింగ్ అంటున్నారు.

ఇంటిప్స్

చేతులు గరుకు బారుతుంటే..?

ఇంటిపనితో వేళ్ల చివర్లు పొడి బారుతున్నాయా? అరచేతులు గరుకు బారుతున్నాయా? అయితే ఇది ఒకరకమైన ఎగ్జిమా లక్షణం. వృత్తిపరంగా వచ్చే అనారోగ్యం. రైటర్స్ క్రాంప్, టెన్నిస్ ఎల్బో వంటిదే ఈ ఎగ్జిమా. దీనిని హౌస్ వైఫ్స్ ఎగ్జిమా అంటారు. నిజానికి ఈ సమస్య గృహిణులకు మాత్రమే పరిమితం కాదు. ఆహార పరిశ్రమలో పనిచేసే వాళ్లకు, హెయిర్‌డ్రస్సర్‌లకు, నర్సులకు కూడా ఎక్కువగా వస్తుంటుంది.

పాత్రలను శుభ్రం చేయడానికి ఉపయోగించే సబ్బులు, క్లీనింగ్ పౌడర్‌లు, దుస్తులు ఉతకడానికి వాడే వాషింగ్‌పౌడర్, డిటర్జెంట్ సబ్బులలో ఉండే రసాయనాల గాఢత.. ఇవన్నీ చర్మానికి హాని కలిగిస్తాయి. కాబట్టి గాఢత తక్కువగా ఉన్న వాటిని లేదా సహజసిద్ధమైన క్లీనింగ్ పౌడర్లను వాడడం లేదా పని పూర్తయిన వెంటనే చేతులను శుభ్రంగా తుడుచుకుని కొబ్బరినూనె రాసుకోవడం దీనికి మంచి పరిష్కారం. ఈ పనులు చేసేటప్పుడు గ్లవుజ్‌లు ధరించడం కూడా మంచి ఫలితాన్నిస్తుంది. అలాగే నర్సులకు ఎక్కువ సమయం రబ్బర్ గ్లవుజ్‌లు వాడడం వల్లనే సమస్య వస్తుంటుంది. అలాంటప్పుడు కాటన్ లైనింగ్‌తో తయారైన గ్లవుజ్‌లను వాడితే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

బిహార్

సిఎం అభ్యర్థి

పుష్పం ప్రియా చౌదరి

బిహార్ రాజకీయాల్లోకి ఒక కొత్త అమ్మాయి వచ్చింది. ఒక కొత్త పార్టీతో వచ్చింది. తనే సీఎం అభ్యర్థిని అని కూడా ప్రకటించుకుంది. ఆమె పేరు పుష్పం ప్రియా చౌదరి. ఆమె పెట్టిన పార్టీ పేరు 'ప్లూరల్స్'. ఈ ఏడాది అక్టోబర్‌లో జరగబోతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు (ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ), ఆర్‌జేడీ (ప్రతిపక్షంలో ప్రధాన పార్టీ) లను ఢీకొని మరీ.. ముఖ్యమంత్రిని కాగలననే ఆమె నమ్ముతోంది. జెడి(యు) నాయకుడు వినోద్ చౌదరి కూతురు ప్రియ. ఆ పార్టీలో ఆమె పైకి ఎదిగే అవకాశాలు ఉన్నా.. సొంతంగా ఎదగాలని బయటికి వస్తోంది. 'లవ్ బిహార్, హేట్ పాలిటిక్స్'.. ఇదీ ఆమె ట్విట్టర్ హ్యాండిల్‌లోని నినాదం. తన వెబ్‌సైట్‌లో బిహార్ ప్రజలకు ఒక బహిరంగ లేఖ కూడా రాసింది. ప్రపంచం ముందుకు వెళుతుంటే.. మనమెందుకు ఇక్కడే ఉండిపోయాం! కారణం మన రాజకీయ నాయకుల విధానాలు'' అని ఆ లేఖ సారాంశం. ఈ మార్చి 8న మహిళా దినోత్సవం రోజు రాజకీయాల్లోకి వచ్చారు ప్రియ. బిహార్‌లోని దర్భంగా లో ఆమె జన్మస్థలం. చిన్న చదువులన్నీ అక్కడే. పెద్ద చదువుల కోసం లండన్ వెళ్లారు. డెవలప్‌మెంట్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. తర్వాత... పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఇంకో మాస్టర్స్ డిగ్రీ. ప్రియ తండ్రి మాజీ ఎమ్మెల్సీ. ''అమ్మాయికి చెప్పి చూడవయ్యా.. ఎందుకీ రాజకీయాలు'' అని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారని అప్పుడే వార్తలు బయటికి వచ్చేశాయి. ప్రియ ఆగేలా లేదు. రాజకీయాల్ని ప్రక్షాళన చేయకుండా వదిలేలానూ లేదు.

బ్రేవ్ గర్ల్

ఇంకో అవార్డు ఇవ్వాల్సిందే

జెన్ సదావర్తె

ఈ ఏడాది జనవరి 26న ప్రధాని నరేంద్ర మోదీ నుంచి 'నేషనల్ బ్రేవరీ అవార్డ్' అందుకుంది జెన్ సదావర్తి. 2018 ఆగస్టులో ముంబైలోని ఒక అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ముందే హెచ్చరించడం ద్వారా పదిమంది ప్రాణాలను కాపాడగలిగింది సదావర్తి. అందుకు వచ్చిన అవార్డే అది. పన్నెండేళ్ల ఈ చిన్నారి ముంబైలోని ఒక స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. షేక్స్పియర్ పుస్తకాల సెట్ మొత్తాన్ని ఇప్పటికే చదివేసింది! ఈ చదవడం తనకు సంబంధించినది. సమాజం కోసం కూడా చాలా చేస్తోంది. ఈమధ్యే.. నిరసన ప్రదర్శనల్లోకి పిల్లల్ని వెంటపెట్టుకుని వెళ్లకూడదనే ఆదేశాలను జారీ చేయాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. స్కూళ్లలో పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరింది. పెద్దయ్యాక లాయర్ అవ్వాలని లక్ష్యం. ఇంగ్లిష్, హిందీ చక్కగా మాట్లాడుతుంది. ఈ రెండు భాషలు చాలు.. సమాజం కోసం ఫైట్ చెయ్యడానికి. అయితే అవి అసలు భాషలే కాదని శివసేన కార్యకర్తలు ఆ అమ్మాయిని మహిళా దినోత్సవ ప్రసంగం నుంచి పక్కకు నెట్టేశారు. ''హిందీలో, ఇంగ్లిష్‌లో కాదు.. అచ్చమైన మరాఠీలో మాట్లాడు'' అన్నారు. అక్కడితో ఆగిపోలేదు. ''నువ్వీ రాష్ట్రంలో ఉండాలంటే మరాఠీ నేర్చుకోవలసిందే'' అని బెదిరించారు. బ్రేవరీ అవార్డు తీసుకున్న అమ్మాయి ఆ బెదిరింపులకు భయపడుతుందా! ప్రసంగాన్ని పూర్తి చేసి గానీ వేదిక దిగలేదు.

సలహాలు

కొత్త చిక్కు

దియా మీర్జా

చక్కటి అమ్మాయి. దాంపత్యం చిక్కుల్లో పడింది. భర్తతో వచ్చిన చిక్కుల్ని విడాకులతో తొలగించుకుని బయటికి వచ్చేసింది. అలా వచ్చేశాక, ఆమె ఎవరికైనా సలహాలు ఇవ్వగలుగుతుందా? 'విడిపోయాక ధైర్యంగా ఉండగలుగుతున్నావా.. ధైర్యంగా ఉండాలంటే ఏం చేయాలి?' అని ఎవరైనా తనను అడుగుతుంటే!! దియా మీర్జాకు ఇప్పుడు ఇలాంటి సమస్యే ఎదురవుతోంది. ఏవో మనస్పర్థలతో ఈ మధ్యే భర్త నుంచి విడిపోయి, వేరుగా ఉంటున్నారు దియా మీర్జా. దియా హైద్రాబాద్ అమ్మాయి. తన బిజినెస్ పార్టనర్‌నే లైఫ్ పార్ట్‌నర్‌గా చేసుకుంది. ఆరేళ్ల తర్వాత, గత ఏడాది సెప్టెంబర్‌లో ఇద్దరూ విడిపోయారు. తనే భర్తను వద్దనుకుందని అంటారు. ఆయన పేరు సహీల్ సింఘా. 'ఒక బంధం నుంచి బయటికి వచ్చాక స్ట్రాంగ్‌గా ఉండగలమా?' అని అడుగుతున్నారట దియా ఫ్రెండ్స్. వాళ్లు కూడా విడాకులు తీసుకున్నవారే. వాళ్ల ప్రశ్నలకు దియా దగ్గర సమాధానం లేదు. ''ఎవరి జీవితమూ ఎవరికీ అనుభవంగా పనికిరాదు. పరిష్కారమూ చూపదు'' అని మాత్రం అంటున్నారు. ఆ మాట కూడా.. నవ్వుతూనే.



రాజమండ్రికి జగదీష్

నాని

పొల్లాచ్చి నుంచి రాజమండ్రికి మకాం మార్చారు హీరో నాని. 'నిన్ను కోరి' వంటి హిట్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'టక్ జగదీష్'. ఇందులో రీతూ వర్మ, ఐశ్వర్యారాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రాజమండ్రి పరసర ప్రాంతాల్లో జరుగుతోంది. ''పొల్లాచ్చిలో జరిగిన తొలి షెడ్యూల్‌లో నాని, రీతూ వర్మలతో పాటు కీలక తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో రెండో షెడ్యూల్‌ను స్టార్ట్ చేశాం. ఒక పాట, ఓ యాక్షన్ ఎపిసోడ్‌తో పాటుగా ప్రధాన తారాగణం అంతా పాల్గొనే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం'' అని చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం.

రామ్‌చరణ్, ఎన్టీఆర్

రామ్ రావణ్ రాజ్?

'బాహుబలి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాజమౌళి దర్శకత్వంలో ''ఆర్ఆర్ఆర్' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటిస్తున్నారు. ఒలివియా మోరిస్, ఆలియా భట్ కథానాయిక పాత్రలు పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 8న పది భాషల్లో విడుదల కానుంది. విడుదల తేదీ వచ్చినప్పటికీ షూటింగ్ 80శాతం పూర్తయినప్పటికీ 'ఆర్ఆర్ఆర్' టైటిల్‌పై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో 'రామరావణరాజ్యం, రఘుపతి రాఘవ రాజారామ్' అనే టైటిల్స్‌లో ఏదో ఒకటి పెట్టాలనుకుంటున్నారనే వార్త ప్రచారం లోకొచ్చింది. అయితే 'ఆర్ఆర్ఆర్'కు సరిపోయే టైటిల్‌ను ప్రేక్షకులే చెప్పాలని చిత్రబృందం ఆహ్వానించింది. సోషల్ మీడియాలో బాగానే స్పందన వచ్చింది. అయితే టైటిల్ గురించి చిత్రబృందం ఇప్పటివరకు ఏ ప్రకటనా చేయలేదు. తాజాగా ఈ సినిమాకు హిందీలో 'రామ్ రావణ్ రాజ్' అనే టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. మరి.. త్రిబుల్ ఆర్ అంటే అదేనా? వేచి చూడాల్సిందే. అజయ్ దేవగన్, సముద్రఖని, రే స్టీవెన్‌సన్, అలిసన్ డూడీ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

నయనతార

నాయకాకి నాయికగా!

సంవత్సరానికి దాదాపు అరడజను సినిమాలు తగ్గకుండా చేస్తున్నారు నయనతార. ఈ ఏడాది ఇప్పటికే తమిళంలో నాలుగు సినిమాల్లో నటిస్తున్నారామె. ఇప్పుడు శాండిల్‌వుడ్ నుంచి ఓ కబురు వచ్చిందట. కన్నడంలో చాలెంజింగ్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న దర్శన్ నటించనున్న 'గండుగాలి మడకరి నాయకా' సినిమాలో నయనను కథానాయికగా అడుగుతున్నారుని సమాచారం. ఇది చారిత్రాత్మక సినిమా. భారీ బడ్జెట్‌తో రాజేంద్రసింగ్ బాబు దర్శకత్వంలో రాక్‌లైన్ వెంకటేశ్ నిర్మించనున్నారు. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తే బాగుంటుందని అనుకుని, ఈ బ్యూటీని సంప్రదించారట కూడా. ఇక అగ్రిమెంట్‌లో ఆమె సైన్ పెట్టడమే ఆలస్యం అని భోగట్టా. ఒకవేళ నయన ఈ సినిమా ఒప్పుకుంటే పదేళ్ల తర్వాత మళ్లీ ఆమె కన్నడ సినిమాలో నటించినట్లవుతుంది. 2010లో ఉపేంద్ర సరసన నయనతార కన్నడంలో 'సూపర్' అనే సినిమాలో నటించారు.

విద్యా వ్యవస్థపై పోరాటం

కల్యాణి, శివకార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా 'అభిమన్యుడు' ఫేమ్ పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హీరో'. కల్యాణీ ప్రియదర్శన్ కథానాయికగా నటించగా, యాక్షన్ కింగ్ అర్జున్ కీలక పాత్ర పోషించారు. తమిళంలో మంచి విజయాన్ని సాధించిన ఈ చిత్రం 'శక్తి' పేరుతో తెలుగులోకి అనువాదం అవుతోంది. కే.జి.ఆర్ స్టూడియోస్, గంగా ఎంటర్‌టైన్మెంట్స్ ఆధ్వర్యంలో కోటపాడి. జె.రాజేష్ ఈ చిత్రాన్ని ఈ నెల 20న విడుదల చేస్తున్నారు. పి.ఎస్. మిత్రన్ మాట్లాడుతూ– ''సూపర్ మాన్, స్పైడర్ మాన్, శక్తి మాన్.. అంటే పిల్లలకే కాదు అన్ని వయసుల వారిలో ఓ స్పెషల్ క్రేజ్ ఉంటుంది. వాళ్ల స్ఫూర్తితో సాహసాలు చేస్తుంటారు కొంతమంది. ఈ చిత్రంలో హీరో కూడా అలాంటివాడే. సూపర్ హీరోలా మారి విద్యా వ్యవస్థలోని విషయాలపై ఎలా పోరాడాడు? అన్నదే కథాశం. వాస్తవ ఘటనల ఆధారంగానే తెరకెక్కించాం'' అన్నారు. ''ఏదైనా విభిన్న నేపథ్యం లేకపోతే శివ కార్తికేయన్ సినిమా చేయరు. 'శక్తి' చాలా రియలిస్టిక్‌గా అనిపిస్తూ హార్ట్‌ని టచ్ చేస్తుంది. బాలీవుడ్ నటుడు అభయ్ డియోల్ నటించిన తొలి దక్షిణాది చిత్రం ఇదే'' అన్నారు కోటపాడి. జె. రాజేష్.

బ్యాక్ టు హైదరాబాద్

బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వరుణ్ తేజ్ ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో బాక్సర్ పాత్రలో కనిపిస్తారాయన. 20 రోజుల పాటు వైజాగ్‌లో షూటింగ్ చేశారు. మంగళవారంతో వైజాగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసి హైదరాబాద్ తిరిగొచ్చారు వరుణ్. కిరణ్ కొర్రపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సిద్ధు ముద్దా, అల్లు వెంకటేశ్ నిర్మిస్తున్నారు. సాయి మంజ్రేకర్ కథానాయిక. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని జూలై 30న విడుదల చేయనున్నారు.

వరుణ్ తేజ్

కన్నడంలోకి ఖైదీ


శివరాజ్‌కుమార్

తెలుగు–తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన చిత్రం 'ఖైదీ'. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించారు. ఈ సినిమా హిందీలో రీమేక్ కాబోతున్నట్టు ఇటీవలే ప్రకటించారు. హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ నటించనున్నారు. తాజాగా 'ఖైదీ' కన్నడంలో రీమేక్ కాబోతున్నట్టు తెలిసింది. కార్తీ చేసిన ఖైదీ పాత్రలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్ నటిస్తారట. నంద కిశోర్ దర్శకుడు.

చాలామంది గెటౌట్ అన్నారు

కార్తీక్ ఆనంద్

''కాలేజీ నేపథ్యంలో హ్యాపీ డేస్ నుంచి 'ప్రేమమ్' వరకు చాలా సినిమాలొచ్చాయి. కాలేజ్‌లో జరిగే ఓ ఫెస్ట్ (ఫెస్టివల్) ఆధారంగా వస్తున్న సినిమా మా 'యురేక'' అన్నారు కార్తీక్ ఆనంద్. సయ్యద్ సోహైల్ రియాన్, కార్తీక్ ఆనంద్, డింపుల్ హయతి, షాలిని, సమీక్ష ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం 'యురేక'. కార్తీక్ ఆనంద్ దర్శకత్వంలో ప్రశాంత్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. లలిత కుమారి సహనిర్మాత. కార్తీక్ ఆనంద్ మాట్లాడుతూ – ''నాకు చిన్నప్పటి నుంచే సినిమాలు, కథలు రాయడం ఆసక్తి. 'యురేక'లో నటించి, దర్శకత్వం వహించాను. ఓ కాలేజ్ ఫెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మర్డర్ మిస్టరీయే ఈ చిత్రం. సినిమాకు సెకండాఫ్ హార్ట్ లాంటింది. ఫస్టాఫ్ సరదాగా సాగుతుంది. సమకాలీన అంశాలకు సందేశాన్ని జోడించాం. సినిమా చాన్స్ కోసం స్క్రిప్ట్స్ పట్టుకుని చాలామంది ప్రొడ్యూసర్స్‌ని కలిశాను. నేనే యాక్ట్ చేసి, డైరెక్ట్ చేస్తానని చెప్పగానే చాలామంది గెటౌట్ అన్నారు. ప్రశాంత్‌గారు నన్ను నమ్మి 'యురేక'కి అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తూ సెలవుల్లో 'యురేక' సినిమా తీశాను. ఈ సినిమా ఫలితాన్ని బట్టి నా కెరీర్‌ను నిర్ణయించుకుంటాను'' అన్నారు.

కరోనాపై చిత్రం

ప్రస్తుతం అందర్నీ టెన్షన్‌లో పడేస్తోన్న వైరస్ కరోనా. అయితే కరోనాలో ఓ కథాంశంను చూశారు కన్నడ దర్శకుడు ఉమేశ్ భనకర్. కరోనా వైరస్‌పై సినిమా చేస్తున్నట్టు ప్రకటించారాయన. ఈ సినిమాకు 'డెడ్లీ కరోనా' (భయంకరమైన కరోనా) అనే టైటిల్‌ను కూడా రిజిస్టర్ చేయించారు. దీన్ని ప్యాన్ ఇండియా సినిమాగా తీయాలని భావిస్తున్నారట ఉమేశ్. ''కరోనా వైరస్ ఎక్కడ నుంచి వచ్చింది? దాని ప్రభావం ప్రపంచం మీద ఎలా ఉంది? వంటి అంశాలను మా సినిమాలో చూపించనున్నాం'' అన్నారు ఉమేశ్.

అమలా పాల్

ట్యూన్ అయ్యారా?

2017లో దర్శకుడు ఏఎల్ విజయ్‌తో విడాకులు తీసుకున్నారు అమలాపాల్. ఇప్పుడు తన జీవితంలోకి ప్రేమను మళ్లీ ఆహ్వానించారట. తన ఆలోచనలకు దగ్గరగా ఉండే వ్యక్తితో ట్యూన్ అయ్యారని టాక్. ముంబైకు చెందిన సింగర్ భవీందర్ సింగ్, అమలా పాల్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని సమాచారం. కొంతకాలంగా వీరు సహజీవనం చేస్తున్నారని బాలీవుడ్ టాక్. భవీందర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అమలాపాల్‌తో దిగిన ఫొటోలు ఈ వార్తలకు బలాన్ని చేకూర్చాయి. ఇటీవల అమలా పాల్ కూడా రిలేషన్‌లో ఉన్నాను అని తెలిపారు. కానీ ఆ వ్యక్తి వివరాలను మాత్రం తెలుపలేదు. మరి సింగర్ భవీందర్‌తో అమలా పాల్‌కి ట్యూన్ కుదిరిందా? పెళ్లి మంత్రాలు ఎప్పుడు పాడబోతున్నారు? తెలియాల్సి ఉంది.

మంచి కథతో వస్తున్నాం

- ప్రదీప్

యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా, అమృతా అయ్యర్ హీరోయిన్‌గా మున్నా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?'. యస్.వి. బాబు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మున్నా మాట్లాడుతూ– ''నేను ఎంసీఏ చదివే రోజుల్లో సుకుమార్‌గారి వద్ద పనిచేయాలనుకున్నా. ఆ తర్వాత ఆయన అసిస్టెంట్‌గా పని చేశాను. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' కథని అల్లు అర్జున్‌గారికి, 'బన్నీ' వాసుకి చెప్పాను. వారు కొన్ని సలహాలిచ్చారు. 'బన్నీ' వాసు మా సినిమాని జీఎ2 పతాకంపై విడుదల చేస్తున్నందుకు థ్యాంక్స్'' అన్నారు. ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ– ''హీరోలు మహేశ్‌బాబు, రానా, హీరోయిన్లు కాజల్ అగర్వాల్, తమన్నా మా సినిమాని సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. అనూప్ మంచి సంగీతం ఇచ్చారు. మున్నా మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. మంచి మనుషులు కలిసి చేసిన ఈ చిత్రం తప్పకుండా హిట్ అవుతుంది'' అన్నారు. ''నీలి నీలి ఆకాశం..' పాటకు మంచి స్పందన వచ్చింది. అనూప్ చక్కని సంగీతం ఇచ్చారు. చంద్రబోస్ మంచి సాహిత్యాన్ని అందించారు'' అన్నారు యస్.వి.బాబు. ''ఇది నా తొలి చిత్రం. మంచి పాత్ర ఇచ్చినందుకు మున్నాకి థాంక్స్'' అన్నారు అమృతా అయ్యర్. సహ నిర్మాత వినయ్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, కెమెరామెన్ శివ, ఆర్ట్ డైరెక్టర్ నరేష్ మాట్లాడారు.

అనూప్, యస్.వి. బాబు, మున్నా, ప్రదీప్, అమృతా అయ్యర్

నిజమైన ప్రేమంటే?

కపిలాక్షి, జీపీయస్

''ఎలా ప్రేమించాలి? ఎలా ప్రేమించకూడదు? నిజమైన ప్రేమంటే ఎలా ఉంటుంది? అని మా మా సినిమాలో చూపించాం'' అన్నారు మురళీ రామస్వామి. జీపీయస్ హీరోగా, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షీ వర్మ హీరోయిన్లుగా మురళీ రామస్వామి (యం.ఆర్) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమ పిపాసి'. రాహుల్ భాయ్ మీడియా, దుర్గశ్రీ ఫిలిమ్స్‌పై పి.ఎస్ రామకృష్ణ(ఆర్.కె) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో మురళీ రామస్వామి మాట్లాడుతూ– ''జీపీఎస్ నాకు మంచి మిత్రుడు. ఈ సినిమాను తన నటనతో నిలబెట్టాడు. మా నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు'' అన్నారు. ''ఈ చిత్రకథ నచ్చడంతో ముగ్గురు మిత్రులతో కలిసి నిర్మించాను. మా చిత్రాన్ని 'అర్జున్ రెడ్డి, ఆర్ఎక్స్ 100' సినిమాలతో పోలుస్తున్నారు. అలాంటి సక్సెస్‌ఫుల్ సినిమాలతో పోల్చడం మంచిదే కానీ, మా సినిమా కొత్త ట్రెండ్‌ని సృష్టిస్తుంది. ఇకపై వచ్చే సినిమాలను 'ప్రేమ పిపాసి'లా ఉందంటారు'' అన్నారు పిఎస్ రామకృష్ణ. ''మా చిత్రం గురించి మేం మాట్లాడటం కాదు. ఈ నెల 13న మా సినిమానే మాట్లాడుతుంది'' అన్నారు జీపీఎస్. ''పాటలు, పతాక సన్నివేశాలు, సినిమాటోగ్రఫీ ఈ సినిమాకు హైలైట్స్'' అన్నారు మరో నిర్మాత రాహుల్ భాయ్. సినిమాటోగ్రాఫర్ తిరుమల రోడ్రిగ్జ్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షీ వర్మ, పాటల రచయితలు సురేష్ గంగుల, అలా రాజు తదితరులు మాట్లాడారు.

ఈ 27 నుంచి కొత్త సినిమాలు రావా?

మార్చి 27 నుంచి తమిళనాడులో కొత్త సినిమాలను పంపిణీ చేయబోమని తమిళనాడు డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ పేర్కొంది. సినిమా పంపిణీపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం 10 శాతం టీడీయస్ పన్నుని విధించింది. ఈ నిర్ణయాన్ని తమిళ డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ''ఆల్రెడీ సినిమా టికెట్ మీద 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తోంది ప్రభుత్వం. దానికి తోడు ఇటీవలే 8 శాతం లోకల్ బాడీ ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్ కట్టాలని ఆదేశించింది. దీంతో సినిమా చూసేవాళ్ల సంఖ్య క్రమేణా తగ్గిపోతుంది'' అని పంపిణీదారుల సంఘం పేర్కొంది. 8 శాతం పన్ను విధింపును మరోసారి ఆలోచించి, నిషేధించాలంటూ ఇటీవలే ప్రభుత్వాన్ని కోరింది. తాజాగా ఈ 10 శాతం పన్ను జోడించడంతో మార్చి 27 నుంచి కొత్త సినిమాలు పంపిణీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చింది. గవర్నమెంట్ ఈ పన్నుని తొలగించే వరకూ ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపింది.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
12-3-2020

కరోనా గురించి ఇప్పటికే చాలా కథనాలొచ్చాయి. కాబట్టి... ఇప్పుడు దాని గురించి తాజాగా కొన్ని 'అ...ఆ'లు తెలుసుకుందాం. మొదట చెప్పుకునే అ... ఆలు 'అవగాహనా... ఆందోళన' ల గురించి. ఆ తర్వాతి అ... ఆలు అదెలా వస్తుందో 'అర్థం చేసుకోవడం'... రాకుండా చూసుకోడానికి చేయాల్సినవి 'ఆచరించడం'. వ్యాధినిరోధకత పెంచుకుంటే కరోనా దరిచేరదు. కాబట్టి మూడోసారి అ... ఆలు... ఇమ్యూనిటీనిచ్చే 'అలవాట్లూ... ఆహారం'.



కరోనా వైరస్ భయాలు ఇప్పుడు దేశమంతటా విస్తరించి ఉన్నాయి. మన దేశంలోకి వైరస్ ప్రవేశించినా, అదృష్టవశాత్తు దాని వ్యాపించే వేగం, విస్తృతి మాత్రం చైనా లేదా ఇరాన్, ఇటలీ, దక్షిణ కొరియాలోల్లా ఉన్నంతగా తీవ్రంగా మన దగ్గర లేదు. మన దేశంలో ఇప్పటికి కేవలం దాదాపు 40 కేసుల్లో వైరస్ ఉన్నట్లు తేలాయి. కానీ ఒక్కటంటే ఒక్క మరణం కూడా నమోదు కాలేదు. ఈ అంశాలన్నీ మనకు భరోసాను ఇచ్చేవే. మనలో ధైర్యాన్ని నింపేవే. గతంలో కొన్ని వైరస్‌ల విషయంలో చోటు చేసుకున్న మరికొన్ని అంశాలు కూడా మన దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి అంతగా ఉండదనే మనోధైర్యాన్ని ఇస్తున్నాయి. ఉదాహరణకు గతంలో 'జికా' వైరస్ ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో విస్తరించినా మన దగ్గరికి రాలేదు. అలాగే ఎబోలా కూడా. ఇక ప్రపంచంతో పాటు, చాలా తూర్పు ఆసియా దేశాలను గడగడలాడించిన 'నిపా' కూడా కేవలం కేరళకే పరిమితమైంది. అక్కడి ప్రభుత్వాలు, ప్రజల అప్రమత్తత, వ్యాధిని అరికట్టేందుకు తీసుకున్న చర్యలతో దాన్ని విస్తరించకుండ విజయవంతంగా అరికట్టగలిగారు. కేరళను దాటి అది ఏ ప్రాంతానికీ విస్తరించలేదు.

కరోనా అ ఆలు

అవగాహనా? ఆందోళనా?

'కరోనా' ఆర్ నాట్ విలువ చాలా వేగం కాబట్టి...

ఒక వైరస్‌గానీ లేదా ఒక బ్యాక్టీరియల్ లేదా ఇతర ఇన్ఫెక్షన్లు గానీ... ఒకరి నుంచి మరొకరికి ఎంత త్వరితంగా విస్తరించగలవో తెలిపే వేగానికి ఉన్న కొలతను ఆర్ నాట్ (R naught - Ro) అనే కొలత (యూనిట్) ద్వారా చెబుతారు. చాలా వైరస్‌లూ, బ్యాక్టీరియల్, ఫంగల్, ప్రోటోజోవన్ పరాన్నజీవుల కారణంగా వచ్చే ఇన్ఫెక్షన్ల వేగాన్ని అంచనా వేయగలిగినప్పటికీ... ఇప్పటివరకూ కరోనా వైరస్ వేగాన్ని కొలవలేకపోయారు. కొలవడం అటుంచి... కనీసం ఉజ్జాయింపుగా కూడా చెప్పడం సాధ్యం కాలేదు. చైనాలో అంత వేగంగా అది విస్తరించింది. కానీ... భారత్‌లోకి ప్రవేశించి ఇంతకాలమైనా కేవలం దాదాపు 40 మంది వరకే మాత్రమే పరిమితమైందంటే... దాని ఆర్ నాట్ వేగం ఇక్కడి పరిస్థితుల కారణంగా మందగించిదా అనే విషయంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు ఏమైనప్పటికీ కొన్ని రోజుల వ్యవధిలోనే చైనాలో దాదాపు లక్షమందికి సోకిన అదే వ్యాధి ఇక్కడ మాత్రం స్థబ్దంగా, మందకొడిగా ఉండిపోవడం మన దేశవాసుల అదృష్టం. పైగా అక్కడిలా అంతేవేగంగా మన దగ్గర చర్యలు తీసుకునేంత పటిష్టమైన యంత్రాంగం లేకపోవడం, మన దేశవాసుల్లోని పట్టణ ప్రాంతాల జనాభాను మినహాయిస్తే... దాని విస్తృతి మాత్రం అందరం భయపడుతున్నంతగా లేకపోవడం చాలా సానుకూలమైన అంశం.

విస్తృతంగా కొనసాగుతున్న పరిశోధనలూ... పరిమితులు

సాధారణంగా ఫ్లూ వంటి జ్వరాలను వ్యాప్తి చేసే కరోనా గ్రూపునకు చెందిన వైరస్‌లకు మందులు కనిపెట్టడం ఒకింత కష్టం. ఉదాహరణకు ఇప్పుడు కోవిడ్-19 అని పేరు పెట్టిన 'కరోనా గ్రూపు'నకు చెందిన ఈ వైరస్‌కు వ్యాక్సిన్ కనిపెట్టేలోపు... అది తన జన్యుస్వరూపాన్ని మార్చుకుని మరో జలుబు రూపంలో రావచ్చు. అదే జరిగితే ఇప్పటికే కనిపెట్టిన వ్యాక్సిన్ మళ్లీ దానికి పనిచేయదు. అందుకే ఇప్పటివరకూ కరోనా లేదా ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనేక గ్రూపు వైరస్‌లు తెచ్చే జలుబులకు వ్యాక్సిన్లు, మందులు కనిపెట్టలేకపోయాం. అయితే ఇటీవలి చైనా, ఇరాన్, ఇటలీ, దక్షిణకొరియా, అమెరికా దేశాల అనుభవంతో ఇప్పుడు ఈ వైరస్‌కు మందులు కనిపెట్టే ప్రయత్నాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ దిశగా మొదలైన ప్రయత్నంలో భాగంగా ఇటీవలి గ్లోపిడ్-ఆర్ (ద గ్లోబల్ రీసెర్చ్ కొలాబరేషన్ ఫర్ ఇన్ఫెక్షియస్ డిసీజ్ ప్రిపేర్‌డ్‌నెస్) అనే సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 300 మంది శాస్త్ర పరిశోధకులు, సైంటిస్టులతో సమావేశాలు జరిగాయి. వైరస్ గురించి అనేక శాస్త్రీయ అంశాలపై అధ్యయనాలు, పరిశోధనలు జరాల్సిన ఆవశ్యకతను గుర్తించి, ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆందోళన అక్కర్లేదు... కొన్ని కొన్ని ప్రాంతాల్లోని వ్యక్తుల జన్యుపరమైన అంశాల కారణంగా... కొన్ని జబ్బులు అక్కడ వచ్చేందుకు పెద్దగా అవకాశం ఉండదు. ఉదాహరణకు కొండప్రాంతాల్లో ఉండే వారికి మిగతా వారితో పోలిస్తే చాలా తక్కువ ఆక్సిజన్‌తోనే అవసరమైన జీవక్రియలు జరుగుతుంటాయి. ఎన్నో ఏళ్లుగా ఒకచోట నివసించడం వల్ల వచ్చిన సహజరక్షణచర్య (అడాప్టేషన్) కారణంగా అలా జరుగుతుంది. కారణమేదైనా మన దేశవాసుల జన్యుస్వభావాన్ని బట్టి చైనాలోని ఆర్‌నాట్ ఇక్కడ కొనసాగలేదు. చైనా, ఇటలీ, అమెరికా దేశాల్లోని నైసర్గిక స్వరూపం, అక్కడి సహజ శీతల ఉష్ణోగ్రత వాతావరణ పరిస్థితుల కారణంగా వైరస్ చాలా చురుగ్గా ఉందనీ... కానీ భారత్‌లో మార్చినెలలో ఈ వైరస్ విస్తరణ మొదలైనందున, ఇప్పటికే దాదాపు 36 డిగ్రీల సెంటీగ్రేడ్ పగటి ఉష్ణోగ్రతతో ఇక్కడి అధిక ఉష్ణతీవ్రత / వాతావరణం కారణంగా దీని విస్తరణ అంతగా ఉండదని అంచనా వేస్తున్నారు. భారతదేశంలో వైరస్ విజృంభించేందుకు ఉన్న అననుకూలతలతో కూడిన స్థానిక పరిస్థితుల దృష్ట్యా చూసినా... లేదా పారాసిటమాల్‌తోనే వ్యాధి లక్షణాలకు ఉపశమనం సాధించగలిగే నేపథ్యంతో చూసినా... ఇప్పటివరకూ ఒక్కటంటే ఒక్క మరణం కూడా నమోదుకాని సానుకూలతల దృష్ట్యా చూసినా కరోనా వైరస్ (కోవిడ్-19) గురించి మన దేశవాసులు... అందునా ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాల వాసులు ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. అవగాహన పెంచుకుని నిర్మక్షం వహించకుండా తగిన నివారణ చర్యలు పాటిస్తూ... అప్రమత్తంగా ఉంటే చాలనంటున్నారు కానీ, దీనిపై భిన్నవాదనలు కూడా వినిపిస్తున్నాయి.

ఏమైనా ప్రస్తుత పరిస్థితులలో ఇది కొంచెం ఊరటే కదా!

పారాసిటమాల్ చాలంటున్న డా. గగన్‌దీప్

ఇప్పటికిప్పుడు మనదేశంలో కరోనా వైరస్ విస్తృతంగా విజృంభించే పరిస్థితి లేదనీ... ఒకవేళ ఎవరికైనా వ్యాధి వచ్చినా కేవలం పారాసిటమాల్‌తోనే దాన్ని నయం చేయవచ్చని అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన మన దేశ మహిళా వైద్యశాస్త్రవేత్త గగన్‌దీప్ కాంగ్ అంటున్నారు. వెల్లూర్‌లోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టినల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా ఆమె ప్రస్తుతం నార్వేలో కార్యకలాపాలు సాగిస్తున్న 'కొయలీషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్‌నెస్ ఇన్నోవేషన్' (సీఈపీఐ) కార్యక్రమంలో చురుకైన భూమికను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థకు అంతర్జాతీయంగా నార్వే, జపాన్, జర్మనీ వంటి దేశాల ప్రభుత్వాలతో పాటు ద వెల్‌కమ్ ట్రస్ట్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ వంటి సంస్థలు వందల బిలియన్ల డాలర్ల ఆర్థిక సహాయం చేస్తున్నాయి. కరోనా లాంటి వైరస్‌లు ప్రపంచవ్యాప్తంగా విజృంభించినప్పుడు మనమెంత సన్నద్ధంగా ఉండాలో, ఎలాంటి వ్యాక్సిన్లు రూపొందించాలో తెలిపే సంస్థకు చెందిన ఆమె చెబుతున్నదాని బట్టి కేవలం పారాసిటమాల్‌తో లక్షణాలకు ఉపశమనం పొంది, ఆ వ్యాధిని తగ్గించుకుంటే... ఆ తర్వాత కరోనా గ్రూపులోని కోవిడ్-19 మళ్లీ వచ్చే అవకాశమే ఉండదు. కాబట్టి ఈ రకంగా చూసినా మనం ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఇక కొన్నిచోట్ల హెచ్ఐవీకి ఇచ్చే మందులు ఇవ్వడం ద్వారా వైరస్ ప్రభావాన్ని పూర్తిగా తగ్గించగలుగుతున్నట్లు, తద్వారా మరణాలను నివారించవచ్చని కూడా తెలుస్తుంది. చైనా నేషనల్ సెంటర్ ఫర్ బయోకెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ అయిన ఝూంగ్ గ్జిన్‌మిన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ... కోవిడ్-19పై ప్రభావపూర్వకంగా పనిచేస్తున్న మూడు ఔషధాల్లో అది ప్రధానమైనదని తెలుపుతున్నారు.

డాక్టర్ రమణ ప్రసాద్, పల్మునాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

అర్థం చేసుకుందాం... ఆచరిద్దాం...

బొమ్మలు: అన్వర్



బొమ్మలు: వాసు

అలవాట్లు ఆహారం

అ ఫర్... అలవాట్లు

ఆ ఫర్... ఆహారం

వ్యాధి నిరోధకత కోసం... ఈ 'అ... ఆ'లు జీవనశైలికి చెందినవి

- చెడు వ్యసనాలైన మద్యం తాగడం, పొగతాగడం, గుట్కా, ఖైనీ, పాన్‌మసాలా వంటి పొగాకు ఉత్పాదనలను తీసుకోవడం వంటి అలవాట్లను తక్షణం మానేయాలి.
- రోజూ క్రమం తప్పకుండా కనీసం 45 నిమిషాల పాటు బ్రిస్క్‌వాకింగ్ లేదా జాగింగ్ వంటి మంచి అలవాట్ల వల్ల వ్యాధినిరోధక శక్తి బాగా పెరుగుతుంది.

మంచి వ్యాధినిరోధకత కోసం అన్ని రకాల పోషకాలు... అంటే పిండి పదార్థాలు (కార్బోహైడ్రేట్స్), ప్రోటన్లు, కొవ్వుపదార్థాలు, ఖనిజలవణాలు ఉండేలా, మైక్రో-మాక్రోన్యూట్రియెంట్స్ అందేలా అన్ని రకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. ఇందులో తక్షణ శక్తి కోసం పిండిపదార్థాలు; శక్తి నిల్వ చేసుకునేందుకు కొవ్వు పదార్థాలు; కణాల రిపేర్లకు ప్రొటీన్లు; పోషకాలను సమకూర్చేందుకు ఆకుకూరలు, కూరగాయలు; విటమిన్లను సమకూర్చే తాజాపండ్లు, లవణాలను ఇచ్చే ఆహారాలన్నింటినీ తీసుకోవాలి. వ్యాధి నిరోధకతను పెంచేలా క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రాకలీ వంటి క్రూసిఫెరస్ ఆహారాలనూ, అల్లం, వెల్లుల్లి, ఉల్లి లాంటి జలుబు రకాలను అరికట్టే స్వాభావిక పదార్థాలను తీసుకోవాలి. ఈ సమతులాహారం మన రోగనిరోధక వ్యవస్థను బలంగా చేసి మనం అనారోగ్యానికి గురికాకుండా చేస్తుంది.

అలవాట్లతో పాటు ఆహారం కేటగిరీలోకి వచ్చే ఈ మంచి అలవాట్లను ఆచరించాలి.

● తాజా పండ్లు తినడం

ఏ సీజన్‌లో లభ్యమయ్యే పండ్లను ఆ సీజన్‌లో తింటుండటం అన్నది మంచి ఆహారపు అలవాట్లలో ఒకటి.

● నీళ్లు ఎక్కువగా తాగడం

మన శరీరంలోని 75 శాతం కేవలం నీటినే కలిగి ఉంటుంది. మనలోని ద్రవాలను కోల్పోవడం అన్నది ఒక్కోసారి ప్రాణానికే అపాయం. అందుకే మనం రోజూ కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగడం అన్నది చాలా అవసరం.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
గురువారం
12-3-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నోటిఫికేషన్స్

జేఎన్‌యూలో ప్రవేశాలు

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ సెంట్రల్ యూనివర్సిటీలో 2020-21 విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ మొదలైంది. వర్సిటీ అందిస్తున్న యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ అందించే మొత్తం 37 ఆర్ట్స్, సైన్స్, హ్యూమానిటీస్, భాష, సంస్కృతి వంటి పీజీ కోర్సులకు దేశవ్యాప్తంగా 127 సెంటర్లలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది.

కోర్సులు

యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. సమయం 3 గంటలు. మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెగిటివ్ మార్కులు లేవు.

ముఖ్యమైన తేదీలు

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 2 మార్చి 2020
- **దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ:** 31 మార్చి, 2020
- **హాల్ టికెట్ల జారీ:** 21 ఏప్రిల్, 2020
- **ప్రవేశ పరీక్షలు ప్రారంభం:** మే 11 నుంచి 14 వరకు
- **ఫలితాల ప్రకటన:** మే 31, 2020
- **వివరాలకు: www.jnu.ac.in**

ఐఐటీ బాంబేలో డిజైనింగ్ కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), బాంబే, ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్ అందిస్తున్న మాస్టర్ ఆఫ్ డిజైనింగ్ కోర్సుల్లో (2020-21) ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 10+2+4 విధానంలో డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు. అభ్యర్థులకు 55 శాతం(ఎస్సీ/ఎస్టీ 50 శాతం) మార్కులు తప్పనిసరి.

- **కోర్సులు:** ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, యానిమేషన్, మొబిలిటీ అండ్ వెహికల్ డిజైన్
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగులు రూ.150, జనరల్/ ఓబీసీ(ఎన్‌సీ) రూ.300
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా..
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 18
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 17
- **ఇంటర్వ్యూ తేదీలు:** ఏప్రిల్ 18, 19
- **వివరాలకు www.idc.iitb.ac.in**

ఐఐఎం-కాశీపూర్‌లో.. ఎంబీఏ అనలిటిక్స్

ఐఐఎం-కాశీపూర్.. ఎంబీఏ(అనలిటిక్స్) కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. డేటా విశ్లేషణ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులకు సమగ్ర శిక్షణ అందించడం ఎంబీఏ అనలిటిక్స్ కోర్సు ముఖ్య ఉద్దేశంగా ఐఐఎం కాశీపూర్ పేర్కొంది. మారుతున్న టెక్నాలజీని అర్థం చేసుకోవడం.. వ్యాపార వాతావరణాన్ని అంచనా వేయడం.. సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు విశ్లేషణ నైపుణ్యాలను సొంతం చేసుకునేలా బోధన ఉంటుంది.

విద్యార్హతలు

ఐఐఎం-కాశీపూర్ అందించే ఎంబీఏ(అనలిటిక్స్) కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు.. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానమైన విద్యార్హత (10+2+3) ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. నాన్ క్రిమిలేయర్ ఓబీసీలు 47 శాతం, ఎస్సీ/ఎస్టీ/డీఏపీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు రావాలి.

- క్యాట్-2019 స్కోరు/1 మే 2018 తర్వాత జీమ్యాట్/జీఆర్‌ఈ స్కోరుతోపాటు పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ప్రభుత్వ నిబంధన ప్రకారం- వివిధ సామాజిక వర్గాలు, వికలాంగులకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు ఫీజు:** నాన్ క్రిమిలేయర్ ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ/డీఏపీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500, ఇతరులకు రూ.1000.

ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 30 ఏప్రిల్ 2020
- **షార్ట్ లిస్ట్ ప్రకటన:** 10 మే 2020
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iimkashipur.ac.in/academics/mba-analytics

యూజీసీ నెట్ 2020

ఫెలోషిప్.. ప్రొఫెసర్‌షిప్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. యూజీసీ తరపున నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు(నెట్)ను నిర్వహిస్తోంది. నెట్ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు అర్హత లభిస్తుంది. అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్)లను దక్కించుకోవచ్చు. తాజాగా ఎన్‌టీఏ యూజీసీ-నెట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. ఔత్సాహిక అభ్యర్థులకు ఉపయోగపడేలా యూజీసీ నెట్ పూర్తి సమాచారం...

ఎన్‌టీఏ ఏటా జూన్, డిసెంబర్‌లో యూజీసీ నెట్‌ను నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష ద్వారా యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీపడే అర్హత లభిస్తుంది. అలాగే, మెరిట్‌లిస్టులో టాప్‌లో నిలిచిన విద్యార్థులకు జేఆర్‌ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) అందితే.. మరికొంత మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్‌ఎఫ్... రెండిటికీ అర్హత లభిస్తుంది.

నెలకు రూ.31వేల ఫెలోషిప్

నెట్‌లో అత్యుత్తమ ప్రతిభ ద్వారా జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే ప్రతిష్టాత్మక రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో పరిశోధన కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. ఆ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.31 వేలు ఫెలోషిప్‌గా అందుతుంది. దీంతోపాటు హెచ్‌ఆర్‌ఏ ఉంటుంది. పరిశోధన చేసే ప్రాంతాన్ని బట్టి 8 శాతం, 16 శాతం, 24 శాతం వరకు హౌజ్ అలవెన్సులు చెల్లిస్తారు. అలాగే కాంటింజెన్సీ ఫండ్ పేరుతో ఏటా నిర్ణీత మొత్తం విద్యార్థులకు దక్కుతుంది. జేఆర్‌ఎఫ్ అందుకున్న రెండేళ్ల తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్ఆర్‌ఎఫ్) లభిస్తుంది. అప్పుడు నెలకు రూ.35 వేల ఫెలోషిప్ అందుతుంది. దీనికి అలవెన్సులు అదనం.

అసిస్టెంట్ ప్రొఫెసర్

జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు కూడా అర్హులే. యూజీసీ నెట్‌లో మెరిట్ లిస్ట్‌లో నిలిస్తే.. దేశంలోని యూనివర్సిటీల్లో, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుంది. ఎలిజిబిలిటీ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణులకు రాష్ట్ర స్థాయి వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది.

పీఎస్‌యూ కొలువు

యూజీసీ నెట్ స్కోర్‌తో ప్రభుత్వ రంగ సంస్థలు నియామకాలు చేపట్టే అవకాశం ఉంటుంది. పీఎస్‌యూలు, ఆర్ అండ్ డీ, మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో నియామకాలకు యూజీసీ నెట్ ఉత్తీర్ణులను పరిగణనలోకి తీసుకునే వీలుంది.

యూజీసీ నెట్ 2020(జూన్) షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టీఏ

దరఖాస్తులకు చివరి తేది: 16.04.2020

నెట్ ప్రతిభతో జేఆర్‌ఎఫ్, ప్రొఫెసర్‌షిప్ అందుకోవచ్చు

టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు యూజీసీ నెట్ స్కోర్‌తో పోటీ పడవచ్చు.

అర్హతలు

మొత్తం 84 సబ్జెక్టుల్లో యూజీసీ నెట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) నిర్వహిస్తున్నారు. హ్యూమానిటీస్(భాషలు సహా), సోషల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ సైన్స్ విభాగాల్లోని సబ్జెక్టుల్లో నెట్‌ను నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్ట్‌ల్లో పీజీ లేదా తత్సమాన కోర్సులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 5 శాతం మార్కుల సడలింపు ఉంటుంది. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు సైతం దరఖాస్తుకు అర్హులే.

పరీక్ష విధానం

- నెట్‌ను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు. పేపర్ల మధ్య ఎటువంటి విరామ సమయం ఉండదు.
- అన్ని సబ్జెక్టులకు పేపర్ 1 కామన్‌గా ఉంటుంది. ఇది 50 ప్రశ్నలు-100 మార్కులకు జరుగుతుంది. రీసెర్చ్/టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కాంప్రహెన్షన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయి.
- అభ్యర్థి స్పెషలైజేషన్(ఎంచుకున్న) సబ్జెక్టుపై పేపర్-2 ఉంటుంది. ప్రశ్నపత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కుల చొప్పున 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. రెండు పేపర్లలోనూ నెగిటివ్ మార్కుల విధానం లేదు.
- మొత్తంగా రెండు పేపర్లలో కలిపి జనరల్ అభ్యర్థులకు 40 శాతం, రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు 35 శాతం మార్కులను కనీస ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ రెండు పేపర్లలో సాధించిన మార్కుల ఆధారంగా.. పరీక్షకు హాజరైన వారిలో మొదటి(టాప్) 6 శాతం మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు అర్హత లభిస్తుంది. అత్యుత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులను జేఆర్‌ఎఫ్‌కు ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్ ఇలా

- పేపర్-1లో టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, దేశంలో ఉన్నత విద్య-ప్రస్తుత పరిస్థితులు, సమకాలీన విద్యా రంగ సంబంధిత అంశాలపై దృష్టిపెట్టాలి.
- నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్‌ఎఫ్) ఇచ్చే ర్యాంకులు, వర్సిటీలకు విశిష్ట గుర్తింపు లభించిన సంఘటనలు గుర్తుపెట్టుకోవాలి.
- పేపర్ 1లో రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగం కీలకం. కాబట్టి వేగంగా చదవడం, అర్థం చేసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ కోసం ఏదైనా ఒక పుస్తకాన్ని అనుసరిస్తే సరిపోతుంది.
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి లాజికల్ రీజనింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పరీక్షించే ప్రశ్నలు కూడా అడుగుతారు. అభ్యర్థులు నిర్దిష్ట డేటా నుంచి ముఖ్యాంశాలను గుర్తించే విశ్లేషణా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి.
- పేపర్ 2 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో సబ్జెక్టుపై పట్టు సాధించాలి. అభ్యర్థులు తమ సబ్జెక్ట్‌కు సంబంధించి పీజీ సిలబస్‌ను పూర్తిగా చదవాలి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నా.. ప్రాథమిక అంశాలపై పట్టు అవసరం. సిలబస్‌లో పేర్కొన్న ప్రతి టాపిక్‌ను భిన్న కోణాల్లో చదవాలి.
- మ్యాచింగ్, అప్లికేషన్‌లపై ప్రశ్నలు అడుగుతారు. సిలబస్‌లో పేర్కొన్న అంశాలపై డిగ్రీ, పీజీ స్థాయి ప్రామాణిక పుస్తకాలను అధ్యయనం చేయాలి. సొంత నోట్స్ రాసుకొని ప్రిపేరవ్వాలి. అన్ని అంశాలను క్షుణ్ణంగా చదవాలి. గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. మాక్ టెస్ట్‌లు రాయాలి. నెగెటివ్ మార్కుల విధానం అమల్లో లేదు. కాబట్టి అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం మేలు.

ముఖ్యసమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **హాల్ టికెట్ల జారీ ప్రారంభం:** మే 15 నుంచి
- **నెట్ నిర్వహణ తేదీలు:** జూన్ 15-20
- **ఫలితాల వెల్లడి:** జూలై 5
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.nic.in

ఇంటర్‌తోనే మేనేజ్‌మెంట్ పీజీ

అడ్మిషన్స్

ఐఐఎం, ఇండోర్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రణాళిక సంఘం చేసిన సిఫార్సుల మేరకు దేశంలో ఏర్పాటు చేసిన ఐఐఎంల్లో ఆరోది మధ్యప్రదేశ్‌లోని ఐఐఎం ఇండోర్. 1996లో 193 ఎకరాల విస్తీర్ణంలో ఈ విద్యాసంస్థ తన ప్రస్థానం ప్రారంభించింది. కొద్దికాలంలోనే మేటి బీస్కూల్‌గా గుర్తింపు పొందింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(పీజీపీ), ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఈపీజీపీ), పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్(పీజీ-పీఎంఎక్స్),ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎఫ్‌పీఎం) తోపాటు ప్రత్యేకంగా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం) కోర్సులను అందిస్తోంది.

ఐపీఎం కోర్సు

ఐఐఎం ఇండోర్ 2011 విద్యా సంవత్సరం నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించింది. దేశంలోనే ఇలాంటి కోర్సును అందిస్తున్న తొలి విద్యాసంస్థ ఐఐఎం,ఇండోర్. ఈ కోర్సుకు సంబంధించి ఐఐఎం,ఇండోర్‌లో అందుబాటులో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య 150. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి.. ఐపీఎం కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఈ కోర్సులో భాగంగా మూడేళ్లు ఫౌండేషన్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్.. ఆ తర్వాత రెండేళ్ల పీజీపీ కోర్సును బోధిస్తారు.

అర్హతలు

- ఐపీఎంకి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు పదోతరగతి, ఇంటర్‌లో కనీసం 60 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 55శాతం మార్కులతో 2018, 2019లో ఉత్తీర్ణత సాధించాలి.
- ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసే విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

వయసు

- ఆగస్టు 01, 2000 తర్వాత జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఆగస్టు 01, 1995 తర్వాత జన్మించాలి.

ఎంపిక ప్రక్రియ

ఐఐఎం ఇండోర్ నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలకు పిలుస్తారు. రాత పరీక్షలో అభ్యర్థుల అప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీని పరీక్షిస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వీటిల్లోనూ ప్రతిభ చూపితే.. ఐపీఎం కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

పరీక్ష విధానం

దేశవ్యాప్తంగా మొత్తం 34 నగరాల్లో ఆన్‌లైన్ విధానంలో ఐపీఎం పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ(40), వెర్బల్ ఎబిలిటీ(40), క్వాంటిటేటివ్ షార్ట్ డిస్క్రిప్టివ్(20) విభాగాల నుంచి మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. దీంట్లో ఇచ్చే షార్ట్ డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు లేవు.

ఐపీఎంతో కెరీర్

ఇంటర్ పూర్తికాగానే డిగ్రీ, పీజీ ఒకేసారి పూర్తిచేసే అవకాశం ఉండటం ఐపీఎం కోర్సు ప్రత్యేకత. అంతేకాకుండా ఐఐఎం ఇండోర్ లాంటి పేరున్న విద్యాసంస్థలో ఇంటర్‌తోనే మేనేజ్‌మెంట్ పీజీ కోర్సు చదివే అవకాశం ఉండటంతో ఏటేటా దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఉద్యోగాల పరంగా ఎలాంటి ఢోకా లేదని చెప్పొచ్చు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

ఐఐఎంలో మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఆకర్షణీయ వేతనాలతో కార్పొరేట్ కొలువులు లభిస్తున్నాయి. ఐఐఎం ఇండోర్‌లో ఏ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకైనా సగటు వార్షిక వేతనం రూ. 20.79 లక్షలుగా ఉంటోంది.

దరఖాస్తు ఫీజు

జనరల్ అభ్యర్థులు రూ.4,130, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.2,065 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 30 మార్చి 2020.
- **పరీక్ష తేదీ:** 30 ఏప్రిల్ 2020.
- **ఇంటర్వ్యూ:** మే నెలలో ఉంటుంది.
- **వెబ్‌సైట్:** iimidr.ac.in

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండోర్.. దేశంలో మేనేజ్‌మెంట్ కోర్సులను అందించడంలో పేరున్న బీస్కూల్. ఉన్నతమైన బోధన, కోర్సు పూర్తికాగానే ఆకర్షణీయ వేతనాలతో క్యాంపస్ కొలువులు.. దేశంలోని ఐఐఎంల ప్రత్యేకత. ఐఐఎంల్లో ప్రవేశాలంటే.. డిగ్రీ తర్వాతే అని భావిస్తారు. కాని ఇంటర్‌తోనే.. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులో ప్రవేశం కల్పిస్తూ.. ఐఐఎం, ఇండోర్ మరింత ప్రత్యేకతను చాటుకుంటోంది. 2020-25 విద్యా సంవత్సరానికి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)లో ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐఐఎం, ఇండోర్ అందించే ఐపీఎం కోర్సు ప్రత్యేకత.. అర్హతలు, ప్రవేశ విధానం గురించి తెలుసుకుందాం..

- ఐఐఎం ఇండోర్‌లో ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశాలు
- దరఖాస్తుకు చివరి తేది: 30 మార్చి 2020

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

Department of Management Studies, NALSAR University of Law, Hyderabad
Govt. University under UGC | Accredited in 'A+' grade with 3.66/4.00 by NAAC
MBA Admissions open for 2020-22 batch
ELIGIBILITY A Bachelor's Degree with min 50% of marks /equivalent CGPA. Students awaiting results can also apply.
CMS accepts CAT, XAT, GRE, GMAT & CMAT Scores. Candidates without these scores can take NALSAR Management Entrance Test (N-MET) on 26th April, 2020. GD & PI follows for all applicants.
Last Date to apply: 18th April, 2020
Apply online: https://cms.nalsar.ac.in/apply
Phone: 040-23498409 / 434 I Mobile: 9640158883
Email: mba@nalsar.ac.in

స్పాలో ఆర్కిటెక్చర్

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా).. దేశంలో నాణ్యమైన ప్లానింగ్, ఆర్కిటెక్చర్, డిజైనింగ్ విద్యను అందించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని స్పా న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా... భోపాల్, విజయవాడల్లో క్యాంపస్‌లు కలిగి ఉంది. ఆర్కిటెక్చర్, ప్లానింగ్, డిజైనింగ్‌పై ఆసక్తి గల అభ్యర్థులకోసం ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) డిగ్రీ, పీజీ, డాక్టోరల్ కోర్సులను అందిస్తోంది. 2020-21 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పా ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. స్పా అందించే కోర్సులు, అర్హతలు, ప్రవేశ విధానం వివరాలు...

- 2020-21 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు
- దరఖాస్తులకు చివరి తేది: 13 మార్చి 2020

పీజీ ప్రోగ్రామ్స్.. అర్హతలు

- **ఎంఆర్క్ ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ అండ్ అర్బన్ డిజైన్:** ఆర్కిటెక్చర్ లేదా ప్లానింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- **ఇండస్ట్రియల్ డిజైన్:** ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి లేదా తత్సమాన విద్యార్హత అయిన డిజైనింగ్ లేదా ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా సంబంధిత స్ట్రీమ్‌లో వ్యాలిడ్ సీడ్ స్కోర్ సాధించాలి.
- **ఎంప్లాన్ ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్:** ప్లానింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా ఆర్కిటెక్చర్ లేదా సివిల్ ఇంజనీర్, ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, జాగ్రఫీ, ఎకానమీ, సోషియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేయాలి.
- **హౌసింగ్:** ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ప్లానింగ్, సివిల్, ఆర్కిటెక్చర్, మున్సిపల్, బిల్డింగ్‌లో ఏదైనా ఒక దాంట్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. లేదా ఎంఏ ఇన్ సోషియాలజీ/ఎకనమిక్స్ ఉత్తీర్ణులవ్వాలి.
- **రీజనల్ అండ్ అర్బన్ ప్లానింగ్:** ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ప్లానింగ్, సివిల్, ఆర్కిటెక్చర్, మున్సిపల్, బిల్డింగ్ ఇంజనీరింగ్‌లో ఏదైనా ఒక దాంట్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఎంఏ ఇన్ సోషియాలజీ లేదా ఎకనమిక్స్ పూర్తిచేసి ఉండాలి.
- **ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్:** ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ప్లానింగ్, సివిల్, ఆర్కిటెక్చరర్ ఇంజనీరింగ్‌లలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్, ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి.
- **ఎంబీఈఎం బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్:** ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ ఇంజనీరింగ్, బిల్డింగ్ సైన్స్/ఆర్కిటెక్చరర్/ఆర్కిటెక్చర్‌కలిగి ఉండాలి. డిప్లొమా అభ్యర్థులు కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీలో ఐదేళ్ల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ ల్యాండ్ స్పేస్ ఆర్కిటెక్చర్:** ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి ల్యాండ్ స్పేస్ ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా ప్లానింగ్‌లో మాస్టర్ డిగ్రీ లేదా తత్సమాన పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లొమా కలిగిన వారై ఉండాలి.
- పైన తెలిపిన విద్యార్హతల్లో జనరల్ అభ్యర్థులు కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు 50 మార్కులు సాధిస్తే సరిపోతుంది.

ఎంపిక ప్రక్రియ

ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించి.. అభ్యర్థులను తుది ఎంపిక చేసి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలను కల్పిస్తారు.

బ్యాచిలర్ డిగ్రీ

ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ కింద అందించే బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లో బీప్లాన్, బీఆర్క్‌లో ప్

బుధవారం సాయంత్రం
ధర్మశాల స్టేడియం

న్యూజిలాండ్ పర్యటనలో వన్డే, టెస్టు సిరీస్‌లలో అవమానకరంగా వైట్‌వాష్‌కు గురైన తర్వాత కొంత విరామంతో భారత జట్టు మరో పోరుకు సన్నద్ధమైంది. అయితే ఇప్పుడు వేదిక సొంతగడ్డకు మారింది. గత అక్టోబరులో ఇక్కడే జరిగిన టెస్టు సిరీస్‌లో చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా నాటి పర్యటనకు కొనసాగింపుగా ఇప్పుడు కేవలం వన్డేల కోసమే వచ్చింది. స్వదేశంలో ఆస్ట్రేలియాను వన్డేల్లో చిత్తు చేసిన ఉత్సాహంతో సఫారీలు భారత్‌లో అడుగు పెట్టారు. అయితే భారత్‌లో కోహ్లి సేనను నిలువరించడం అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో మూడు వన్డేల సమరం ఆసక్తికరంగా సాగనుంది.

స్వదేశంలో మళ్లీ ఆట మొదలు

- నేటినుంచి భారత్–దక్షిణాఫ్రికా వన్డే సిరీస్
- తొలి పోరుకు ఇరు జట్లు సిద్ధం
- కొత్త ఉత్సాహంతో టీమిండియా
- జోరు మీదున్న డి కాక్ బృందం
- మ్యాచ్‌కు వర్షం ప్రమాదం!

'కరోనా భయం కారణంగా బంతి మెరుపు పెంచేందుకు ఈ సారి ఉమ్మును వాడ రాదని మేమూ అనుకుంటున్నాం. అయితే దీనిపై ఇప్పుడే ఏమీ చెప్పలేను. ఎందుకంటే అలా చేయకపోతే మెరుపు రాబట్టేది ఎలా! ఆ తర్వాత ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ మా బౌలింగ్‌ను చితక్కొడతారు. మీరేమో బౌలింగ్ బాగా చేయడం లేదని, విఫలమయ్యాడని అంటారు. డాక్టర్ల సలహా తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం'

-భువనేశ్వర్ కుమార్, భారత బౌలర్

డి కాక్

మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

ధర్మశాల: భారత క్రికెట్ అభిమానులు ఐపీఎల్ మత్తులోకి వెళ్లే ముందు ఒక స్వల్ప వన్డే సిరీస్‌ను దాటాల్సి ఉంది! గతంలో నిర్ణయించిన ద్వైపాక్షిక షెడ్యూల్ ప్రకారం దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా నేడు జరిగే తొలి వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. వరుసగా ఐదు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఓటముల తర్వాత విజయాన్ని అందుకోవాలని భారత్ భావిస్తుండగా... డి కాక్ నేతృత్వంలో సత్తా చాటాలని సఫారీలు పట్టుదలగా ఉన్నారు.

ముగ్గురూ రెడీ

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడిన జట్టుతో పోలిస్తే భారత జట్టులో మూడు ప్రధాన మార్పులు ఖాయమయ్యాయి. గాయాలనుంచి పునరాగమనం చేసిన శిఖర్ ధావన్, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యాలు తుది జట్టులో ఉంటారు. కివీస్‌పై ఓపెనింగ్ వైఫల్యం స్పష్టంగా కనిపించిన నేపథ్యంలో సీనియర్ ఓపెనర్ ధావన్ కీలకం కానున్నాడు. అతను తన అసలు సత్తాను ప్రదర్శిస్తే టీమిండియాకు శుభారంభం లభిస్తుంది. మరో ఓపెనర్ పృథ్వీ షా కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడితే అతని వన్డే భవిష్యత్తు బాగుంటుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ మిడిలార్డర్‌లో మళ్లీ చెలరేగేందుకు ఉత్సాహంగా ఉన్నారు. వీరికి తోడు కెప్టెన్ కోహ్లి ఎలాగూ ఉన్నాడు. కివీస్ టూర్‌లో ఘోరంగా విఫలమైన విరాట్ తన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడాలని ఎదురు చూస్తున్నాడు. అతనికిదే సరైన వేదిక. బౌలింగ్‌లో బుమ్రాతో పాటు భువనేశ్వర్ కుమార్ కొత్త బంతిని పంచుకుంటాడు. గాయంనుంచి కోలుకున్న భువీ ఎంత మేరకు రాణిస్తాడనేది ఆసక్తికరం. పిచ్‌ను దృష్టిలో ఉంచుకుంటే మూడో పేసర్‌గా సైనీకి చోటు దక్కవచ్చు. అయితే ఆరో స్థానాన్ని తనకంటూ దాదాపుగా ఖరారు చేసుకున్న మనీశ్ పాండేను తీసుకుంటారా అనేదే ప్రశ్న. పాండ్యా స్థానంలో వచ్చినప్పటినుంచి ఆల్‌రౌండర్‌గా జడేజా అద్భుతంగా ఆడుతున్నాడు. ఇప్పుడు పాండ్యా రాకతో అతడిని తప్పిస్తారా లేక ఇద్దరు ఆల్‌రౌండర్లను కొనసాగించి పాండేను పక్కన పెడతారా చూడాలి. బుధవారం జరిగిన ప్రాక్టీస్‌లో కెప్టెన్ కోహ్లి, పాండ్యా పాల్గొనలేదు.

ప్రాక్టీస్‌లో భారత జట్టు సభ్యులు

సీనియర్లే కీలకం...

గత అక్టోబరులో భారత్‌లో పర్యటించినప్పుడు టి20 సిరీస్‌ను సమం చేసిన దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌ను 0–3తో కోల్పోయింది. తదనంతర పరిణామాల్లో డు ప్లెసిస్ కెప్టెన్సీని కూడా వదిలేసుకున్నాడు. డి కాక్ సారథ్యంలో ఇటీవలే ఆస్ట్రేలియాను వన్డేల్లో 3–0తో చిత్తు చేసి సఫారీలు కొత్త ఉత్సాహంతో ఉన్నారు. బ్యాటింగ్‌లో ఆ జట్టుకు కెప్టెన్, మాజీ కెప్టెన్‌తో పాటు డేవిడ్ మిల్లర్ అనుభవం కీలకం కానుంది. వీరిని మినహాయిస్తే ఎక్కువ మందికి అనుభవం లేక పోవడం జట్టు ప్రధాన లోటు. అందులోనూ భారత గడ్డపై కొత్త ఆటగాళ్లు తొలి పర్యటనలో రాణించడం చాలా కష్టం. కాబట్టి ఆ జట్టు విజయావకాశాలు ముగ్గురి బ్యాటింగ్‌పైనే ఆధారపడి ఉన్నాయి. బవుమా, వాన్ డర్ డసెన్, క్లాసెన్ బ్యాటింగ్ భారాన్ని మోయాల్సి ఉంది. చివరి నిమిషంలో జట్టులో చేరిన జేన్‌మన్ మలాన్‌కు స్థానం దక్కుతుందా చూడాలి. రబడ లాంటి స్టార్ బౌలర్ కూడా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా పేస్ బౌలింగ్ అంతంత మాత్రంగా ఉంది. అయితే ఇక్కడి పిచ్‌పై తాము ప్రభావం చూపించగలమని పేసర్లు నమ్మతున్నారు. ఇన్‌గిడి ప్రధాన పేసర్ కాగా...నోర్జే, హెన్‌డ్రిక్స్‌లు సహకరిస్తారు.

తుది జట్లు (అంచనా):

భారత్: కోహ్లి (కెప్టెన్), ధావన్, పృథ్వీ షా, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా/ పాండే, భువనేశ్వర్, సైనీ, చహల్, బుమ్రా.

దక్షిణాఫ్రికా: డి కాక్ (కెప్టెన్), బవుమా/ మలాన్, వాన్ డర్ డసెన్, డు ప్లెసిస్, క్లాసెన్, మిల్లర్, ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, నోర్జే, ఇన్‌గిడి, హెన్‌డ్రిక్స్

పిచ్, వాతావరణం

చల్లటి వాతావరణం, తేమ కారణంగా మొదటినుంచి ఇక్కడి పిచ్ పేసర్లకు అనుకూలిస్తుంది. గతంలో చూస్తే రెండో బ్యాటింగ్ చేసిన జట్లే ఎక్కువ మ్యాచ్‌లు నెగ్గాయి. అయితే మ్యాచ్ రోజు వర్షం ముప్పు పొంచి ఉంది. పూర్తిగా గానీ ఏదో ఒక సమయంలో గానీ వాన ఇబ్బంది కలిగించవచ్చు. సెప్టెంబరులో ఇరు జట్ల మధ్య జరగాల్సిన టి20 మ్యాచ్ కూడా వర్షం కారణంగా పూర్తిగా రద్దయింది.

డి కాక్ చెలరేగిపోగలడు!

(సునీల్ గావస్కర్)

కొత్త కెప్టెన్ డి కాక్ సారథ్యంలో దక్షిణాఫ్రికా జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం మళ్లీ వచ్చింది. దక్షిణాఫ్రికాలో 3–0తో ఆస్ట్రేలియాను చిత్తు చేసి వస్తుండటం వల్ల జట్టులో ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువగా ఉండి ఉంటుంది. డి కాక్ తొలి రెండు వన్డేల్లో విఫలమయ్యాడు. రెండు సార్లు స్టార్క్ బౌలింగ్‌లోనే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తన భార్య అలీసా హీలీ ప్రపంచ కప్ మ్యాచ్ చూసేందుకు స్టార్క్ స్వదేశం వెళ్లిన తర్వాత జరిగిన మూడో వన్డేలోనే అతను పరుగులు చేయగలిగాడు. అయితే దీని వల్ల అతనిపై ఎలాంటి ఒత్తిడీ ఉండదు. ఎందుకంటే భారత్‌పై అద్భుతమైన రికార్డు ఉన్న డి కాక్ అలవోకగా సెంచరీలు బాదేశాడు. భారత్‌లో పరాభవం నుంచి కోలుకున్న తర్వాత డు ప్లెసిస్ కూడా ఇప్పుడు కోలుకొని ఉంటాడు. అతనిలోని అసలైన బ్యాట్స్‌మన్ బయటకు వస్తే మంచిది. అతనిపై కెప్టెన్సీ భారం లేదు కాబట్టి కొన్నాళ్ల క్రితం సారథిగా కనిపించిన బేలతనం ఇకపై కనిపించకపోవచ్చు. కొందరు కొత్త ఆటగాళ్లతో జట్టు కూడా కొత్తగా కనిపిస్తోంది. ఆసీస్‌పై సెంచరీ చేసిన మలాన్‌తో పాటు గతంలో భారత్‌లో ఆడినా పెద్దగా అవకాశాలు రాని క్లాసెన్ ఆట కూడా కీలకం కానుంది. రబడ లేకుండా బౌలింగ్ కొంత బలహీనంగా కనిపిస్తున్నా... ఇక్కడ టెస్టులు ఆడలేకపోయిన ఇన్‌గిడి ఇటీవల ఆస్ట్రేలియాపై చెలరేగాడు. అతను ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉంది.

బంగ్లాదే టి20 సిరీస్

ఢాకా: జింబాబ్వేతో రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను బంగ్లాదేశ్ 2–0తో గెలుచుకుంది. బుధవారం జరిగిన రెండో టి20లో బంగ్లా 9 వికెట్ల తేడాతో జింబాబ్వేపై గెలిచింది. మొదట జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్లకు 119 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రెండన్ టేలర్ (48 బంతుల్లో 59 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. క్రెయిగ్ ఇర్విన్ 29 పరుగులు చేశాడు. ముస్తఫిజుర్ రహమాన్, అమిన్ హుస్సేన్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత బంగ్లాదేశ్ 15.5 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' లిటన్ దాస్ (45 బంతుల్లో 60 నాటౌట్; 8 ఫోర్లు) చెలరేగగా, మొహమ్మద్ నయీమ్ (34 బంతుల్లో 33; 5 ఫోర్లు) రాణించాడు.

మ్యాచ్‌లు వాయిదా

ఢాకా: ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించిన వరల్డ్ ఎలెవన్, ఆసియా ఎలెవన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లకు కరోనా అడ్డంకిగా నిలిచింది. బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజీబుర్ రహమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఏర్పాటు చేసిన రెండు మ్యాచ్‌లు కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. ఈనెల 21, 22 తేదీల్లో జరగాల్సిన ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో అంతర్జాతీయ స్టార్లు విరాట్ కోహ్లి, మలింగ, గేల్ పాల్గొననుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే కరోనా సద్దుమణిగే వరకు ఈ రెండు మ్యాచ్‌ల్ని వాయిదా వేస్తున్నట్లు బీసీబీ అధ్యక్షుడు నజ్ముల్ హసన్ ప్రకటించారు. వేడుకల్లో భాగంగా షేర్ ఎ బంగ్లా జాతీయ స్టేడియంలో జరగాల్సిన ఏఆర్ రహమాన్ సంగీత విభావరి కూడా వాయిదా పడింది.

మనీశ్ కౌషిక్

ఒలింపిక్స్ బరిలో 'రికార్డు' పంచ్

టోక్యోకు మనీశ్ కౌశిక్ క్వాలిఫై

అమ్మాన్ (జోర్డాన్): భారత్ నుంచి రికార్డు స్థాయిలో మరో బాక్సర్ ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించాడు. ప్రపంచ కాంస్య పతక విజేత మనీశ్ కౌశిక్ (63 కేజీలు) తాజాగా 'టోక్యో' దారిలో పడ్డాడు. ఆసియా క్వాలిఫయర్స్ ఈవెంట్‌లో బుధవారం కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్, రెండో సీడ్ హరిసన్ గార్సిడ్ (ఆస్ట్రేలియా)పై 4–1తో గెలుపొందడం ద్వారా కౌశిక్‌కు ఒలింపిక్స్ బెర్తు ఖాయమైంది. ఇప్పటికే ఎనిమిది మంది బాక్సర్లు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. కౌశిక్‌తో ఆ జాబితా తొమ్మిదికి చేరింది. దీంతో ఈ సారి అత్యధిక బాక్సర్లు అర్హత సంపాదించినట్లయింది. గతంలో లండన్ ఒలింపిక్స్ (2012)లో భారత్ నుంచి 8 మంది పాల్గొన్నారు. ఇప్పుడీ రికార్డు 9 మందితో మెరుగైంది. 81 కేజీల కేటగిరీలో సచిన్ కుమార్ నిరాశపరిచాడు. అతను 0–5తో షబ్బాస్ నెగ్మతుల్లేవ్ (తజకిస్తాన్) చేతిలో కంగుతిన్నాడు.

సిమ్రన్‌కు రజతం

మహిళల 60 కేజీల ఫైనల్ బౌట్‌లో సిమ్రన్‌జిత్ కౌర్ పరాజయం చవిచూసింది. దీంతో ఆమె స్వర్ణావకాశం చేజారి రజతంతో సరిపెట్టుకుంది. తుదిపోరులో భారత బాక్సర్ 0–5తో దక్షిణ కొరియాకు చెందిన ఓహ్ యూన్ జీ చేతిలో పరాజయం పాలైంది. 69 కేజీల విభాగంలో వికాస్ క్రిషన్ కంటి గాయంతో స్వర్ణ పతక పోరు నుంచి తప్పుకున్నాడు. దీంతో అతను రజతంతో తృప్తి చెందాడు.

హారికకు నిరాశ

లుసానే: 'ఫిడే' మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నమెంట్‌లో ద్రోణవల్లి హారిక వెనుకబడింది. ఎనిమిదో రౌండ్ గేమ్‌లో హారిక 95 ఎత్తుల్లో అంటోనెటా స్టెఫనోవా (బల్గేరియా) చేతిలో ఓటమి పాలైంది. బుధవారం ఎలీనా (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకుంది. దీంతో తొమ్మిది రౌండ్ల తర్వాత 4.5 పాయింట్లతో హారిక ఏడో స్థానానికి పడిపోయింది.

అద్వానీ ఖాతాలో 34వ టైటిల్

అహ్మదాబాద్: దిగ్గజ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ ఖాతాలో మరో టైటిల్ చేరింది. జాతీయ 6–రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో అతను విజేతగా నిలిచాడు. దీంతో అతను సాధించిన జాతీయ టైటిళ్ల సంఖ్య 34కు చేరింది. బుధవారం జరిగిన టైటిల్ పోరులో 34 ఏళ్ల పంకజ్ అద్వానీ (7–3) 9–37, 30–2, 25–31, 22–31, 26–18, 57–4, 38–0, 45–35, 47–4, 36–8తో ఇష్‌ప్రీత్ సింగ్‌పై విజయం సాధించాడు.

శ్రీకాంత్ ఆట ముగిసె...

- సింధు ముందంజ
- ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రపంచ చాంపియన్, మాజీ నంబర్‌వన్ పూసర్ల వెంకట సింధు ముందంజ వేసింది. పురుషుల కేటగిరీలో శ్రీకాంత్ ఆట తొలి రౌండ్‌తోనే ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్ పోరులో స్టార్ షట్లర్, ఆరో సీడ్ సింధు 21–14, 21–17తో బీవెన్ జాంగ్ (అమెరికా)పై గెలుపొందింది. ఈ పోరులో సింధు నిలకడైన ఆటతీరు కనబరిచింది. ఆఖరి దాకా పైచేయి సాధించిన భారత స్టార్ వరుస గేముల్లో 42 నిమిషాల్లో ఈ ఆటను ముగించింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 15–21, 16–21తో చైనాకు చెందిన మూడో సీడ్ చెన్ లాంగ్ చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ మొదటి రౌండ్లో సిక్కిరెడ్డి–ప్రణవ్ జెర్రి చోప్రా ద్వయం 13–21, 21–11, 17–21తో చైనా టాప్ సీడ్ ద్వయం జెంగ్ సి వీ–హ్యూయంగ్ య కియోంగ్ చేతిలో పరాజయం పాలైంది. అయితే మహిళల డబుల్స్‌లో మాత్రం సిక్కి–అశ్విని పొన్నప్ప జంట ముందంజ వేసింది. భారత జోడీ 5–4తో ఆధిక్యంలో ఉన్న దశలో జెన్నీ మూర్–విక్టోరియా విలియమ్స్ (ఇంగ్లండ్) జంట రిటైర్డ్‌హర్ట్‌గా తప్పుకుంది.

గప్‌చుప్‌గా 'ఇండియా ఓపెన్'

స్టేడియంలో ప్రేక్షకులకు నో ఎంట్రీ!

న్యూఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ ఈవెంట్ అయిన 'ఇండియా ఓపెన్' సూపర్ 500 టోర్నమెంట్‌ను గప్‌చుప్‌గా నిర్వహించనున్నట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) తెలిపింది. కరోనా వైరస్ వల్లే ప్రేక్షకులను అనుమతించకుండా గేట్లను మూసివేసి నిర్వహిస్తామని బాయ్ వెల్లడించింది. అన్ని ముందుజాగ్రత్త చర్యలతో అనుకున్న షెడ్యూలు ప్రకారమే ఇండియా ఓపెన్ జరుగుతుందని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 24 నుంచి 29 వరకు న్యూఢిల్లీలో ఈ పోటీలు జరుగుతాయి. వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఇప్పటికే చైనా మాస్టర్స్ (ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1), జర్మన్ ఓపెన్ (మార్చి 3–8), వియత్నాం ఇంటర్నేషనల్ చాలెంజ్ (మార్చి 24–29), పోలిష్ ఓపెన్ (మార్చి 26 నుంచి 29) టోర్నీలను నిరవధికంగా వాయిదా వేశారు. ప్రపంచాన్ని వణికిస్తున్న ప్రాణాంతక వైరస్‌తో ఇప్పటికే 4000 మంది మృత్యువాత పడగా... లక్ష మందికి పైగా ఈ వైరస్ బారిన పడ్డారు.

ఐపీఎల్‌కు కరోనా దెబ్బ!

- టికెట్ల అమ్మకాలను నిలిపివేయించిన మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై: ప్రతిష్టాత్మక ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2020 నిర్వహణకు సంబంధించి ఒక్కసారిగా అనూహ్య రీతిలో సందేహాలు మొదలయ్యాయి. ముంబైలో కొత్తగా కరోనా పాజిటివ్ కేసులు బయటపడటంతో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. తాజా పరిస్థితుల్లో లీగ్ నిర్వహణ కష్టమని మహారాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో తమ రాష్ట్రంలో అధికారికంగా ఐపీఎల్ టికెట్ల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29న ముంబైలోనే డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో లీగ్ మొదలు కావాల్సి ఉంది. 'కరోనా సమస్యను ఎదుర్కొనేందుకు ఎక్కువ మంది ప్రజలు గుమిగూడకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర కేబినెట్ చర్చించింది. ఇందులో ఐపీఎల్ గురించి కూడా మాట్లాడాం. ప్రభుత్వం ముందు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి ఐపీఎల్‌ను వాయిదా వేయడం లేదా మ్యాచ్‌లు జరిగినా ప్రేక్షకులను అనుమతించకుండా టీవీలకే పరిమితం చేయడం మరొకటి' అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి రాజేశ్ తోపే వెల్లడించారు. దీనిపై తుది నిర్ణయం ఒకటి, రెండు రోజుల్లో వెలువడవచ్చు. మరో వైపు మహారాష్ట్ర తరహాలోనే కర్ణాటక ప్రభుత్వం కూడా ఆలోచిస్తోంది.

బెంగాల్ ఎదురీత

- తొలి ఇన్నింగ్స్‌లో 134/3
- ఇంకా 291 పరుగుల వెనుకంజ
- సౌరాష్ట్ర 425 ఆలౌట్
- రంజీ ట్రోఫీ ఫైనల్

రాజ్‌కోట్: తొలి సారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచే క్రమంలో సౌరాష్ట్ర ఫైనల్ మ్యాచ్‌పై పట్టు బిగించింది. మ్యాచ్ మూడో రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి బెంగాల్ ఎదురీదుతోంది. టాపార్డర్ బ్యాట్స్‌మన్ సుదీప్ చటర్జీ (145 బంతుల్లో 47 బ్యాటింగ్; 5 ఫోర్లు) పట్టుదలగా క్రీజ్‌లో నిలిచాడు. దీంతో బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. సుదీప్‌తో పాటు వృద్ధిమాన్ సాహా (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకు ముందు 384/8 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన సౌరాష్ట్ర 425 పరుగుల వద్ద ఆలౌటైంది.

ఆడుకున్న చటర్జీ, తివారీ...

అనంతరం తొలి ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టిన బెంగాల్ కుదురుకుంటున్న దశలో ఎదురు దెబ్బలతో డీలాపడింది. ఓపెనర్లు సుదీప్ కుమార్ (26; 4 ఫోర్లు), అభిమన్యు ఈశ్వరన్ (9; 1 ఫోర్) నింపాదిగా ఆడారు. జట్టు స్కోరు 35 పరుగులకు చేరాక... అదేస్కోరు వద్ద వాళ్లిద్దరు ఔటయ్యారు. సుదీప్‌ను ధర్మేంద్రసింగ్, ఈశ్వరన్‌ను ప్రేరక్ మన్కడ్ పెవిలియన్ చేర్చారు. తర్వాత సుదీప్ చటర్జీ, వెటరన్ బ్యాట్స్‌మన్ మనోజ్ తివారీ (116 బంతుల్లో 35; 2 ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. ఎట్టకేలకు చిరాగ్ జానీ ఈ జోడీని విడగొట్టగలిగాడు. అనుభవజ్ఞుడైన తివారీని అతను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో 89 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వృద్ధిమాన్ సాహా క్రీజులోకి వచ్చాడు. మరో వికెట్ పడకుండా సాహా, చటర్జీ జాగ్రత్తగా ఆడారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలివుండగా... బెంగాల్ 291 పరుగుల వెనుకంజలోనే ఉంది. చటర్జీ, సాహాలతో పాటు ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్ అనుస్తుప్ మజుందార్ ప్రదర్శనపై బెంగాల్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

మనోజ్ తివారీని అవుట్ చేసిన చిరాగ్ జానీని అభినందిస్తున్న సహచరులు

సాక్షి బిజినెస్
గురువారం
12-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
62	7
35,697	10,458

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,990	354
డోజోన్స్	23,823	1195
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,877	84
డాక్స్	10,438	37
షాంఘై	2,969	28
నికాయ్	19,416	451

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	73.15	74.80
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	93.96	97.24
€	యూరో	ఎస్‌బీఐ	82.37	85.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	69.44	72.06
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.07	49.26
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	52.32	54.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.59	20.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.72	20.95
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.46	11.23

ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌కు చెల్లు..

- ఇకపై ఎటువంటి చార్జీలు ఉండవు...
- ఎస్ఎంఎస్ చార్జీలూ ఎత్తివేత
- ఖాతాదారులకు ఎస్‌బీఐ శుభవార్త
- సేవింగ్స్ బ్యాంకుపై 3 శాతమే వడ్డీ

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ ఖాతాదారులకు పెద్ద ఉపశమనం లభించింది. ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంచాలన్న నిబంధనను ఎత్తివేస్తున్నట్టు బ్యాంకు ప్రకటించింది. ప్రస్తుతానికి గ్రామీణ శాఖల నుంచి పట్టణ శాఖల వరకు సేవింగ్స్ బ్యాంకు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ రూ.1,000-3,000 మధ్య ఉన్నది. అంటే ఈ మేరకు ఖాతాదారులు నెలవారీగా కనీస బ్యాలెన్స్‌ను తప్పకుండా నిర్వహించాల్సి ఉంటుంది. లేదంటే ప్రస్తుతం రూ.5-15 మధ్య చార్జీ, దానిపై పన్నులను ఎస్‌బీఐ విధిస్తోంది. తాజాగా కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేస్తూ 44.51 కోట్ల సేవింగ్స్ బ్యాంకు ఖాతాదారులకు ఎస్‌బీఐ తీపి కబురందించింది. ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ లేపోతే చార్జీలు విధించడాన్ని 2017 ఏప్రిల్‌లో ఎస్‌బీఐ అమల్లోకి తెచ్చింది. తొలుత భారీ చార్జీలు బాదగా, గతేడాది అక్టోబర్‌లో వీటిని గణనీయంగా తగ్గించి ఇప్పుడు పూర్తిగా తొలగించింది. ఎస్‌బీఐ బాటలో ఇతర ప్రభుత్వరంగ బ్యాంకులు నడుస్తాయేమో చూడాల్సి ఉంది. అలాగే, ఎస్‌బీఐ చార్జీలను కూడా ఎస్‌బీఐ తొలగించింది. లావాదేవీల వివరాలను ఎస్ఎంఎస్ రూపంలో అందిస్తూ, ఇందుకోసం త్రైమాసికం వారీగా ప్రస్తుతం బ్యాంకు చార్జీలను తీసుకుంటోంది. తాజా నిర్ణయాలు దేశంలో ఆర్థిక సేవల విస్తృతికి తోడ్పడతాయని ఎస్‌బీఐ పేర్కొంది.

''ఈ ప్రకటన మా విలువైన కస్టమర్లకు ఆనందాన్నిస్తుంది. ఎస్‌బీఐతో బ్యాంకింగ్ దిశగా కస్టమర్లు ఉత్సాహం చూపించేలా, వారిలో విశ్వాసాన్ని పెంపొందించేలా చేస్తుందని నమ్ముతున్నాం'' అంటూ ఎస్‌బీఐ ఓ ప్రకటన విడుదల చేసింది.

సేవింగ్స్ బ్యాంకుపై 3 శాతం వడ్డీ...

ఇకపై అన్ని రకాల సేవింగ్స్ ఖాతా(ఎస్‌బీ) బ్యాలెన్స్‌లపై 3 శాతం వార్షిక వడ్డీ రేటు అమలవుతుందని ఎస్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఎస్‌బీ ఖాతాలో రూ. లక్ష వరకు బ్యాలెన్స్ ఉంటే 3.25 శాతం, రూ.లక్షకు పైన బ్యాలెన్స్ ఉంటే 3 శాతం రేటును ఆఫర్ చేస్తోంది. కానీ, ఇకపై అన్నింటికీ 3 శాతం రేటు మాత్రమే అమలవుతుంది. ఆస్తులు, డిపాజిట్లు, శాఖలు, కస్టమర్లు, ఉద్యోగులు ఇలా ఎన్నో అంశాల్లో ఎస్‌బీఐ అగ్రగామి బ్యాంకుగా ఉంది.

ఎఫ్‌డీ, రుణ రేట్లకు కోత

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలపై రేట్లను తగ్గిస్తూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ తగ్గింపు ఈ నెల 10 నుంచే అమల్లోకి వచ్చింది. రూ.2 కోట్లలోపు గల రిటైల్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 10 నుంచి 50 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. దీంతో 7-45 రోజుల ఎఫ్‌డీలపై రేటు 4.50% నుంచి 4%కి తగ్గింది. ఏడాది, అంతకంటే ఎక్కువ కాల వ్యవధి ఎఫ్‌డీపై రేటు 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. అలాగే, ఏడాది కాల ఎంసీఎల్ఆర్ రేటును 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 7.85 శాతం నుంచి 7.75%కి దిగొచ్చింది. దీనివల్ల గృహ, వాహన రుణాలు చౌక కానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్ రేటును తగ్గించడం ఇది పదోసారి. అలాగే, ఎఫ్‌డీ రేట్లను తగ్గించడం నెల వ్యవధిలో రెండోసారి.

పునరుద్ధరణ ప్రణాళిక 'యస్'!

ఈక్విటీ, డెట్ మార్గాల్లో నిధులు • బ్యాంకుల నుంచి రూ. 20 వేల కోట్ల ఈక్విటీ! సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్‌లోకి రూ. 30,000 కోట్లు • ఈడీ కస్టడీలోనే రాణా

ముంబై: సంక్షోభంలో చిక్కుకున్న యస్ బ్యాంక్‌ను పునరుద్ధరించే ప్రణాళికను రిజర్వ్ బ్యాంక్ ఖరారు చేసింది. మారటోరియం ఎత్తివేసినా నిధుల లభ్యత పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు పరిష్కారమార్గాలు ఇందులో పొందుపర్చింది. ప్రణాళిక ప్రకారం.. ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తిగా ఉన్న ప్రభుత్వ రంగ ఎస్‌బీఐతో పాటు ఇతరత్రా బ్యాంకుల నుంచి తుది మాట తీసుకున్నాక.. ఆర్‌బీఐ ముందుగా ఒక ప్రకటన చేయనుంది. ప్రకటన వచ్చిన రెండో రోజున బ్యాంకులు దాదాపు రూ. 20,000 కోట్ల నిధులను ఈక్విటీ కింద సమకూరుస్తాయి. మూడో రోజున ప్రభుత్వ రంగ బ్యాంకులు... సుమారు రూ. 30,000 కోట్ల మొత్తాన్ని యస్ బ్యాంక్ సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్ (సీడీ)లో ఇన్వెస్ట్ చేస్తాయి. నాలుగో రోజున మారటోరియం తొలగిస్తారు. ఇన్వెస్ట్ చేస్తున్న బ్యాంకుల నుంచి హామీ వచ్చాక ఆర్‌బీఐ సత్వరమే ప్రణాళికను ప్రకటించనుంది.

ప్రైవేట్ బ్యాంకులు కూడా రంగంలోకి..

ఎస్‌బీఐతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రైవేట్ దిగ్గజాలు కూడా యస్ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతిపాదనలు ఉన్నాయి. తద్వారా యస్ బ్యాంకు సామర్థ్యంపై నమ్మకం పెరిగి, ఇతర బ్యాంకులు కూడా ఇన్వెస్ట్ చేయడానికి ముందుకు రావచ్చని భావిస్తున్నారు. యస్ బ్యాంక్ సీడీల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు చేసే పెట్టుబడులు.. వాటి ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోల్లో భాగంగా మారతాయి. కొత్తగా జారీ చేసే ఈక్విటీలో రూ. 20,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే బ్యాంకులకు యస్ బ్యాంకులో 75 శాతం వాటాలు దక్కుతాయి. షేర్ల పరిమాణం భారీగా పెరగడంతో ప్రస్తుతమున్న షేర్‌హోల్డర్ల వాటా నాలుగో వంతుకు తగ్గుతుంది. మొండిబాకీలు, నిధుల కొరత, గవర్నెన్స్ లోపాలతో సంక్షోభంలో చిక్కుకున్న యస్ బ్యాంక్‌ను పునరుద్ధరించే క్రమంలో ఆర్‌బీఐ మారటోరియం విధించడం, బ్యాంక్ బోర్డును రద్దు చేయడం తెలిసిందే.

ఇన్‌వార్డ్ ఆర్‌టీజీఎస్ సేవల పునరుద్ధరణ..

ఇన్‌వార్డ్ ఆర్‌టీజీఎస్ సేవలను కూడా యస్ బ్యాంక్ పునరుద్ధరించింది. దీంతో యస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు, క్రెడిట్ కార్డులకు సంబంధించి రూ. 2 లక్షలకు పైగా జరపాల్సిన చెల్లింపులను ఇతర బ్యాంకు ఖాతాల నుంచి చెల్లించవచ్చని బ్యాంక్ తెలిపింది. తమ బ్యాంకులో కరెంటు ఖాతాలున్న సంస్థలు.. ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించడంలో ఎలాంటి సమస్యలు ఉండబోవని వివరించింది. అయితే మారటోరియం ఎత్తివేసే దాకా యస్ బ్యాంక్ ఖాతాల నుంచి ఇతరత్రా ఆన్‌లైన్‌లో జరపాల్సిన చెల్లింపులపై ఆంక్షలు కొనసాగుతాయని పేర్కొంది. మరోవైపు, మార్చి 14న (శనివారం) ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు యస్ బ్యాంక్ తెలియజేసింది.

షేరు జూమ్..
పునరుద్ధరణ ప్రణాళిక వార్తలతో బుధవారం యస్ బ్యాంక్ షేరు బిఎస్ఈలో ఏకంగా 35 శాతం పెరిగి రూ. 28.80 వద్ద క్లోజయ్యింది.

రుణాలివ్వాలంటూ కపూర్ ఒత్తిళ్లు: రవ్‌నీత్ గిల్

యస్ బ్యాంక్‌లో కీలక హోదా నుంచి రిజర్వ్ బ్యాంక్ తప్పించినా వ్యవస్థాపకుడు రాణా కపూర్ పలు మార్లు తన మాట నెగ్గించుకునే ప్రయత్నాలు చేశారు. నిష్క్రమణ తర్వాత కూడా అనేక కార్పొరేట్ సంస్థలకు భారీగా రుణాలిచ్చేలా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో యస్ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో రవ్‌నీత్ గిల్ ఈ విషయాలు వెల్లడించినట్లు సమాచారం. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్ఎఫ్ఎల్) మాత్రమే కాకుండా ఇతరత్రా కంపెనీలకు కూడా యస్ బ్యాంక్ ఇచ్చిన రుణాల గురించి ప్రశ్నించేందుకు ఈడీ ఆయన్ను పిలిపించింది. ఈ సందర్భంగా కపూర్ ఒత్తిళ్ల గురించి గిల్ చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వివిధ సంస్థలకు యస్ బ్యాంక్ జారీ చేసిన రుణాలకు ప్రతిగా కపూర్, ఆయన కుటుంబానికి దాదాపు రూ. 4,500 కోట్ల ముడుపులు లభించాయని ఆరోపణలు ఉన్నాయి.

యస్ బ్యాంక్ ఖాతాలపై ఐసీఏఐ సమీక్ష..

2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి యస్ బ్యాంక్ ఆర్థిక ఫలితాలను తమ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డు (ఎఫ్ఆర్ఆర్‌బీ) సమీక్షించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తెలిపింది. ఒక వేళ ఏవైనా అవకతవకలు ఉన్నాయని తేలిన పక్షంలో ఆడిటర్లపై చర్యలు తీసుకునేలా డైరెక్టరుకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొంది. ఇక, అన్‌సెక్యూర్డ్ పెట్టుబడుల రద్దు విషయానికొస్తే.. ముందుగా ఈక్విటీ ఇన్వెస్టర్లు, ప్రిఫరెన్స్ షేర్‌హోల్డర్ల తర్వాతే అదనపు టియర్ 1 బాండ్ల విషయం పరిశీలించాలని సెబీ, ఆర్‌బీఐలను కోరినట్లు మ్యూచువల్ ఫండ్స్ సమాఖ్య యాంఫీ సీఈవో ఎన్ఎస్ వెంకటేష్ తెలిపారు.

రుణాలు పూర్తిగా చెల్లిస్తాం: అడాగ్

వ్యాపార అవసరాల కోసం యస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలన్నింటికీ పూర్తి పూచీకత్తు ఉందని, మొత్తం చెల్లించేస్తామని అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్(అడాగ్) వెల్లడించింది. రాణా కపూర్, ఆయన కుటుంబసభ్యులతో ఎలాంటి లావాదేవీలు లేవని తెలిపింది. అడాగ్‌లో భాగమైన తొమ్మిది సంస్థలు యస్ బ్యాంక్‌కు రూ. 12,800 కోట్ల దాకా రుణాలు చెల్లించాల్సి ఉంది.



మిషన్ కపూర్..

రాణా కపూర్ అరెస్టు, యస్ బ్యాంక్‌ను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఎస్‌బీఐని రంగంలోకి దింపడం తదితర పరిణామాల వెనుక చాలా వ్యవహారమే నడిచింది. ఓవైపు యస్ బ్యాంక్ సంక్షోభం నుంచి బైటపడటం కోసం నిధులు సమీకరించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే.. మరోవైపు స్వయంగా వ్యవస్థాపకుడు రాణా కపూరే వాటికి గండి కొడుతూ వచ్చారు. ప్రయత్నాలన్నీ విఫలమైతే ఆర్‌బీఐ చివరికి మళ్లీ తననే పిలిచి బాధ్యతలు అప్పగిస్తుందనే ఆశతో ఆయన ఇదంతా చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ఇన్వెస్టర్లంతా ఆఖరు దశలో తప్పుకుంటూ ఉండటంపై సందేహం వచ్చిన ఆర్‌బీఐ కూపీ లాగితే ఈ విషయాలు వెల్లడయ్యాయి. సంబంధిత వర్గాల కథనం ప్రకారం .. డీల్ కుదుర్చుకునేందుకు వచ్చిన ఇన్వెస్టర్ల దగ్గరకు కపూర్ అనుయాయులు వెళ్లి, ఏదో రకంగా దాన్ని చెడగొట్టేవారు. ఇదంతా గ్రహించిన ఆర్‌బీఐ .. యస్ బ్యాంక్‌ను మళ్లీ ఆయనకే అప్పగించేందుకు తాము సానుకూలంగా ఉన్నట్లుగా సంకేతాలు పంపి లండన్ నుంచి భారత్ రప్పించింది. ఆయన రాగానే వివిధ దర్యాప్తు ఏజెన్సీలు కపూర్‌పై అనుక్షణం నిఘా పెట్టాయి.

కానీ ఆర్‌బీఐ, ప్రభుత్వం ఉద్దేశాలు కనిపెట్టిన కపూర్ మళ్లీ లండన్ వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు అధికారులకు తెలిసింది. దీంతో ముందు కపూర్‌ను అరెస్ట్ చేయాలా లేక బ్యాంకు పునర్‌వ్యవస్థీకరణపై దృష్టి పెట్టాలా? అన్న మీమాంస తలెత్తింది. కపూర్‌ను అరెస్ట్ చేసిన పక్షంలో బ్యాంక్‌పై కస్టమర్ల నమ్మకం సడలి.. ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి తలెత్తే ముప్పుందని ప్రభుత్వం ఆలోచనలో పడింది. చివరికి సమయం మించిపోతుండటంతో.. ధైర్యం చేసి అన్ని చర్యలు ఒకేసారి తీసుకుంది. బ్యాంకుపై మారటోరియం, పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికల ప్రకటనతో పాటు కపూర్‌ను అరెస్ట్ కూడా చేశారు.

ఈనెల 16 దాకా ఈడీ కస్టడీలో కపూర్..

యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్ .. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీని మరో అయిదు రోజులు పొడిగిస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రత్యేక కోర్టు ఆదేశాలిచ్చింది. మూడు రోజుల కస్టడీ అనంతరం బుధవారం ఈడీ ఆయన్ను కోర్టులో హాజరుపర్చింది. విచారణ సందర్భంగా మార్చి 16 దాకా కస్టడీని పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది.

భారత్‌లో తొలి ఎలక్ట్రిక్ ట్రాక్టర్

రూపొందించిన సెలెస్ట్రియల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో తొలి ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సెలెస్ట్రియల్ ఈ-మొబిలిటీ రూపొందించింది. వినియోగానికి వీలున్న నమూనాను బుధవారమిక్కడ ఆవిష్కరించింది. ఉద్యానవనాలు, విమానాశ్రయాలు, ఫ్యాక్టరీలు, గిడ్డంగుల్లో సరుకు రవాణాకు వీలుగా 6 హెచ్‌పీ సామర్థ్యంతో తయారు చేశారు. 21 హెచ్‌పీ డీజిల్ ట్రాక్టరుకు సమానంగా ఇది పని చేస్తుందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు సిద్ధార్థ దురైరాజన్ మీడియాకు తెలిపారు. 'ధర రూ.5 లక్షల లోపు ఉంటుంది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ కూడా అందుకోవచ్చు. డీజిల్ ట్రాక్టరుతో గంటకు రూ.150 ఖర్చు వస్తే, దీనికి రూ.20-35 మధ్య ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 75 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వేగం గంటకు 20 కిలోమీటర్లు. 5-8 ఏళ్లు బ్యాటరీ మన్నికగా ఉంటుంది. నెలకు 100 ట్రాక్టర్ల తయారీ సామర్థ్యంతో బాలానగర్‌లో ఫ్యాక్టరీ ఉంది. రూ.60 కోట్ల దాకా నిధులు సమీకరించనున్నాం' అని వివరించారు.

ఎకానమీకి కరోనా కాటు..

ముంబై: దేశీయంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎకానమీకి గట్టి దెబ్బే తగలనుంది. వైరస్ వ్యాప్తిని నివారించేందుకు సామూహిక క్వారంటైన్ వంటి ముందుజాగ్రత్త చర్యలతో ఆర్థిక వృద్ధిపై 2% మేర ప్రతికూల ప్రభావం పడవచ్చని బ్రిటీష్ బ్రోకరేజి సంస్థ బార్‌క్లేస్ హెచ్చరించింది. ప్రజలు బైట తిరగడాన్ని తగ్గించుకోవడం, వినియోగ వ్యయాలు.. పెట్టుబడులు.. సేవా రంగ కార్యకలాపాలు తగ్గిపోవడం వంటివి వృద్ధి సాధనకు రిస్కులుగా పరిణమించగలవని పేర్కొంది. అయితే, ముడిచమురు ధరల పతనంతో దిగుమతుల భారం తగ్గడమనేది.. జీడీపీ వృద్ధికి కనీసం 0.50% దాకానైనా దోహదపడగలదని వివరించింది. భారత వృద్ధి రేటు అంచనాలను బార్‌క్లేస్ ఇటీవలే 6.5 శాతం నుంచి 5.6 శాతానికి కుదించింది.

కోలుకున్న రూపాయి

ముంబై: అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ బుధవారం కోలుకుంది. ఫారెక్స్ మార్కెట్లో 49 పైసలు బలపడి 73.68 వద్ద ముగిసింది. దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల్లోకి చేరుకోవడం, యూఎస్ డాలర్ విలువ బలహీనపడడం వంటి సానుకూల అంశాలు రూపాయి విలువకు బలాన్నిచ్చాయి. కరోనా వైరస్ (కోవిడ్-19) దెబ్బకు ఈనెల 9న ఏకంగా 17 నెలల కనిష్టస్థాయికి పతనమై 74.17 వద్దకు క్షీణించిన మారకం విలువ.. కరెన్సీ మార్కెట్లో ఒడిదుడుకులను తగ్గించడానికి ఆర్‌బీఐ జోక్యం చేసుకోవచ్చనే అంచనాల నేపథ్యంలో మరోసారి బలాన్ని పుంజుకుందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విభాగం సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది విశ్లేషించారు.

మల్కాపూర్‌లో ఐఓసీ భారీ టెర్మినల్

- రూ.611 కోట్ల పెట్టుబడులతో 70 ఎకరాల్లో నిర్మాణం
- 18 నెలల్లో పూర్తి; 1.80 లక్షల కిలో లీటర్ల సామర్థ్యం
- రూ.36 కోట్లతో చర్లపల్లి ఎల్‌పీజీ ప్లాంట్ విస్తరణ కూడా..
- ఇండియన్ ఆయిల్ ఈడీ శ్రవణ్ ఎస్ రావు వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) రూ.3,800 కోట్ల పెట్టుబడులతో చేపడుతున్న పారదీప్ - హైదరాబాద్ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డీఈఎఫ్) పైప్‌లైన్ ప్రాజెక్ట్ తుది దశకు చేరుకుంది. ఈ పైప్‌లైన్‌కు అనుసంధానిస్తూ కొత్తగా నల్లగొండ జిల్లా మల్కాపూర్‌లో భారీ డీఈఎఫ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తోంది. రూ.611 కోట్ల పెట్టుబడులతో సుమారు 70 ఎకరాల్లో దీని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని,

సమావేశంలో మాట్లాడుతున్న ఐఓసీఎల్ ఈడీ శ్రవణ్ ఎస్ రావు

ఏడాదిన్నరలో అందుబాటులోకి వస్తుందని ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హెడ్ శ్రవణ్ ఎస్ రావు తెలిపారు. ''ఈ టెర్మినల్‌లో పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ వంటి అన్ని రకాల పెట్రోలియం ఉత్పత్తులు నిల్వ ఉంటాయి. దీని సామర్థ్యం 1.80 లక్షల కిలో లీటర్లు. ఒరిస్సాలోని పారాదీప్ రిఫైనరీ నుంచి విశాఖపట్నం, అచ్యుతాపురం, రాజమండ్రి, విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు 1,200 కి.మీ. మేర డీఈఎఫ్ పైప్‌లైన్ ఉంటుందని'' ఆయన వివరించారు. తెలంగాణలో విస్తరణ ప్రణాళికల మీద బుధవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

36 కోట్లతో ఎల్‌పీజీ ప్లాంట్ విస్తరణ..

ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ మార్కెట్లో 39 శాతం మార్కెట్ వాటాతో ఐఓసీఎల్ మార్కెట్ లీడర్‌గా ఉంది. ప్రస్తుతం ఐఓసీఎల్‌కు చర్లపల్లిలో పెట్రోలియం టెర్మినల్, రామగుండంలో బల్క్ డిపోలు, చర్లపల్లి, తిమ్మాపూర్‌లో ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్లున్నాయి. ఈ ప్లాంట్ల ఎల్‌పీజీ వార్షిక సామర్థ్యం 4100 మెట్రిక్ టన్నులు. రాష్ట్రంలో ఎల్‌పీజీ డిమాండ్ పెరుగుదల నేపథ్యంలో చర్లపల్లిలోని ఎల్‌పీజీ ప్లాంట్‌ను రూ.36 కోట్లతో విస్తరించనున్నామని తెలిపారు. దీంతో అదనంగా 2400 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ కెపాసిటీ చేరుతుందని ఆయన పేర్కొన్నారు.

కొత్తగా సీఎన్‌జీ స్టేషన్లు..

ప్రస్తుతం తెలంగాణలో ఐఓసీఎల్‌కు 1,100 రిటైల్ ఔట్‌లెట్లున్నాయి. 345 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. తెలంగాణలో 1.08 కోట్ల మంది ఎల్‌పీజీ కస్టమర్లుంటే వీటిలో 44 లక్షల మంది ఇండియన్ గ్యాస్ కస్టమర్లే. ఇటీవలే కొత్తగా 1,478 రిటైల్ ఔట్‌లెట్లకు దరఖాస్తులను ఆహ్వానించాం. ఇందులో 52 ఔట్‌లెట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే మిగిలినవి పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 13 సీఎన్‌జీ స్టేషన్స్ ఉన్నాయి. కొత్తగా జగిత్యాల్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా జిల్లాల్లో రానున్నాయి.

ఏప్రిల్ 1 నుంచి బీఎస్-6 ఇంధనమే..

ఏప్రిల్ 1 నుంచి తెలంగాణలోని అన్ని ఐఓసీఎల్ పెట్రోల్ బంక్‌ల్లో కేవలం భారత్ స్టేజ్ (బీఎస్)-6 పెట్రోల్, డీజిల్ మాత్రమే అందుబాటులో ఉంటుందని, దీన్ని బీఎస్-4 వాహనాలకు సైతం వినియోగించవచ్చని శ్రవణ్ తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఎన్‌సీఆర్, ఆగ్రా నగరాల్లో కేవలం బీఎస్-6 ఇంధనాలను మాత్రమే సరఫరా చేస్తుంది. బీఎస్-6 ఇంధనం అల్ట్రా క్లీన్, నాణ్యత ప్రమాణాలను కలిగి ఉంటుందని.. దీంతో కార్బన్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి విష వాయువుల విడుదల ఉండవని ఆయన తెలిపారు. బీఎస్-4లో సల్ఫర్ 50 పీపీఎంగా ఉంటే.. బీఎస్-6లో 10 పీపీఎంగా ఉంటుందని పేర్కొన్నారు.

అస్థిరతల్లోనూ చెదరని విశ్వాసం

- ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.10,730 కోట్ల ప్రవాహం
- 11 నెలల గరిష్ట స్థాయికి
- ఫిబ్రవరి నెల గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: కరోనా వైరస్ ప్రభావంతో ఈక్విటీ మార్కెట్లు అమ్మకాల వల్ల కుదేలవుతుంటే.. పెట్టుబడులకు ఇది చక్కని సమయమని భావించే ధోరణి ఇన్వెస్టర్లలో పెరుగుతోంది. ఇన్వెస్టర్ల పరిణతిని ప్రతిఫలించే విధంగా ఫిబ్రవరి మాసంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి నికరంగా రూ.10,730 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదే విధంగా మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నుంచి (అన్ని రకాల పథకాల్లో) మొత్తం మీద రూ.1,985 కోట్ల పెట్టుబడులు ఫిబ్రవరిలో బయటకు వెళ్లిపోయాయి. జనవరిలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.1.2 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక జనవరిలో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.7,547 కోట్లు. దీంతో పోలిస్తే ఫిబ్రవరి నెలలో పెట్టుబడులు రాక నికరంగా 42 శాతం పెరిగి రూ.10,730 కోట్లుగా ఉంది. 2019 మార్చిలో రూ.11,756 కోట్ల పెట్టుబడుల తర్వాత ఒక నెలలో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన అత్యధిక పెట్టుబడులు మళ్లీ ఫిబ్రవరిలోనే కావడం గమనార్హం. కరోనా వైరస్ అంతర్జాతీయంగా వేగంగా విస్తరిస్తుండడంతో మన ఈక్విటీ మార్కెట్లు నెల వ్యవధిలోనే 15 శాతం వరకు నష్టపోయిన విషయం తెలిసిందే.

ముఖ్య గణాంకాలు..

- సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్/క్రమానుగత పెట్టుబడుల విధానం) రూపంలో వచ్చిన పెట్టుబడులు రూ.8,513 కోట్లు.
- మల్టీక్యాప్ పథకాల్లోకి రూ.1,625 కోట్లు, లార్జ్ క్యాప్ పథకాల్లోకి రూ.1,607 కోట్లు, మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,451 కోట్లు, స్మాల్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,498 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు పెట్టుబడులు కుమ్మరించారు.
- ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.871 కోట్లుగా ఉన్నాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లు నికరంగా రూ.1,483 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అంతక్రితం నెలలో వచ్చిన రూ.202 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగాయి. ఈక్విటీల్లో అనిశ్చితితో బంగారం ర్యాలీ చేస్తుండడం తెలిసిందే. దీంతో వరుసగా నాలుగో నెలలోనూ పెరుగుదల నమోదైంది.
- ఫిబ్రవరి నాటికి మ్యూచువల్ ఫండ్స్ పరిశ

పోలారం.. పచ్చలహారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం పోలారంలో పచ్చదనం పరుచుకుంది. కనుచూపు మేరలో పంట పొలాలు చూడ చక్కగా కనిపిస్తున్నాయి. చుట్టూ ఎత్తయిన కొండలు.. మధ్యలో పొడవైన తాటి చెట్లు.. పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్న దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. - దశరథ్ రజువా, సాక్షి ఫొటో జర్నలిస్టు, భద్రాద్రి కొత్తగూడెం

ఆర్థిక లావాదేవీలతోనే హత్య

ఖమ్మం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ముగ్గురు.. నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు
- నిందితుల నుంచి క్వాలిస్ వాహనం, రెండు కత్తులు స్వాధీనం
- మీడియా సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వెల్లడి

హన్మకొండలో బుధవారం కేసు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి. చిత్రంలో నిందితులు (ముసుగు ధరించిన వారు)

సాక్షి ప్రతినిధి, వరంగల్/కాజీపేట అర్బన్/భూపాలపల్లి: ఖమ్మం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనంద్‌రెడ్డి హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. బుధవారం హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేశామని, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి కోసం నాలుగు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. నిందితుల నుంచి ఒక వాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. అదనపు డీసీపీ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం ఖమ్మం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనంద్ రెడ్డికి, కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన పింగిళి ప్రదీప్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా స్నేహంగా మారింది. ప్రదీప్‌రెడ్డి మహారాష్ట్రలో గోదావరి అవతల ఇసుక క్వారీ నడిపిస్తున్నాడు, ఈ క్రమంలో ఆనంద్‌రెడ్డి ఇసుక వ్యాపారం నిమిత్తం డబ్బులు వెచ్చించాడు. తిరిగి డబ్బులు చెల్లించాలని ఇటీవల ప్రదీప్‌రెడ్డిపై ఒత్తిడి పెంచాడు. దీంతో ఈనెల 7వ తేదీన ఆనంద్‌రెడ్డిని హన్మకొండలోని అశోకా హోటల్‌కు పిలిపించిన ప్రదీప్‌రెడ్డి.. తాను తీసుకున్న డబ్బులకు సరిపోయే భూపాలపల్లిలోని తన భూమిని రాసి ఇస్తానని నమ్మబలికాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో హన్మకొండలోని ఓ హోటల్ నుంచి ప్రదీప్‌రెడ్డి, డ్రైవర్ రమేష్, మిత్రుడు విక్రమ్‌రెడ్డి లు వెంగళ్ రావు పేరిట ఉన్న ఇన్నోవా వాహనంలో ఆనంద్‌రెడ్డిని వెనుక సీటులో కూర్చోబెట్టి బయలుదేరారు.

మర్డర్ చేసేదుంది.. రెడీగా ఉండండి

'ఆనంద్‌రెడ్డిని భూపాలపల్లికి తీసుకొస్తున్నా.. మర్డర్ చేసేది ఉంది మీరు రెడీగా ఉండండి'అంటూ ఇసుక క్వారీలో పని చేసే వెంగళ శివరామ కృష్ణ, మీనుగు మధుకర్, నిగ్గల శంకర్‌లకు ప్రదీప్‌రెడ్డి సమాచారం అందించాడు. కొంత దూరం వెళ్లాక ప్రదీప్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రమేష్‌లు వెనుక కూర్చున్న ఆనంద్‌రెడ్డి నోటికి ప్లాస్టర్ వేసి వెనుకకు చేతులు కట్టేసి ఉంచారు. మధ్యాహ్నం 3.30 నిమిషాలకు వీరి వాహనం భూపాలపల్లి అడవుల్లోని రామారంకు చేరుకోగానే.. వాహనం ఆగిన వెంటనే శివరామకృష్ణ, శంకర్, మధుకర్‌లు ఆనంద్‌రెడ్డిని కింద పడేశారు. తమ వెంట తెచ్చుకున్న రెండు కత్తులతో కడుపు, గొంతులో పాశవికంగా పొడిచి దారుణంగా హత్య చేశారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

కాగా, ఆనంద్‌రెడ్డి ఆచూకీ కోసం ఏర్పాటు చేసిన నాలుగు ప్రత్యేక బృందాలు హన్మకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా క్వాలిస్ వాహనంలో తారస పడిన శివరామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా హత్య చేసింది తామేనని అంగీకరించాడని అడిషనల్ డీసీపీ తెలిపారు. దీంతో ఈ కేసుకు సంబంధం ఉన్న శివరామకృష్ణతో పాటు మధుకర్, శంకర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. క్వాలిస్ వాహనం, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు పింగిళి ప్రదీప్‌రెడ్డి సహా నిగ్గల రమేష్, విక్రమ్‌రెడ్డిలు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వీరు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఉన్నారనే సమాచారం మేరకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. విలేకరుల సమావేశంలో హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ దయాకర్ పాల్గొన్నారు.

ఖమ్మం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆనంద్‌రెడ్డి హత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ పింగిళి ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సామాజిక మాధ్యమంలో ఆయన ఆడియో టేపును పోస్టు చేశారు. తన 24 ఏళ్ల సర్వీసులో నిజాయితీగా పని చేశానని, ఏ చిన్న తప్పు కూడా చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఆనంద్‌రెడ్డి హత్య కేసులో తన పేరు రావడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రుల సాక్షిగా చెబుతున్నానని.. దయచేసి నా పరువు తీయవద్దని వేడుకున్నారు.

నాకు ఎలాంటి సంబంధం లేదు:
ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌రెడ్డి

ప్రశాంత్ రెడ్డి ప్రమేయంపై సమాచారం లేదు

ఆనంద్‌రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ప్రదీప్‌రెడ్డి సోదరుడు, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌రెడ్డి ప్రమేయంపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని అదనపు డీసీపీ స్పష్టం చేశారు. ఇప్పటికే విచారణ ప్రారంభించామని, ఒకవేళ ఆయన ప్రమేయం ఉన్నట్లు తేలితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు.

చిరుతపులి హంతక ముఠా అరెస్టు

ముగ్గురు నిందితుల అరెస్టు: సీపీ

చిరుత పులి చర్మంతో నిందితులు

గోదావరిఖని: చిరుతపులి హంతక ముఠాను రామగుండం కమిషనరేట్ పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని పోలీసు కమిషనరేట్‌లో బుధవారం కమిషనర్ వి.సత్యనారాయణ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరి మండలం మరుపల్లిలో చిరుతపులిని చంపి, చర్మం తీసి మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్స గ్రామంలో విక్రయించడానికి వస్తున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో గడ్చిరోలి జిల్లా అహేరి గ్రామానికి చెందిన కొండగోర్ల తిరుపతి, బస్వాపూర్ గ్రామానికి చెందిన సదిమిక్ గంగారాం, కోయట గ్రామానికి చెందిన వెలది తులసీరాంను అరెస్టు చేశారు. గోర్లతో సహా చిరుత పులి చర్మాన్ని స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ సీఐ మాదాసు రాజకుమార్, సీఐ టి.కిరణ్, ఎస్సై షేక్ మస్తాన్, కానిస్టేబుళ్లు రాజేందర్, సంజీవ్, శ్రీనివాస్, ప్రకాష్, మల్లేష్, చంద్రశేఖర్, సునీల్, హోంగార్డు హైదర్‌ను కమిషనర్ అభినందించారు.

ఎన్టీపీసీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్ (రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని ఏడో యూనిట్‌లో సాంకేతిక కారణంగా అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఏడో యూనిట్‌లోని టర్బయిన్‌లో బుధవారం సాంకేతిక లోపం ఏర్పడినట్లు గుర్తించిన అధికారులు యూనిట్‌ను నిలుపుదల చేశారు. దీంతో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. టర్బయిన్ మరమ్మతులు 15 రోజులు కానున్నట్లు సమాచారం.

యూట్యూబ్‌లో చూసి కిరాతకం!

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రెండ్రోజుల క్రితం జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. పోలీసులకు ఆధారాలు దొరక్కుండా చేయడం కోసం నిందితులు యూట్యూబ్‌లో పలు క్రైం సీన్స్ చూసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. బుధవారం కమిషనర్ కార్తికేయ కేసు వివరాలను వెల్లడించారు. నిజామాబాద్‌లోని ఆర్యనగర్‌లో నివాసముండే రాజవరపు లక్ష్మి (43) సోమవారం తన ఇంట్లో హత్యకు గురైంది. డబ్బుల కోసం ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులు ఘటనా స్థలంలో పసుపు, కారం పొడి చల్లారు. అలాగే, కేసును తప్పుదోవ పట్టించేందుకు

నిజామాబాద్‌లో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

కాలి వేలిని నరకడంతో పాటు మృతదేహం ఎదుట దీపం పెట్టి వెళ్లారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు.. రెండ్రోజుల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నారు. లక్ష్మి భర్త శ్రీనివాస్ వద్ద పని చేసే నాగరాజుతో పాటు అతడి మిత్రుడు నగేశ్‌కుమార్ అలియాస్ నాగరాజు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. డబ్బుల వ్యవహారంలో శ్రీనివాస్ తమను ఇబ్బంది పెట్టాడని కక్ష పెంచుకున్న నిందితులు.. ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సీపీ వెల్లడించారు. పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఏం చేయాలో తెలుసుకునేందుకు యూట్యూబ్‌లో క్రైం సీన్స్ చూసి ఈ హత్య చేశారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం -VII
(చట్టం-30/2013లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్-(1) రూల్ 25 (ప్రకారం)
కలెక్టర్/ సంయుక్త కలెక్టర్/ స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

రూఢీ ప్రకటన

ఫైలు నెం. ఎఫ్/51/2017, తేదీ: 12-06-2019

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టరు నల్లగొండ గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరిచిన నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం వెంకెపల్లి గ్రామములో భూమి విస్తీర్ణం ఎ.300.24గం గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా శివన్నగూడెం రిజర్వాయర్ కొరత్లె రీచ్ 0.000 నుండి 5.875 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని నిర్ధయించినారు.

కావున నల్లగొండ జిల్లాలో మర్రిగూడ మండలం, వెంకెపల్లి గ్రామములో భూమి విస్తీర్ణం ఎ.300.24గం గుంటల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన భూమి ప్రజా ప్రయోజనార్థం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా శివన్నగూడెం రిజర్వాయర్ కొరత్లె రీచ్ 0.000 నుండి 5.875 వరకు అవసరమై నందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూలు
గ్రామం: వెంకెపల్లి మండలం: మర్రిగూడ జిల్లా: నల్లగొండ

క్ర. నెం.	సర్వే నెం./భూమి స్వభావము, విస్తీర్ణము (ఎ.గుం.)	భూసేకరణ విస్తీర్ణం (ఎ. గుం.)	పట్టాదారు/అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు	చెట్లు/కట్టడములు	హద్దులు
1	2	3	4	5	6
1	5 ఖుష్కీపట్టా 0.10గం	0.10గం	బోయపల్లి దామోదర్ తండ్రి సైదులు	-	తూ:1 ప:1 ఉ:4, ద:6
2	6 ఖుష్కీపట్టా 1.31	1.31	దూసరి యాదమ్మ భర్త సత్యనారాయణ	4 బోర్లు, 1 బావి, 1 పశువుల కొట్టం, 50 తాటి చెట్లు	తూ:1 ప:1 ఉ:5, ద:7
3	9 ఖుష్కీపట్టా 3.04	2.39	పాతం మహేందర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-	తూ:7 ప:1 ఉ:1 ద:10
		0.05	పాతం సుజాత భర్త రాంరెడ్డి	1 బోరు	
4	10 ఖుష్కీపట్టా 2.19	2.19	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	తూ:8, ప:1,ఉ:1 ద:1
5	11 ఖుష్కీపట్టా 1.01	1.01	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	తూ:20, ప:12,ఉ:10, ద:16
6	12 ఖుష్కీపట్టా 1.19	1.19	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	తూ:11, ప:13,ఉ:1, ద:14
7	13 ఖుష్కీపట్టా 1.04	1.04	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	తూ:12, ప:1,ఉ:1, ద:14
8	14 ఖుష్కీపట్టా 2.01	2.01	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	తూ:16, ప:65,ఉ:12, ద:82
9	15 ఖుష్కీపట్టా 1.27	0.33	పాతం మహేందర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	-	తూ:18 ప:82 ఉ:16 ద:82
		0.34	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	
10	16 ఖుష్కీపట్టా 2.03	1.02	పాతం మహేందర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి	1 బావి	తూ:17 ప:1 ఉ:1 ద:15
		1.01	పాతం సుజాత భర్త రాంరెడ్డి	-	
11	18 ఖుష్కీపట్టా 2.13	02.05	కాగు జంగయ్య తండ్రి రాములు	1బోరు, 1 బావి, 2 తాటిచెట్లు	తూ:39 ప:17 ఉ:23 ద:82
		00.03	దూసరి పద్మయ్య తండ్రి అంజయ్య	1బోరు, 1 బావి, 6 తాటిచెట్లు	
		00.02గం	దూసరి యాదయ్య తండ్రి అంజయ్య	1 బావి, 2 బోర్లు	
		00.02గం	దూసరి యాదమ్మ భర్త సత్యనారాయణ	-	
12	24 ఖుష్కీపట్టా 0.24	0.24	దూసరి యాదమ్మ భర్త సత్యనారాయణ	5 తాటిచెట్లు	తూ:1, ప:23,ఉ:6, ద:39
13	25 ఖుష్కీపట్టా 8.28	6.03	పాతం యాదగిరి రెడ్డి తండ్రి బుగ్గారెడ్డి	5 తాటి చెట్లు	తూ:26 ప:1 ఉ:1 ద:1
		2.25	పేరుమాండ్ల వెంకయ్య తండ్రి చంద్రయ్య	1 బోరు, 1బావి, పైప్‌లైన్, 10 టేకు చెట్లు, 2 వేపచెట్లు, 3 చింత చెట్లు	
14	26 ఖుష్కీపట్టా 0.35	0.35	కర్నాటి భారతమ్మ భర్త అంతయ్య	30 తాటిచెట్లు	తూ:27, ప:25,ఉ:1, ద:35
15	27 ఖుష్కీపట్టా 0.10	0.10	కర్నాటి భారతమ్మ భర్త అంతయ్య	-	తూ:28, ప:26,ఉ:1, ద:34
16	28 ఖుష్కీపట్టా 0.12	0.12	కర్నాటి భారతమ్మ భర్త అంతయ్య	-	తూ:విది, ప:27,ఉ:1, ద:29
17	39 ఖుష్కీపట్టా 0.08	0.08	నుద్రి వెంకటరెడ్డి తండ్రి గోపాలిరెడ్డి	-	తూ:38, ప:18,ఉ:1, ద:82
18	40 ఖుష్కీపట్టా 1.25	1.25	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	1 బోరు, 1 బావి, పైప్‌లైన్	తూ:52, ప:42,ఉ:82, ద:41
19	41 ఖుష్కీపట్టా 1.22	1.22	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	1 బావి, పైప్‌లైన్	తూ:51, ప:42,ఉ:40, ద:48
20	43 ఖుష్కీపట్టా 1.00	1.00	బొల్లెపల్లి అంజయ్య తండ్రి లింగయ్య	1బోరు, 1 బావి, 3 తాటిచెట్లు	తూ:45, ప:42,ఉ:42, ద:44
21	44 ఖుష్కీపట్టా 0.33	0.03	పాతం వెంకటరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	4 తాటిచెట్లు, 1 తుమ్మచెట్లు	తూ:45, ప:42,ఉ:43, ద:82
		0.06	పాతం విఠలరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	
		0.05	బోడ అందాలు భర్త వెంకటయ్య	-	
		0.19	బొల్లెపల్లి కాటయ్య తండ్రి లింగయ్య	-	
22	45 ఖుష్కీపట్టా 0.24	0.01	పాతం వెంకటరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	తూ:47, ప:43,ఉ:42, ద:82
		0.05	పాతం విఠలరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	
		0.09	బొల్లెపల్లి కాటయ్య తండ్రి లింగయ్య	-	
		0.09	బోడ అందాలు భర్త వెంకటయ్య	-	
23	46 ఖుష్కీపట్టా 1.04	0.20	బోడ అందాలు భర్త వెంకటయ్య	1 బోరు, 1 తాటి చెట్లు, 2 వేపచెట్లు	తూ:48, ప:45,ఉ:47, ద:82
		0.20	బొల్లెపల్లి కాటయ్య తండ్రి లింగయ్య	1 బోరు, 2 తాటి చెట్లు, 3 వేపచెట్లు	
		0.01	పాతం వెంకటరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	
		0.03	పాతం విఠలరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	
24	47 ఖుష్కీపట్టా 0.04	0.04	పాతం భూపతిరెడ్డి తండ్రి దామోదర్ రెడ్డి	1బోరు	తూ:48, ప:45,ఉ:41, ద:46
25	48 ఖుష్కీపట్టా 0.18	0.05	పాతం విఠలరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	-	తూ:49, ప:47,ఉ:41, ద:82
		0.07	బోడ అందాలు భర్త వెంకటయ్య	-	
		0.06	బొల్లెపల్లి కాటయ్య తండ్రి లింగయ్య	-	
26	51 ఖుష్కీపట్టా 1.00	0.20	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	-	తూ:53, ప:40,ఉ:52, ద:82
		0.20	శిరిపురగడ వెంకటేశ్వర్ రావు తండ్రి రాంకిషన్‌రావు	-	
27	53 ఖుష్కీపట్టా 0.12	0.06	శిరిపురగడ హను మంతరావు తండ్రి రాంకిషన్‌రావు	-	తూ:54, ప:51,ఉ:54, ద:82
		0.06	శిరిపురగడ వెంకటేశ్వర్ రావు తండ్రి రాంకిషన్‌రావు	-	
28	58 ఖుష్కీపట్టా 10.04	2.30	పాతం అనూష తండ్రి చంద్రారెడ్డి	2 బోర్లు, పైప్‌లైన్	తూ:82, ప:60,ఉ:59, ద:82
		4.39	పాతం లక్ష్మమ్మ భర్త మల్లారెడ్డి	1 బోరు, పైప్‌లైన్	
		2.15	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	2 బోర్లు, పైప్‌లైన్	
29	59 ఖుష్కీపట్టా 7.15	3.09	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	1 బోరు, 1 తాటి	తూ:82, ప:60,ఉ:82, ద:58
		0.10	పాతం అనూష తండ్రి చంద్రారెడ్డి	పైప్‌లైన్	
		3.36	పాతం భరతరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	1 బోరు	
30	60 ఖుష్కీపట్టా 4.21	0.11	పాతం వెంకటరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	6 తాటిచెట్లు	తూ:58, ప:62,ఉ:64, ద:82
		0.10	పాతం విఠలరెడ్డి తండ్రి చెన్న క్రిష్ణారెడ్డి	10 తాటి చెట్లు	
		4.00	నేతాళ్ల భరతమ్మ భర్త అయ్యపురెడ్డి	1బోరు, 1 బావి, 10 తాటిచెట్లు, 1 దొడ్డి	
31	62 ఖుష్కీపట్టా 1.02	1.02	గుసగంటి సత్యనారాయణ తండ్రి యెర్ర రాములు	10 తాటి చెట్లు	తూ:60, ప:71,ఉ:63, ద:82
32	63 ఖుష్కీపట్టా 1.00	1.00	గుసగంటి సత్యనారాయణ తండ్రి యెర్ర రాములు	9 తాటి చెట్లు	తూ:60, ప:71,ఉ:82, ద:62
33	64 ఖుష్కీపట్టా 0.03	0.03	గుసగంటి పద్మయ్య తండ్రి మల్లయ్య	3 మామిడి చెట్లు, 1 జామ చెట్లు	తూ:42, ప:63,ఉ:82, ద:63
34	67 ఖుష్కీపట్టా 2.18	2.18	తుమ్మల అమరేందర్ తండ్రి పాపయ్య	1 బోరు, పైప్‌లైన్, 11 తాటి చెట్లు	తూ:65, ప:68,ఉ:82, ద:71
35	68 ఖుష్కీపట్టా 8.21	4.20	తుమ్మల పాపయ్య తండ్రి పెద్దయ్య	2 బోర్లు, 10 తాటిచెట్లు	తూ:67, ప:73,ఉ:82, ద:70
		2.20	తుమ్మల వరప్రసాద్ తండ్రి పాపయ్య	2 బోర్లు, 15 తాటి చెట్లు	
		1.21	అన్నెబోయిన హేమలత భర్త తిరుపతయ్య	1 బోరు, 12 తాటిచెట్లు	
36	69 ఖుష్కీపట్టా 0.08గం	0.08గం	గుసగంటి సత్యనారాయణ తండ్రి ఎర్ర రాములు	5 తాటి చెట్లు	తూ:70, ప:72,ఉ:68, ద:72
37	70 ఖుష్కీపట్టా 1.13గం	0.30గం	తుమ్మల పాపయ్య తండ్రి పెద్దయ్య	-	తూ:71, ప:69,ఉ:68, ద:71
		0.23	మైరం వెంకటయ్య తండ్రి ముత్తయ్య	1 బోరు	
38	71 ఖుష్కీపట్టా 4.25గం	3.05గం	తుమ్మల పాపయ్య తండ్రి పెద్దయ్య	25 తాటిచెట్లు	తూ:62, ప:72,ఉ:70, ద:82
		1.20	గుసగంటి సత్యనారాయణ తండ్రి ఎర్ర రాములు	-	
39	72 ఖుష్కీపట్టా 1.02	1.02	గుసగంటి సత్యనారాయణ తండ్రి ఎర్ర రాములు	1 బావి, 1 బోరు, పైప్‌లైన్, 18 తాటి చెట్లు	తూ:71, ప:73,ఉ:68, ద:82
40	77 ఖుష్కీపట్టా 0.15	0.15	సముద్రాల విజయ రంగారావు తండ్రి మాధవరావు	5 తాటి చెట్లు	తూ:82, ప:80,ఉ:76, ద:80
41	79 ఖుష్కీపట్టా 0.20	0.20	ఎర్రల రాములు తండ్రి బుగ్గయ్య	-	తూ:75, ప:81,ఉ:82, ద:80
42	83 ఖుష్కీపట్టా 0.01	0.01	ఆల్వాల పోచమ్మ భర్త వెంకయ్య	-	తూ:85, ప:82,ఉ:84, ద:82
43	86 ఖుష్కీపట్టా 12.08	0.18	షేక్ నిరంజన్ తండ్రి జహంగీర్	-	తూ:87, ప:85,ఉ:85, ద:82
		0.18	షేక్ మొహమ్మద్ తండ్రి జహంగీర్	-	
		0.18	షేక్ హైదర్ తండ్రి జహంగీర్	-	
		0.18	షేక్ యూసుఫ్ తండ్రి జహంగీర్	1 బోరుబావి	
		3.19	మాదగోని సత్తయ్య తండ్రి రామయ్య	1 రింగుల బావి	
		3.18గం	మాదగోని సర్వింహ్మ తండ్రి రాములు	1 బోరుబావి	
		3.18గం	మాదగోని క్రిష్ణయ్య తండ్రి రామయ్య	1 బోరుబావి	
44	90 ఖుష్కీపట్టా 4.04	1.10	జటోతు భలు తండ్రి మోత్య	-	తూ: 91, ప:82,ఉ:97, ద:89
		2.34	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	-	
45	91 ఖుష్కీపట్టా 6.29	1.00	జటావత్ రాంజి తండ్రి పూర్య	-	తూ: 94, ప:90,ఉ:96, ద:82
		1.00	జటావత్ తంజర్ తండ్రి సీత్యా	-	
		3.20	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	1 బోరుబావి, పైప్‌లైన్, 1 రింగుబావి	
		0.09	పాతం భరతరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	-	
		1.00	జటావత్ జగ్న తండ్రి శేత్య	-	
46	92 ఖుష్కీపట్టా 0.17	0.17	మేఘావత్ దేశిరాం తండ్రి భాగ్య	-	తూ:1, ప:91,ఉ:93, ద:82
47	94 ఖుష్కీపట్టా 4.38	1.26	మేఘావత్ నరహరి తండ్రి జైత్‌రాం	3 బోర్‌వెల్, 1 రింగువెల్, పైప్‌లైన్ 10 తాటిచెట్లు	తూ:132, ప:91,ఉ:95, ద:93
		1.26	మేఘావత్ వడ్డి తండ్రి జైత్‌రాం	2బోర్లు, పైప్‌లైన్, 6 కొబ్బరి	
		1.26	మేఘావత్ హుమ్య తండ్రి జైత్‌రాం	2 బోర్లు, పైప్‌లైన్, 10 తాటి	
48	95 ఖుష్కీపట్టా 5.27	2.33	పాతం కిరణ్‌కుమార్ రెడ్డి తండ్రి ధర్మారెడ్డి	1 బోరుబావి, పైప్‌లైన్	తూ: 131, ప:96,ఉ:98, ద:94
		1.17	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	1 బోరుబావి, పైప్‌లైన్, 1 రింగుల బావి	
		1.17	పాతం భరతరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	1 బోరుబావి, పైప్‌లైన్	
49	97 ఖుష్కీపట్టా 0.10	0.01	మోర్త లచ్చయ్య తండ్రి మైసయ్య	-	తూ: 96, ప:82,ఉ:99, ద:90
		0.09	పాతం చంద్రారెడ్డి తండ్రి మల్లారెడ్డి	-	
50	98 ఖుష్కీపట్టా 1.00	1.00	నేనావత్ హరి తండ్రి గాన్య	-	తూ:123, ప:99,ఉ: 114,ద:96
51	99 ఖుష్కీపట్టా 1.35	0.31	బద్దుల అయిల య్య తండ్రి బిక్షపతి	1 బోరుబావి, పైప్‌లైన్, 10 తాటి	తూ: 98, ప:100,ఉ: 111,ద:97
		0.01	మాల్ల ముత్తమ్మ భర్త సత్తయ్య	-	
		1.03	తాండ్ర జంగయ్య తండ్రి సర్వింహ్మ	1 బోరుబావి, రింగుల బావి	
52	100 ఖుష్కీపట్టా 3.05	0.20	జటావత్ ధర్మా తండ్రి చట్యా	-	తూ: 99, ప:109,ఉ: 111,ద:82
		2.03	మర్ల లచ్చయ్య తండ్రి మైసయ్య	-	
		0.22	బద్దుల బలయ్య తండ్రి బిక్షపతి	-	
53	101 ఖుష్కీపట్టా 8.18	0.12	జాటోతు లచ్య తండ్రి శక్రు	-	తూ: 82, ప:102,ఉ: 103,ద:వి.వి.
		0.12	జాటోతు పాండు తండ్రి శక్రు	-	
		1.20	జాటోతు గిరి తండ్రి లచ్య	-	
		2.07	జాటోతు ధర్మ తండ్రి శట్య	1 బోరు బావి	
		2.07	జాటోతు ధార్యా తండ్రి పూర్య	-	
		1.00	జాటోతు గన్య తండ్రి బీక్ష	-	
		1.00	జాటోతు గాన్య తండ్రి లాలు	1 రింగుల బావి	
54	103 ఖుష్కీపట్టా 1.21	0.25	జటోతు లచ్య తండ్రి లాలు	1 రింగుల బావి, పైప్‌లైన్	తూ: 100, ప:104,ఉ: 108,ద:102
		0.13	జటోతు కాలు తండ్రి మోత్య	1 రింగుల బావి, పైప్‌లైన

ప్రయాణికుల్లా వచ్చి..

- ఏబీవీపీ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం
- బస్సులు, ఆటోల్లో శాసనసభ పరిసరాల్లోకి రాక
- ఒక్కసారిగా గేట్ నంబర్-2 ఎక్కి విద్యార్థుల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు, లాఠీచార్జ్.. 224 మంది అరెస్టు

బుధవారం అసెంబ్లీ ముట్టడికి వచ్చిన ఓ విద్యార్థినిని అదుపులోకి తీసుకుంటున్న మహిళా పోలీసులు

హైదరాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తోందంటూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనకారులు ఇటీవల ఎన్నడూలేని విధంగా అసెంబ్లీ గేట్ నంబర్-2 వరకు పెద్దసంఖ్యలో రాగలిగారు. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు జిల్లాల నుంచి ముందస్తు వ్యూహంతో బయలుదేరిన ఏబీవీపీ కార్యకర్తలు సాధారణ ప్రయాణికుల మాదిరిగా, గరిష్టంగా పదిమంది చొప్పున ఆర్టీసీ బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణించారు. జెండాలు ఎవరి కంటా పడకుండా వాహనాలు దిగే వరకు జేబుల్లోనే ఉంచుకున్నారు. అసెంబ్లీ చుట్టూ ఉన్న తెలుగు యూనివర్సిటీ, నిజాం కళాశాల వైపుల నుంచి బస్సులు, ఆటోల ద్వారా వచ్చి.. రవీంద్రభారతి, ఆ చుట్టుపక్కల దిగారు. ఉదయం 11.20 నిమిషాలకు ఒక్కసారిగా 1, 2 నంబర్ల అసెంబ్లీ గేట్ల వైపు దూసుకొచ్చారు. గేట్-2 వద్దకు చేరుకుని, ఎక్కేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. వారిని కిందికి దింపే క్రమంలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు లాఠీచార్జీ చేశారు. గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించిన వారిని కిందకు లాగేశారు. లాఠీచార్జిలో రాష్ట్ర నాయకులు పృథ్వి సొమ్మసిల్లి పడిపోయాడని, నిహారిక, నరేంద్ర, మల్లికార్జున్‌ల చేతులకు తీవ్ర గాయాలయ్యాయని ఏబీవీపీ నాయకులు అంబాల కిరణ్, సుమన్‌శంకర్, రాఘవేంద్ర తెలిపారు. ముట్టడిలో పాల్గొన్న ఏబీవీపీతో పాటు పీడీఎస్‌యూ నాయకులు 224 మందిని సైఫాబాద్ పోలీసులు అరెస్ట్‌చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. వీరిపై 151 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొందరు కార్యకర్తలపై నాన్-బెయిలబుల్ కేసులు సైతం నమోదు చేసిన పోలీసులు వారికి నోటీసులిచ్చి విడిచిపెట్టారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, యూనివర్సిటీలలో వైస్‌చాన్సలర్లను నియమించాలని, జూనియర్, డిగ్రీ కాలేజీలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్లతో ఏబీవీపీ ఈ కార్యక్రమం చేపట్టింది. పీడీఎస్‌యూకు చెందిన విద్యార్థి నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: ఏబీవీపీ పిలుపు

విద్యార్థులపై లాఠీచార్జీని నిరసిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు ఏబీవీపీ పిలుపునిచ్చింది. 24 గంటల్లోగా సీఎం కేసీఆర్ స్పందించి, లాఠీచార్జీ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోకపోతే.. శుక్రవారం తెలంగాణవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునివ్వడానికీ వెనుకాడబోమని హెచ్చరించింది. అరెస్ట్ చేసిన విద్యార్థులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఇటలీలో తెలంగాణ విద్యార్థుల గగ్గోలు

- విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 16 మంది విద్యార్థులు
- కోవిడ్ కారణంగా ఇండియాకు వెళ్లేందుకు ఆ దేశం నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ విజృంభిస్తుండటంతో ఇటలీకి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అక్కడ ఉంటున్న తెలంగాణ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటలీలో ఎంఎస్ చదువుతున్న, చదువు పూర్తయిన 16 మంది తెలంగాణ విద్యార్థులు స్వదేశానికి రావాలని ప్రయత్నిస్తుండగా ఆ దేశం నిరాకరిస్తోంది. కోవిడ్ భయంతో వారిని రోమ్ ఫిమిసినో విమానాశ్రయంలో అధికారులు నిలిపివేశారు. తెలంగాణ విద్యార్థులతోపాటు కేరళ, బెంగళూరు, నాగ్‌పూర్‌కు చెందిన విద్యార్థులు విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. మెడికల్ సర్టిఫికెట్ తీసుకొస్తేనే విమానంలోకి అనుమతిస్తామని ఎయిర్‌పోర్ట్ అధికారులు స్పష్టంచేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వేడుకుంటున్నారు. ఇటీవల ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి ముందు వారికి పరీక్షలు జరిపి, కోవిడ్ నెగిటివ్ అని నిర్ధారణ అయిన తర్వాతే ఇక్కడకు తీసుకొచ్చారని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఇటలీలో చిక్కుకున్నవారి విషయంలో ఏం చేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి ఈటల ఫోన్...

ఇటలీలో చిక్కుకున్న 16 మంది తెలంగాణ విద్యార్థులను రప్పించే విషయంపై తాను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హర్షవర్ధన్‌తో ఫోన్ లో మాట్లాడినట్లు తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం రాత్రి 'సాక్షి'కి తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఎలాగైనా మన విద్యార్థులను రప్పించేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టంచేశారు.

త్వరపడండి, ఆఫర్ పరిమితమైన BS4 స్టాకుపై లభ్యమౌతోంది.

మోడల్	తిన్నగా వచ్చే ప్రయోజనం (₹)	ఎక్స్‌ఛేంజ్ ప్రయోజనం (₹)	కార్పొరేట్ ప్రయోజనం (₹ వరకు)	మొత్తం ప్రయోజనం (₹ వరకు)
M8	2 24 000	25 000	7 000	2 56 000
M6	172 000	25 000	7 000	2 04 000
M4	41 000	15 000	7 000	63 000

CHOOSE TOGETHER. CHOOSE RIGHT.
MARAZZO

ఇతర డీజెల్ MPVలతో పోలిస్తే. ఇంజన్ ఐడిల్‌గా ఉన్నప్పుడు డ్రైవర్ చెవి దగ్గర 43dB. ఎయిర్ స్పీడ్ 36m/s. బోల్డర్ రూమ్ 1వ మరియు 2వ వరుసలలో మరియు లెగ్ రూమ్ 3వ వరుసలో. షరతులు, నిబంధనలు వర్తిస్తాయి. వెహికల్ రంగు చూపబడిన చిత్రాల కన్నా వేరుగా ఉండవచ్చు.మరింత సమాచారానికై మీకు దగ్గరలో ఉన్న మహీంద్రా డీలర్‌షిప్‌కి రండి.

SANSAI AUTO SERVICES PVT. LTD: NALGONDA, SURYAPET, MIRYALGUDA: 8448005424.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com